1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 6
పుటలు : 52
రు. 25 లు
ISSN NO : 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



## మన చదువుల కథలు: ఎవరు తెలివి గలవారు?!

"...జనంగానీ మేధావులుగానీ ఇప్పుడెందుకు నిస్తేజంగా ఉన్నారనేదే పెద్దప్రశ్న, మహారాజా! ఇది చాలా లోతుగా ఆలోచించాల్సిన విషయం. చాలా మంది మేధావుల, విద్యావేత్తల అభిప్రాయం ఏమిటంటే- బడి, ఆ బడిలో చదువులే ఇందుకు కారణం. ఆలోచనపరులుగా, విజ్ఞులుగా తయారు చేయకుండా, కర్మాగారాల్లో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్ని మాత్రమే తయారు చేస్తున్నవి. బడిలో ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా వ్యతిరేకించకుండా ప్రశ్నించకుండా ప్రేక్షకుల్లా అనేక సంవత్సరాలు చదువుకొన్న ఫలితమే- అంటున్నారు

* తెలుగు విదేశీ సంస్థ నిర్మిస్తున్న భాషానిధి
* పనిస్థలాల్లో దేశీయ భాషల వాడుక
* యంత్రానువాద వ్యవస్థ
* గుర్తింపునోచని తెలుగు శాస్త్రవారసత్వం
* గుడింతానికి సంబంధం లేని తెలుగు అక్షరాలు
* తెలుగువాళ్లు మరచిన అనువాదకుడు
* వ్యవహార భాషకు అడుగుజాడ
* అమృత భారతమా అడుగులు ఎటు
* వరకట్నాన్ని నిరసించిన మౌలానా ఆజాద్
* జానపద వృత్తిపురాణాలు -పటం కథలు
* 'కరమజోవ్ సోదరుల'కు స్వాగతం

మన కళ్లను మనమే పొడిచివేసుకొంటున్నాం..
మన బ్రతుకుల్ని మనమే కాల్చివేసుకొంటున్నాం

# అందరూ చదివితీరవలసిన రెండు చరిత్ర పరిశోధనలు

## వెంటనే కొని చదవండి




మద్రాసు ప్రెసిడెన్సీలో తొలి ప్రజాపోరాట యోధుడు

**గాజుల లక్ష్మీనరసు చెట్టి**

గాజుల లక్ష్మీనరసు చెట్టి(1806-1868) మద్రాస్ ప్రెసిడెన్సీలో 19వ శతాబ్ది ప్రజాఉద్యమ నిర్మాత, నిర్దేశకుడు. ఆయన కుటుంబం ఆంధ్ర తీరప్రాంతం(మచిలీపట్నం) నుండి మద్రాసు వలసవెళ్ళిన కుటుంబం. ఆయన చిన్నతనం నుండే సామాజిక దృష్టిని పెంపొందించుకొన్నాడు. సమకాలీన సాహిత్య సంఘాల చర్చలు, ఉపన్యాసాల్లో పాల్గొని, తన ఆలోచనాపరిధిని విస్తరించుకున్నాడు. వలస ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలపై గళమెత్తి, పోరాటం సాగించిన తొలి రాజకీయ వైతాళికుడు. మద్రాసు గవర్నర్ శాసనమండలి సభ్యుడిగా ప్రజాప్రతినిధుల ఎన్నిక విధానంపై ఆయన స్పందించాడు. ప్రజాహక్కులు, పౌర ప్రజాస్వామ్య పద్ధతులపై తన వాదనను బలంగా వినిపించాడు. సమకాలీన మేధావులు ముక్తకంఠంతో లక్ష్మీనరసు చెట్టిని మద్రాస్ ప్రెసిడెన్సీలో 'తొలి ప్రజాపోరాట యోధుడు'గా వర్ణించారు. ఆయన జీవితచరిత్ర భావితరాలకు శిరోధార్యం.

వెల: రూ. 100/-

ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ.

వారి అన్ని బ్రాంచీలలో లభిస్తుంది.




తాడిత పీడితజనుల కోసం బ్రిటీషువారితో పోరాడిన

**ద్వారబంధాల చంద్రయ్యదొర**

అల్లూరి సీతారామరాజుకంటే 45 సంవత్సరాల ముందు తెలుగుగడ్డపై బ్రిటీషువారినెదిరించి వారిపై పోరాటం చేసి, అసువులు బాసిన అమర యోధుడొకడున్నాడని తెలుసా? అతడే తన తర్వాతి వారందరికీ స్ఫూర్తినిచ్చిన స్వాతంత్ర్యయోధుడు ద్వారబంధాల చంద్రయ్యదొర. స్వాతంత్ర్యం కోసం, తాడిత పీడిత జనులకోసం, గిరిజనుల కోసం తనను తాను అంకితం చేసుకున్న వీరుడితడు. తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని బురదకోటను స్థావరంగా చేసుకొని బ్రిటీషువారిపై పోరాటం చేసి, వారికి సింహస్వప్నమైనాడు. ఇతనిని కుట్ర పూరితంగా బందీని చేసి కిర్లంపూడిలో చెట్టుకు వ్రేలాడదీసి కాల్చిచంపారు ఆ పాలకులు. చంద్రయ్య దొర తూర్పుగోదావరి జిల్లా తొలి స్వాతంత్ర్య సమరయోధుడు. ఇతని పోరాటం తదుపరి భారత స్వాతంత్ర్య పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. మరుగునపడిపోయిన ఆ చరిత్రను వెలికితీసి చూపే దీపం ఈ పొత్తం.

వెల: రూ. 99/- ప్రతులకు:

1. తెలుగు బుక్‌హౌస్ 3-3-862, ఆర్యసమాజ్ రోడ్డు కాచీగూడ హైదరాబాద్ - 500027.

2.రచయిత కోటిపల్లి సుబ్బారావు గారిని సంప్రదించండి ఫోన్:9491524786

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...




నవంబరు 2021


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | మన కళ్లను మనమే పొడిచివేసుకొంటున్నాం.. మన.... | | **05** |
| **జర్మనీ లేఖ:** | అమ్మభాషతో అవినీతి నిర్మూలన | **శ్రీగణేశ్ తొట్టెంపూడి** | **07** |
| **దేశీయ భాషల వాడుక :** | పనిస్థలాల్లో దేశీయ భాషల వాడుక | **జె.డి.ప్రభాకర్** | **09** |
| **పరిశోధన:** | యంత్రానువాద వ్యవస్థ | **గారపాటి ఉమామహేశ్వరరావు** | **13** |
| **మన చదువుల కథలు:** | ఎవరు తెలివి గలవారు?! | **సి.వి.క్రిష్ణయ్య** | **17** |
| **తెలుగు లిపి:** | గుడింతానికి సంబంధం లేని... | **జూపూడి బాలస్వామి** | **20** |
| **వారసత్వ సంపద:** | గుర్తింపు నోచుకోని తెలుగు..... | **పి.శివరామకృష్ణ'శక్తి'** | **21** |
| **గుర్తుచేసుకుందాం:** | తెలుగువాళ్ళు మరచిన అనువాదకుడు | **కొల్లేటి రవిబాబు** | **23** |
| **స్మృతి :** | వ్యవహారిక భాషకు అడుగుజాడ | **ప్రవీణ్ యజ్జల** | **25** |
| **75 ఏళ్ల స్వతంత్రం :** | అమృత భారతమా!అడుగులు... | **గోవిందరాజు చక్రధర్** | **27** |
| **జయంతి:** | వరకట్నాన్ని నిరసించిన.... | **షేఖ్ మహబూబ్ బాషా** | **29** |
| **వృత్తిపురాణాలు:** | జానపద వృత్తిపురాణాలు-పటం కథలు | **సునీల్ బోయిన** | **33** |
| **సాహిత్యరంగం:** | 'కరమజోవ్ సోదరులకు'.. | **మధురాంతకం నరేంద్ర** | **39** |
| **పుస్తక పరిచయం:** | | | **49** |
| **నవల:** | మా ఊరు | **అగరం వసంత్** | **41** |
| **ఆత్మకథ:** | కొయ్యబొమ్మ.. | **చంద్రప్పసోబటి/రంగనాథరామచంద్రరావు** | **45** |
| **ధారావాహిక:** | అడుగుజాడలూ ఆనవాళ్లు-12 | **ఈమని శివనాగిరెడ్డి** | **36** |
| **కవిత:** | ప్రేమ సమాధులపై మాత్రం.... | **కత్తి పద్మారావు** | **32** |



| కార్టూన్లు | రేఖాచిత్రాలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి, శేఖర్** | **చిదంబరరావు** | **బండారు రఘురాం** |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు  మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా **'అమ్మనుడి'** పత్రిక చందా పంపవచ్చు
నెం. '94929 80244'తో
బిజినెస్ ఆప్షన్‌లోకి వెళ్ళి

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

ఎంట్రీ చేసి పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు. **94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**

సంపుటి : 7 సంచిక : 6
అమ్మనుడి
నవంబరు 2021

సంపాదకీయం

## మన కళ్లను మనమే పొడిచివేసుకొంటున్నాం
## మన బ్రతుకుల్ని మనమే కాల్చివేసుకొంటున్నాం

**అ**న్నిటికంటే బలమైన శాస్త్రం రాజకీయశాస్త్రం అంటాడు రాజనీతి శాస్త్రవేత్త, అర్థశాస్త్ర గ్రంథకర్త ఆచార్య చాణుక్యుడు. పాలనా నిర్ణయాధికారం పాలకుల చేతుల్లో వుంటుందని, అందువల్ల రాజకీయాలు ప్రజలమేలు అనే కట్టుబాటును దాటితే సమాజ విధ్వంసానికి దారితీస్తుందని, కనుక పాలకులు నిరంతరం జాగరూకతతో ఉండాలని ఆయన భావం. ఆయన క్రీ.పూ. 350 ఏళ్ళనాటివాడు.

నాటికీ నేటికీ ఎన్ని తరాలు గడిచినా, భౌగోళిక, ప్రాకృతిక స్థితిగతులు రూపుమార్చుకొన్నా ఏదోవిధమైన పాలనావ్యవస్థలు ఉండక తప్పడంలేదు. కనుక ఆ పాలకుల విధానాలను బట్టి, నిర్ణయాలనుసరించి ప్రజల మనుగడ, బాగోగులు ఆధారపడి ఉంటాయి. ఆటవిక రాజ్యాలు, రాజరికాలు పోయి, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలు, సైనిక నియంతృత్వ వ్యవస్థలు ఏలుబడిలోకొచ్చినా– ప్రజలమేలు అనే కట్టుబాటును దాటనంతవరకే వాటికి ప్రజాదరణ ఉంటుంది. ఆ కట్టుబాటును తెంచుకొని అవి విశృంఖలతను ప్రదర్శించినప్పుడు వాటికి రోజులు దగ్గరపడతాయి.

ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల్లో సైద్ధాంతిక సంఘర్షణ అనివార్యం. తమ సిద్ధాంతాల ప్రాతిపదికన భిన్న రాజకీయ పక్షాలు అధికారం కోసం పోటీపడినప్పుడు ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టిన తర్వాత నిర్ణీత వ్యవధిలో ప్రజలను తమ పరిపాలనతో మెప్పించలేకపోతే తదుపరి ఎన్నికల్లో అవి ఓటమిపాలై ప్రతిపక్షం అధికారంలోకి రావడం సహజంగా జరిగిపోతుంది. దానితో ఆర్థిక రంగంలో, అనేక దేశీయ రంగాల్లో ఎన్నయినా మార్పులుండవచ్చు. అవన్నీ ఆయా పార్టీ ప్రభుత్వాలు నిర్ణీత లక్ష్యాల సాధనకై అనుసరించే విధానాలలో మార్పులేతప్ప, ప్రజల మౌలిక అవసరాలను, అంశాలనూ దెబ్బతీసేవి కాకూడదు.

ప్రజలంటే మానవ సమూహాలు. మనిషే కీలకం. అతడు ఈ సృష్టిలోనే అన్ని విధాలా ఎదిగిన ప్రాణి. ఆకలి తీరడం, అందరితోపాటు అభివృద్ధి చెందడానికి సర్వతోముఖ వికాసాన్నీ సమన్యాయాన్నీ పొందడానికి వీలైన సమాజంలో తాను భాగస్వామి కావడం– ఇవన్నీ ఆధునిక మానవుని మౌలిక అవసరాలు. మనిషికే ప్రత్యేకమైన పరికరం/ ఆయుధం తన భావాల్ని వ్యక్తీకరించగల శక్తి. ఆ శక్తి మనిషికి తన మాటద్వారా అంటే భాష ద్వారా వస్తుంది. ఆ భాషతోనే తన సమాజంతో తాను సంబంధాలనేర్పరచుకొని ఎదుగుతాడు. ఆ విధంగా ఈ నేల మీద పలుచోట్ల పలు సమాజాలు ఎదిగి క్రమక్రమంగా ఇప్పుడున్న వైవిధ్య భరితమైన విశాల మానవ సమాజం ఏర్పడింది. ఇది ఎన్నో భాషాజాతుల సంగమంగా ఎదుగుతున్నది.

ఇప్పుడు దేశాల సరిహద్దులలోపలా, బయటా కొన్ని భాషలు ఆధిపత్య ధోరణులను అలవరుచుకొంటున్నాయి. పెద్ద సమూహాల భాషల రాజకీయ, సామాజిక స్వార్థాలకు బలై కొన్ని చిన్న సమూహాల భాషలు కనుమరుగయ్యాయి. రాజకీయ, ఆర్థిక, వ్యాపార అవసరాల ఫలితంగా కొద్ది భాషలు ప్రపంచ భాషాజాతులపై పెత్తనం చేస్తున్నాయి. ఈ ఆధిపత్యం మానవ సమూహాల స్వతంత్ర స్వేచ్ఛాయుత ఎదుగుదలకు ఆటంకాలుగా ప్రభావం చూపుతున్నాయి. ఈ విధంగా ఇవి మానవ సమూహాలను పలువిధాలైన అణచివేతకు, దోపిడీకి గురిచేస్తున్నాయి. వీటి ఉచ్చులో తెలిసో, తప్పనిసరి అయ్యో బిగుసుకుపోతున్న దేశాల్లో మన భారతదేశం ఉన్నదని ఒప్పుకోకతప్పదు. అందులోనూ భారత దేశంలోని పెద్ద భాషల్లో రెండవదో మూడవదో అయిన తెలుగు బాగా చిక్కుకుపోయింది. ఇందువల్ల ఒక

## సంపాదక హృదయం

బలమైన భాషగా భాషాజాతిగా అతి వేగంగా మనం పతనమౌతున్నామని తెలుసుకోవాలి.

ఇందుకు ప్రధాన కారణం మన పాలక వర్గాలే. మన పాలక పార్టీలే. 'నడుస్తున్న చరిత్ర', 'అమ్మనుడి' చదువరులకు ఈ విషయంపై బాగా అవగాహన ఉంది. ప్రగతిశీల ప్రజాతంత్రవాదులకు, నిజమైన జాతీయవాద ఆలోచనాపరులకు, హేతుబద్ధంగాను, మానవీయ స్వాభిమానంతోను జీవించేవారికి ఈ పరిస్థితి తేలిగ్గా అర్థమవుతుంది. వారిలో కొందరు గొంతెత్తి మాట్లాడుతున్నారు, చేతనైనంతగా ఉద్యమిస్తున్నారు కూడా.

అయితే కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ అంటూనే స్వాభిమాన భారత్‌ను మరిచిపోయింది. సరిహద్దుల రక్షణ అంటూనే సామాజిక, సమన్యాయ సమాజ నిర్మాణం పట్ల ఆసక్తి చూపడంలేదు. జాతీయ విద్యావిధానం పేరిట ఇంతకాలంగా నడిచిన దేశీయ భాషాధిపత్యానికి కొత్త శక్తిని, కోరలను అందజేస్తూ, విదేశీ భాషాధిపత్యానికి ప్రత్యక్షంగా పరోక్షంగా అవకాశాలను తీర్చిపెట్టింది. భారతీయ ప్రజాభాషలైన మాతృభాషలను బోధనామాధ్యమ భాషలుగా కనీసం పాఠశాల స్థాయిలో తప్పనిసరి చేసేందుకు రాజ్యాంగ పరమైన చర్యలను చేపట్టడానికి ముందుకు రావడం లేదు.

ఈ పరిస్థితుల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సాధించడం కోసం ఒక రాజకీయ అంశంగా ఇంగ్లీషు మీడియం నినాదాన్ని భుజాన వేసుకొని నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరంగం వేస్తుంటే, ఇంతకు ముందటి సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన తప్పుడు విధానాలనే ఇప్పటి తెలంగాణ ప్రభుత్వమూ కొనసాగిస్తున్నది. ఏ మాతృభాష మనకు ప్రాణప్రదమో, ప్రగతికి కీలకమో, తెలుగు రాష్ట్రాల ఏర్పాటుకు ఆధారమో దానిని ధ్వంసం చేసేంత ఆత్మద్రోహానికి మన ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి.

మన కళ్లను మనమే పొడిచివేసుకుంటున్నాం. మన బతుకుల్ని మనమే కాల్చివేసుకుంటున్నాం.

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలంటే నిరంతర జాగరూకత ఎంత అవసరమో, మాతృభాషలను కాపాడుకోవడానికి కూడా అంతటి బలమైన సంకల్పమూ, ఉద్యమ కార్యాచరణా ఉండాలి.

సామల రమేష్ బాబు

తేదీ : 30-10-2021



శ్రీగణేశ్ తొట్టెంపూడి
+49 17630163660

# అమ్మభాషతో అవినీతి నిర్మూలన
## విదేశీసంస్థలు నిర్మిస్తున్న తెలుగు భాషానిధి

**గత** వారం వ్యాసంలో మనం ఆధునిక సాంకేతికతను డిజిటల్ రంగంలో సాధారణ పత్రాల నుండీ, ప్రాచీన పుస్తకాల నుండీ సేకరించి ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నాం. ఈసారి ఈ వ్యాసంలో కొంచెం భిన్నంగా శాస్త్ర సాంకేతికతను ఉపయోగించి సమాజానికి ఉపయోగపడే సాంకేతిక ఉపకరణాలను ఎలా తయారు చేయవచ్చో చూద్దాం. ముఖ్యంగా ఈ వ్యాసం గత రెండు సంవత్సరాలుగా మేం చేస్తున్న ఒక ప్రయోగాత్మకమైన ఉపకరణ నిర్మాణ పరిధిలోనిది. విభిన్న రంగాల్లో ఉపయోగించే భాషను సాంఖ్యిక (డిజిటల్) రూపంలోకి మార్చి, భాషానిధులని అభివృద్ధి చేయటంవల్ల సమాచారంలో పేరుకుపోతున్న అవినీతిని ఎలా గుర్తించవచ్చో అన్న విషయాన్ని ఈ నెల ఈ వ్యాసంలో నేను వివరించటానికి ప్రయత్నిస్తాను.

సాధారణంగా మనం నిత్య వ్యవహారంలో తెలుగు వాడితే ఏమిటి ఉపయోగం? అని అనుకుంటుంటాం. **భాష ఒక సామాన్యుడి అవసరాలను తీర్చగలిగినప్పుడే ఆ భాష ఆ సమాజం విలువలను అస్తిత్వాన్ని కోల్పోకుండా నిలుపుతుంది.** ఈ నెల అలాంటి ప్రయోగాత్మకమైన ఒక విషయాన్ని ఈ వ్యాసంలో వివరిస్తాను.

అభివృద్ధి చెందిన అమెరికా మొదలైన దేశాల్లో ఇలాంటి సాంకేతికత విస్తారంగా అందుబాటులో ఉంది. నేర పరిశోధనల్లో ఈ భాషా సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తారు. ఇంగ్లీషు భాషకి, ఐరోపా భాషలకి ఈ సాంకేతికత విరివిగా అందుబాటులో ఉంది. మనదేశంలో సామాజంలో పేరుకు పోతున్న అవినీతిని నిర్మూలించటంలో ఈ భాషా సాంకేతికత వినియోగంలో ఎలా ఉందో ఒక్కసారి చూడండి!!

ఒక భాషని ఆ భాషా సమాజం విరివిగా విస్తారంగా వాడటం వల్ల ఆ భాషలో డేటా (అనగా, ఆ భాషకు చెందిన భాషానిధి) అనేది అభివృద్ధి చెందుతుంది. సాంఖ్యిక (డిజిటల్) రూపంలో మన భాషానిధి అందుబాటులో ఉంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న కృత్రిమ బౌద్ధికతను ఉపయోగించి సమాజంలో ఉన్న అవినీతిని నిర్మూలించవచ్చు. ఒక చిన్న ఉదాహరణ తీసుకుంటే, ప్రతిరోజూ విభిన్న విషయాలపైన, విభిన్న వ్యక్తులపైన, విభిన్న అంశాలపైన మనం చర్చించుకుంటూ ఉంటాం, మాట్లాడుకుంటాం, అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తూ ఉంటాం. ఉదాహరణకు ఈకింది చిత్రంలో ఇలాంటి విషయాలను గుర్తించటానికి మేం చేసిన ప్రణాళికను (ప్రాజెక్టు) చూడవచ్చు. భయంతో మాట్లాడుతున్న ఒక అతని సంభాషణను యంత్రం గుర్తించిన విధానాన్ని నిందితుల సంభాషణలను ఈ ఉపకరణాన్ని వాడటంద్వారా అవినీతిపరులను గుర్తించి అవినీతి నిర్మూలనలో సాంకేతికతను వాడవచ్చునని నిరూపించవచ్చు. ఈ ఉపకరణానికి, అవినీతిపరుల సంభాషణలను ఆకళింపుచేసుకొని అవినీతిపరులను గుర్తించే విధానాన్ని నేర్చుకోటానికి అవినీతిపరుల భాషానిధి అవసరమవుతుంది.

మనం మాట్లాడే విషయం, ఒక వ్యక్తి మీద కావచ్చు లేక ఒక వస్తువు మీద కావచ్చు, అందులో విషయం ఆవ్యక్తికి లేక ఆ వస్తువుకు అనుకూలంగా (పాజిటివ్‌గా) ఉందా? ప్రతికూలంగా (నెగిటివ్‌గా) ఉందా? దీన్ని మన మెదడు గుర్తించ గలుగుతుంది. అయితే, ఇదే అంశాన్ని కంప్యూటర్ చేత గుర్తించేటట్లు చేయగలిగితే, దీనివల్ల మనకు ఎలాంటి ఉపయోగం ఉంటుంది అనే ఆలోచనలు ఇట్లాంటి ఉపకరణ నిర్మాణ ప్రయోగాలలో భాగమవుతున్నాయి.

అవినీతిపరుల సాంఖ్యిక (డిజిటల్) భాషానిధిని యంత్రం చదవదగిన (మెషిన్ రీడబుల్) రూపంలో గనక అందుబాటులో ఉంచితే దానిద్వారా సమాజంలో పేరుకుపోయిన అవినీతిని దానితో సామాజిక రుగ్మతలను నియంత్రించవచ్చు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇంకా లంచం ఇవ్వకుండా ఒక్క సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోగలుగుతున్నాడా? దీనికీ భాషకూ సంబంధం ఏంటి? అని ప్రశ్నించవచ్చు. భాషకీ సమాజానికీ అవినాభావ సంబంధం ఉంది. భాష లేనిదే సమాజంలేదు, సమాజ అస్తిత్వానికి భాషే ఆధారం. అంత అవినాభావ సంబంధం ఉంది. జర్మనీలాంటి



అభివృద్ధి చెందిన దేశాల్లో చాలావరకు అవినీతి అనేది సామాన్య పాలనలో లేకపోవటానికి ప్రధాన కారణాలలో ఒకటి భాషాసాంకేతికతే. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. రెండు సంవత్సరాల నుంచి మేము కొన్ని విదేశీ సంస్థలతో (ఓడీఎస్ అనే ఒక సంస్థతో) కలసి ఆంధ్రరాష్ట్రంలో అవినీతి సమాచారాన్ని (డేటాను) సేకరిస్తున్నాం. పోలీస్ స్టేషనుకి గానీ మరో ప్రభుత్వ సేవా సంస్థకుగానీ వెళితే లంచం ఇవ్వాలి. లంచం ఇవ్వనిదే పోలీస్ స్టేషన్లోగానీ ప్రభుత్వ సేవా సంస్థలోగానీ పని జరగదని మన దేశంలో కొంతమందైనా అనుకుంటారు కదా! పోలీసు స్టేషన్ కి వెళ్ళాక సదరు పోలీసులు లేక ప్రభుత్వ సేవా సంస్థల ఉద్యోగులు కొందరు మాట్లాడే విధానం, లంచాల కోసం ఎలా నర్మగర్భంగా మాట్లాడతారో, లంచాలు ఇవ్వం అంటే ఎలా తిప్పించుకుంటారో మనలో కొందరికి అనుభవంలో ఉన్నదే. స్టేషన్ కి ఆడది వెళ్తే విచారణ పేరుతో అర్ధరాత్రులు ఎలా మాట్లాడతారో (ఇవన్నీ మా విదేశీ సేకర్తలు సేకరించినవే, 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం నుండి) ఈ వాగ్దృశ్య సంభాషణా నిధిని (వాయిస్-వీడియో చాట్ డేటా)ని ఒక ప్రత్యేక భాషానిధి (డిజిటల్ డేటాబ్యాంక్) గా అభివృద్ధిచేయాలి. ఒక నిజాయితీ గల పోలీస్ మాట్లాడే విధానానికి ఒక అవినీతిపరుడు మాట్లాడే విధానానికి చాలా తేడా ఉంటుంది. ఒక ఐదు నిమిషాల్లో సాధారణ మనిషి బౌద్ధిక జ్ఞానంతో పసిగట్టివేస్తాడు. అతను లంచం కోసం చూస్తున్నాడో లేక నిజాయితీగా పనిచేస్తున్నాడో అనేది కొంత అనుభవంతో తెలుసుకోగలుగుతాడు. మరి కంప్యూటర్ చేత ఈ అవినీతిపరులను పట్టించవచ్చా? తెలుగులో అవినీతిపరుల భాషానిధి (డిజిటల్ డేటా) అభివృద్ధి చేస్తే సాంకేతికతతో పట్టించవచ్చు.



లంచానికి సాంకేతిక భాష ఏళ్ళ క్రితమే కనిపెట్టారు 'బుద్ధిమంతుడు' సినిమాలో! 'ఆమ్యామ్యా' అని..

ఇది సాధ్యమా? అవినీతిపరుల భాషానిధితో యంత్రనేర్పకం (మెషీన్ లెర్నింగ్), కృత్రిమ బౌద్ధికతనూ ఉపయోగించి అవినీతిపరులను పట్టించవచ్చునని ప్రయోగాత్మకంగా విదేశీ పోలీసులు గత రెండు సంవత్సరాల నుంచి మన లంచగొండి వ్యవస్థ మీద నిఘా ఉంచి అవినీతిపరులను ఆంధ్ర రాష్ట్రం నుండి పట్టుకోవటం జరిగింది. ఈ డేటాని, ఆంధ్రా అవినీతిపరుల సంభాషణ విశ్లేషణని పాకిస్తాన్లో వచ్చేనెల జరిగే అంతర్జాతీయ సదస్సు తర్వాత అందరికీ అందుబాటులో ఉంచుతాను. ఈమధ్య మనం మీడియాలో చూశాం.. ఇద్దరు రాజకీయ ప్రముఖులు స్త్రీలతో అసభ్యంగా మాట్లాడటం. ప్రతి మీడియాలోనూ, సాంఘిక మాధ్యమాలలోనూ, ఇది అందుబాటులో ఉన్న తెలుగు సమాచారం (డేటా). ఇది మన డేటా ఆకృతి. మన భాషానిధితో గానీ, లేదా యూట్యూబ్ మొదలైన చోట్ల అందుబాటులో ఉన్న వీరి సంభాషణలతోగానీ సాంకేతికంగా సరిపోల్చి చూస్తే దానిలోని మాటలు (వాయిస్) వాళ్లవో లేక మిమిక్రీ చేసి సృష్టించినవో నిరూపిస్తే ఎవరు నేరస్తులో అన్నది తెలుస్తుంది. విదేశీ పోలీసులకి ఇది ఒక గంట పని. మరి మన దగ్గర ఇది ఎందుకు సాధ్యం కావడం లేదు? మన వేలిముద్రలు వేరే వ్యక్తి వేలిముద్రలతో ఎలా సారూప్యతను పొంది ఉండవో అలానే మనం మాట్లాడే భాష ఎంతగా అనుకరించినా (మిమిక్రీ) సాంకేతికతతో సమాచార విశ్లేషణ (డేటా అనాలసిస్) చేసి అది వారి మాటో (వాయిస్) లేక వేరే వారిదో సులభంగా కనిపెట్టవచ్చు. ఇది కేవలం మన తెలుగు భాషకు ఆయా క్షేత్ర (డొమైన్) భాషానిధి అందుబాటులో ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది.

మేము గత రెండు సంవత్సరాలుగా సేకరించిన తెలుగు లంచగొండుల డేటాను ఈ కింది 5 సాంకేతికతలను ఉపయోగించి మాట (వాయిస్), సంభాషణల (చాటింగ్లు) మరియు దృశ్య (వీడియో) నమోదులు (రికార్డులు) అని మూడు వర్గాలుగా విభజించటం జరిగింది. దీంట్లో ముఖ్యంగా :

1. మహానిధి (బిగ్ డేటా) సాంకేతికత; 2. సహజ భాషా పరిక్రమణ (NLP) 3. సమాచార తవ్వకం (డేటా మైనింగ్); 4. నేరపరిశోధన (ఫోరెన్సిక్) ఉపకరణాలు; 5. మొబైల్ టెక్నాలజీ మొదలైనవాటిని వాడటం జరిగింది. ఇది సాధారణ ప్రజలు ఆయా ప్రభుత్వ కార్యాలయాలనుండీ మా సాంకేతిక యాప్ ల ద్వారా సేకరించినవి. లంచం కోసం శారీరకమైన సౌఖ్యాల కోసం ఎలా ప్రలోభ పెడుతున్నారు అన్నది కంప్యూటర్ చేత విశ్లేషించటం జరిగింది. ఈ విశ్లేషణలో మాకు సాంకేతికంగా విశ్లేషణాత్మకంగా పరిశోధన చేయటానికి విదేశీ అధికారులు సహకరించారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు.

**తెలుగువారెవరైనా సరే, మీరు ప్రభుత్వ కార్యాలయాలకి వెళ్తే మిమ్మల్ని లంచంకోసం, అసభ్య, అసాంఘిక సౌఖ్యాలకోసం ఏడిపిస్తుంటే వారి సంభాషణల్ని దృశ్యశ్రవణ (వీడియో, ఆడియో), రూపంలో నమోదు (రికార్డు) చేసి మా భాషానిధి అభివృద్ధికి సహకరించండి. అమ్మ భాషకు సాంకేతికతను అద్దటంలో మీ వంతు సహకారం అందించండి, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి అమ్మ భాషాభిమానులుగా కదిలి రండి. అమ్మని, అమ్మభాషని నమ్మి చెడినవారు ఉండకూడదు.**

(తరువాయి వచ్చే సంచికలో...)

వ్యాస రచయిత- జర్మనీలోని హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో "డిజిటల్ హ్యూమానిటీస్"లో పరిశోధకుడు.

జె.డి.ప్రభాకర్
8500227185

# పనిస్థలాల్లో దేశీయ భాషల వాడుక - దేశ ఆర్థికాభివృద్ధి

ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తూత్పత్తి, మార్కెట్టు, సేవా రంగాలూ స్థానికీకరణ చెందుతున్న సందర్భంలో ఆర్థికపరమైన అభివృద్ధిలో దేశీయ భాషల పాత్ర, వాటి విలువల గురించి పరిశోధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మొదట్లో భాషను స్థూలంగా భావవ్యక్తీకరణకు వాహిని గానే పరిగణించినా ఆ తరువాత దశలో భాషను ఒక రాజకీయ సాధనంగా గుర్తించడమూ జరిగింది. ఈ క్రమంలో సామాజిక రాజకీయ రంగాలలో భాష ముఖ్యభూమిక పోషించడం చూస్తూనే ఉన్నాము. కానీ వస్తూత్పత్తిలో భాష పాత్రను సూక్ష్మ అర్థశాస్త్ర కోణంలో ఒక 'ఉత్పత్తి సాధనం' గా చూడాలి. ఒక దేశంలో లేక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు వారి స్థానిక భాషలు ఆర్థిక పరంగానూ, సామాజిక పరంగానూ, రాజకీయంగానూ జవసత్వాలను అందిస్తాయి. సమాజంలో భాష పోషించే పాత్రను విస్తృతస్థాయిలో ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. భాషకు ఆర్థిక వ్యవస్థకూ గల సంబంధాన్ని తెలియజేయడానికి నా పరిశోధనను వ్యాస రూపంలో మీముందు ఉంచుతాను. భాషా సమాచారాన్ని కొత్తగూడెం సమీపంలో ఉన్న బొగ్గు గనుల పరిశ్రమలో పనిచేస్తున్న 400 మంది శ్రామికుల నుండి ముఖాముఖి ప్రశ్నావళి ద్వారా పరిశ్రమలో భాషా సంబంధిత వనరుల ద్వారా సేకరించడమైనది. స్తరీకరణ యాదృచ్ఛిక నమూనా (స్ట్రాటిఫైడ్ ర్యాండమ్ స్యాంప్లింగ్) పద్ధతి ద్వారా నమూనాలు సేకరించడం జరిగింది. సమాచారం ఎస్.పి.ఎస్.ఎస్. ద్వారా విశ్లేషించాను. ఏదైనా ఒక పని స్థలంలో దేశీయ భాషల వాడుక వివిధ రూపాలలో వివిధ అవసరాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో, తద్వారా పరిశ్రమలోని వస్తు ఉత్పత్తికి ఏ విధంగా దోహదపడతాయో అనుభావిక ఆధారాలతో ఈ వ్యాసంలో చర్చించాను.

**పరిచయం:** మనుషులు వస్తూత్పత్తి చేయడం ప్రారంభించినప్పటి నుండీ తమ జీవన విధానాన్ని సులభతరం చేసుకున్నారు. ఇతర జీవరాశులలాగా కాకుండా మనుషులు తమ అవసరాలకు ఉపయోగపడే వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా సృజనశీలతను కాలానుగుణంగా పెంపొందించుకుంటూ వచ్చారు. మనిషి బుద్ధి జీవి - జీవనం కోసం తన ముందున్న సవాళ్లను తెలివిగా ఎదుర్కొంటూ పరిష్కారాన్ని కనుగొంటాడు. ఆది మానవుడు ఆహారం కోసం వేటాడిన పరికరం నుండి నేటి ఆధునిక కంప్యూటర్ వరకూ తన ఉత్పత్తి క్రమాన్ని పెంచుకుంటూనే వచ్చాడు. కట్టుకోడానికి బట్టలూ, తలదాచుకోడానికి కట్టడాలూ, తిరగడానికి బండ్లూ మొదలైనవి ఎన్నో ఉత్పత్తిలో భాగంగా వచ్చినవే. వస్తూత్పత్తి అంటే పెద్దపెద్ద పరిశ్రమలలో తయారైన వస్తువులు ఆహార పదార్థాలే కాదు, మనిషి తన మెదడునూ, శ్రమనూ కాలాన్నీ వెచ్చించిన చేసిన ప్రతి వస్తువూ ఉత్పత్తిలో భాగమే. ఒక రైతు పొలంలో తన కాలాన్నీ, శ్రమనూ, ధనాన్నీ వెచ్చించి పండించిన పంటా, ఒక వడ్రంగి కలపను చెక్కి తయారు చేసిన కుర్చీ కూడా ఉత్పత్తిలో భాగాలే. వస్తువును ఉపయోగించని మనిషే ఉండడు అనడంలో అతిశయోక్తి లేదు. మనిషి తాను చేసే ప్రతి చిన్న పనిలోనూ ఏదో ఒక రకమైన ఉత్పత్తి దాగివుంటుంది. ఉత్పత్తి లేకుండా మనిషి మనుగడను ఊహించలేము.

ఈ ఉత్పత్తి రెండు రంగాల నుంచి వస్తుందని చెప్పవచ్చు. సంఘటిత మరియు అసంఘటిత రంగాల నుండి ఉత్పత్తి జరుగుతుంది. ఒక వ్యక్తి లేదా కుటుంబం లేదా చిన్న గుంపు తయారుచేసే ఉత్పత్తీ, వ్యాపారాలూ అసంఘటిత రంగాలుగా పరిగణించవచ్చు. ఎక్కువ సంఖ్యలో శ్రామికులు ఒక పరిశ్రమలో పని చేస్తున్నట్లయితే, వారి పనికి సమయమూ వేతనమూ క్రమబద్ధీకరించినట్లయితే వారు చేసే ఉత్పత్తీ సేవలూ సంఘటిత రంగం కిందికి వస్తాయి. 2018-19 ఆర్థిక సర్వే ప్రకారం భారతదేశంలో 93 శాతం శ్రామికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నట్టు తెలిసింది. భారతదేశ స్థూల జాతీయ ఉత్పత్తికి (GDP) అసంఘటిత రంగం నుండి 50 శాతం వస్తుంది. మిగతా 50 శాతం సంఘటిత రంగం నుండి చేకూరుతోంది. ఏ రంగంలో ఉత్పత్తి సాధించాలన్నా దానికి జ్ఞానమే మూలం. దేశపౌరుల జ్ఞాన సంపద దేశానికి ఆర్థిక సంపదగా మారుతుంది. జ్ఞానానికి మూలం భాషే. శారీరక శ్రమను ఆధారం చేసుకున్న పనులకూ నైపుణ్యత అవసరమే.

**భాష ఒక సాధనం:** పని అవసరంతో మొదలై ఆలోచనతో కార్య రూపం దాలుస్తుంది. మనిషి చేసే ఏ పనికైనా ఒక క్రమం ఉంటుంది. ఒక ఇల్లు కట్టాలన్నా ఒక చొక్కాను కుట్టాలన్నా ఒక క్రమపద్ధతిలో పనిచేస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది. మనిషి ఏ పని చేయాలన్నా వాటికి కావలసిన ఉపకరణాలు సిద్ధం చేసుకుంటాడు. ఆ ఉపకరణాలను సరైన సమయంలో సరైన పద్ధతిలో ఉపయోగిస్తూ పని చేస్తాడు. ఈ పద్ధతి కాలక్రమేణా మెరుగవుతూ వచ్చినదే. వాటిని ఉపయోగించే విధానం ఒక తరం నుంచి మరొక తరానికి అందివ్వబడుతూ వస్తున్నది. ఒకరు నేర్చుకున్న పని అనుభవ జ్ఞానంగా మారుతుంది. పనిలో వాడే వస్తువుల పేర్లనూ, ఉపయోగాన్నీ, పని చేసే పద్ధతినీ భాష క్రమబద్ధీకరిస్తుంది. ఇప్పటికే సంపద సృష్టికి భాష ఒక ప్రధాన సాధనం అని ప్రయోగాత్మకంగా నిరూపించారు (గారపాటి ఉమామహేశ్వరరావు, 2017). భాషను వాడుతూ పనిచేసిన అనుభవ జ్ఞానం ఇతరులకు శిక్షణనివ్వడానికి ఉపయోగపడుతుంది. భాష మానవ ఆర్థిక కార్యకలాపాలలో తిరుగులేని సాధనంగా ఉంటుందని పేర్కొన్నాడు మార్షక్ (1965). ఒక చోట ఒకరు తయారు చేసిన వస్తువు ప్రపంచంలో ఏ మనిషైనా ఎక్కడైనా తయారు చేయగలుగుతున్నాడు అంటే పని ఆధారమైన భాషే దానికి ప్రధాన కారణం. కొందరు కలిసి

పనిచేస్తున్నప్పుడు అభిప్రాయాలనూ, భావాలనూ, అనుభవ జ్ఞానాన్నీ ఒకరితో ఒకరు పంచుకుంటూ సమిష్టిగా కృషి చేస్తూ ఆర్థిక కార్యకలాపాలలో పాలుపంచుకుంటారు. భాషానైపుణ్యాలు ప్రజల యొక్క సామాజిక ఆర్థిక స్థితిపై ప్రభావం చూపిస్తాయి అని కెనడా, అమెరికాలలో భాషకూ సంపాదనకూ మధ్య గల సంబంధాన్ని ఆధారాలతో వైలన్ కోర్ట్, 1980; బొలెట్, 1980, గ్రెనెయిర్, 1987 నిరూపించారు. భాషా నైపుణ్యాలతో ఈ విధంగా సమిష్టిగా రూపొందిన జ్ఞానానికి, అవసరమైన పెట్టుబడి తోడైతే పరిశ్రమకు అధిక నాణ్యతా ఉత్పత్తి చేకూరుతుంది. ఒక పనికి ఉపయోగించే ఉపకరణాల కంటే, పనిగురించి మెదడులో నిర్మించుకున్న 'భాషే ప్రధాన సాధనం'. ఒకరి మనసులో మెదిలిన ఒక ఆలోచనకు భాష ద్వారా రూపాన్ని ఇచ్చినట్లయితే అది ఇతరులతో పంచుకుంటే అది విస్తృత స్థాయిలో కార్యరూపం దాల్చి ఉత్పత్తిగా బయటకు వస్తుంది.

**ఉత్పత్తి మాధ్యమం - అమ్మనుడి:** ఉత్పత్తిలో ఏ భాష వాడుక సులువుగా ఉంటుందో ఆ భాషలో పని తేలిక అవుతుంది. పనిస్థలాల్లో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకూ పనిచేసే శ్రామికులు వారి మధ్య ఉండే భాష ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. పనిచేసేటప్పుడు శ్రామికుల మధ్య సఖ్యత చాలా ముఖ్యం. సమిష్టిగా పనిచేసే స్థలాలలో వారి మధ్య సంభాషణలు చాలా ప్రధానమైనవి. ఈ సంభాషణలు సహజంగా సుదీర్ఘంగా ఉండవు. ఉపయోగించే పనిముట్ల పేర్లు, పనిగురించిన క్రియా పదాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. పనిచేసే సమయాలలో పని మీద పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పటికీ చాలా సందర్భాలలో సహ శ్రామికులతో సంభాషణలు అవసరమవుతాయి. ఆ సంభాషణలు ఎంత తేలికగా అర్థమైతే అంతా వేగంగా పని ముందుకు వెళుతుంది. శ్రామికుల మధ్య భాషాపరమైన సమస్యలు ఉన్నట్లయితే పనిలో కొంత జాప్యమూ నష్టమూ జరిగే అవకాశం లేకపోలేదు. కాబట్టి గుంపుగా పనిచేసే శ్రామికులు అంతా మాతృభాషని మాట్లాడడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పని జరగడానికి వీలు ఉంటుంది. జపాన్, కొరియా, థాయిలాండ్, రష్యా చైనా, జర్మనీ మొదలగు దేశాలు వస్తు ఉత్పత్తిలో ముందు ఉండటానికి కారణం వారి అమ్మనుడిలో పని చేయడమే. కావలసిన వనరులు శ్రామిక శక్తి ఉన్నట్లయితే వాటిని ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించడానికి అమ్మనుడి ముఖ్య భూమిక పోషిస్తుంది. సహజ వనరుల వినియోగం నుంచి ఉత్పత్తి ఎగుమతుల వరకు పైన తెలిపిన దేశాలు వారి అమ్మనుడులనే ఉపయోగిస్తాయి. అమ్మనుడులను ఎంత విరివిగా ఉత్పత్తి సాధనంగా ఉపయోగిస్తే అంత ఆర్థిక ప్రగతి ఆ దేశానికి చేకూరుతుంది. అందువలన అమెరికా లాంటి అగ్ర దేశాలతో మాతృభాష వినియోగం వల్ల కొరియా, జపాన్, చైనా దేశాలు మార్కెట్లో పోటీ పడుతున్నాయి. దానికి గల మరొక ముఖ్య కారణం ఆయా దేశాలలో ఉన్న అమ్మనుడిలో మాధ్యమ విద్య. చిన్నవయసు నుండే పిల్లలు పాఠాలను పూర్తిగా అమ్మనుడిలో ఆకళింపు చేసుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం అలవాటు చేసుకుంటారు. వీరు చిన్న వయసులోనే కొత్త ఆవిష్కరణలు చేయడం, కొత్త వస్తువుల ఉత్పత్తి చేయడం నేర్చుకుంటారు. దాని ఫలితంగానే అమ్మనుడి నైపుణ్యం కలిగిన శ్రామికవర్గంతో ఆదేశాలు ప్రగతిపథంలో నడుస్తున్నాయి.

**శిక్షణా మాధ్యమంగా అమ్మనుడి:** సంఘటిత, అసంఘటిత రంగాలలో పనికి సంబంధించిన శిక్షణ ప్రధానమైనది. సంఘటిత రంగాలలో శిక్షణ చాలా క్రమబద్ధంగా నియమిత కాలంలో ఉంటుంది. ఉద్యోగానికి చదివిన చదువు ఒక ఎత్తయితే శిక్షణలో పని నైపుణ్యాలు పొందడం మరో ఎత్తు. శిక్షణా కాలంలో శ్రామికులు నేర్చుకున్న నైపుణ్యాలు జీవితంలో పనిచేసేంతకాలం ఉపయోగపడుతూనే ఉంటాయి. పరిశ్రమలు శిక్షణ కోసం చాలా పెట్టుబడిని పెడతాయి. శిక్షణకు అవసరమైన పుస్తకాలు, ఉపకరణాలు, తరగతి గదులు, శిక్షకులు మొదలైనవారిపై డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రారం సమీపంలోని బొగ్గు గని శిక్షణా శిబిరం ఉంది. అందులో ఉద్యోగంలో చేరబోయేవారికి ప్రత్యేక శిక్షణను నెల రోజులపాటు ఇస్తారు. శిక్షణా తరగతిలో చేరిన వారిలో పూర్తిగా గనుల గురించి అవగాహన లేనివారూ, గనుల్లో పూర్వం పనిచేసిన కుటుంబ సభ్యుల తరఫున పనిచేసేందుకు వచ్చినవారూ ఉన్నారు. ప్రతిరోజూ 40 నుండి 50 మందితో జరుగుతూనే ఉంటుంది. శిక్షణ ఇచ్చే అధ్యాపకుడు గనుల గురించి పూర్తి అవగాహన పొంది, అందులో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం మొత్తం అధ్యయనం చేసినవారే ఉంటారు. సింగరేణి బొగ్గు గనుల్లో నా పరిశోధనను జరిపించడానికి ముందు నన్ను కూడా ఆ శిక్షణ తరగతిలో పది రోజుల పాటు శిక్షణ పొందమన్నారు. శ్రామికులతోపాటు నేను కూడా ఆ శిక్షణ తరగతులకు హాజరయ్యి బోధనా మాధ్యమాన్ని, పాఠ్యపుస్తకాలను, భద్రతా సూచనలను, అధ్యాపకునికీ శిక్షణ పొందే వారికీ మధ్య సంభాషణలను గ్రహించడం జరిగింది. శిక్షణనిచ్చే అధ్యాపకులు ఇంగ్లీషు, హిందీ, తెలుగులో బోధించగల సమర్థులుగా ఉన్నారు. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు తెలుగేతర రాష్ట్రాల నుంచి కూడా కొద్దిమంది వస్తారు. కాబట్టి అలాంటివారికి తర్వాత హిందీలో పాఠాన్ని వివరించడం జరుగుతుంది. సాధారణంగా తెలుగువారే తరగతి గదిలో ఎక్కువగా శిక్షణ పొందడానికి వస్తారు కాబట్టి బోధన తెలుగులోనే ఉంటుంది. బొగ్గు గనుల్లో పని చేయడం చాలా జాగ్రత్తతో కూడినది కాబట్టి శిక్షణకు వచ్చేవారు శిక్షణా తరగతిలో చాలా ఏకాగ్రతతో పాఠాలను వింటారు. పాఠం మధ్యలో శిక్షణ పొందేవారికి సందేహం వచ్చినట్లయితే మాతృభాషలోనే నిస్సంశయంగా ప్రశ్నలను అడుగుతారు. అధ్యాపకుడు కూడా అడిగిన సమాధానానికి వివరంగా సమాధానం ఇస్తాడు. మధ్య మధ్యలో అధ్యాపకుడు శిక్షణ పొందే వారిని ప్రశ్నలను అడుగుతాడు. కొత్తగా ఉద్యోగంలో చేరినవారే కాకుండా ఉద్యోగంలో పనిచేస్తున్నవారిని కూడా అప్పుడప్పుడు శిక్షణ కొరకు శిక్షణా శిబిరానికి యాజమాన్యం పంపిస్తుంది. బొగ్గు గనుల్లో ఎప్పటికప్పుడు వచ్చే సరికొత్త సాంకేతిక యంత్రాలూ వాటి వాడుక గురించి శిక్షణ అక్కడి శ్రామికులకు తప్పనిసరి. తెరిచిన గనులూ (ఓపెన్ కాస్ట్) మరియు భూగర్భ గనుల తవ్వకాల నుండి తీసే బొగ్గుకి వివిధ యంత్రాలను ఉపయోగిస్తారు. ఈ రెండు రకాల బొగ్గు గనుల నుంచి కార్మికులు వాటి వాడుక తెలిసివుండడం తప్పనిసరి. కాబట్టి శిక్షణా శిబిరం ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది.

**శిక్షణా పాఠ్యాంశాలు:** పరిశ్రమలలో ఉపయోగించే శిక్షణా

తెలుగును బోధించడం కాదు; తెలుగులో బోధించాలి

పాఠ్యాంశాలు ఆ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తి, పని విధానం, విధులు, ఉపయోగించే సాంకేతికతను ఆధారం చేసుకుని రూపొందించబడతాయి. ఈ శిక్షణా పాఠ్యాంశాలు ఆయా పరిశ్రమలకు పరిమితమైనవే. ఉద్యోగంలో చేరేవారికీ ఉద్యోగం చేస్తున్నవాకీ వారు చదువుకున్న విద్యకి ఈ శిక్షణా పాఠ్యాంశాలకు చాలా వరకు తేడా ఉంటుంది. శిక్షణా పాఠ్యాంశాలు ఆ పరిశ్రమలో ఉద్యోగం చేసేవారికి చాలా ముఖ్యమైనవి. వారు చేయబోయే పనికి సంబంధించిన పూర్తి విషయావగాహన చాలా అవసరం. శిక్షణా పాఠ్యాంశాలు శ్రామికులు ఎంత ఆకలింపు చేసుకుంటే పని అంత పరిపూర్ణ అవగాహనతో చేయగలరు. ఏ పరిశ్రమకైనా అందులో పనిచేసే శ్రామికులలో ఎక్కువ భాగం స్థానిక ప్రజలే ఉంటారు. కాబట్టి శిక్షణా పాఠ్యాంశాలను స్థానిక భాషల్లో పొందుపరచడం శ్రేయస్కరం. తద్వారా శ్రామికులు ఆ పాఠ్యాంశాలను త్వరగా సులభంగా ఆకళింపు చేసుకుని పనికి సిద్ధపడతారు.

**చిత్రం 1. శిక్షణా పాఠ్యాంశాలు:** సింగరేణి బొగ్గు గనుల పరిశ్రమలు శిక్షణ పాఠ్యాంశాలు ఎక్కువ భాగం తెలుగులో, కొంత భాగం ఇంగ్లీషులోనూ ఉన్నాయి. బొగ్గు గనుల్లో పనిచేసే శ్రామికులు ఎక్కువ మట్టుకు నిరక్షరాస్యులు, ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించినవారే కాబట్టి శిక్షణలో పాఠ్యాంశాలను తెలుగులో రూపొందించారు. కొన్ని పాఠ్యాంశాలు ఇంగ్లీషులో ఉన్నప్పటికీ వాటిని


ది సింగరేణికాలరీస్ కంపెనీ లిమిటెడ్

సర్ఫేసు గని కార్మికుల

శిక్షణా పాఠ్యాంశములు

(MODULE -1)


ది సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్

(ప్రభుత్వరంగ సంస్థ)

సింగరేణి సంస్థ రక్షణ విధానము( Safety Policy)

1. ప్రస్తుతం అవలంభిస్తున్న సురక్షిత పని పద్ధతులను నిరంతరం సమీక్షించడం మరియు మారిన పరిస్థితుల కనుగుణంగా వాటిని ఎప్పటికప్పుడు సమీకరించి మార్పులు చేయడం.
2. సంస్థలోని ప్రతి ఒక్కరికి సురక్షిత పని పద్ధతుల పట్ల అవగాహన వున్నదని మరియు వాటిని రోజువారీ పనిలో అనుసరిస్తున్నారని నిర్ధారించుకోవడం.
3. నైపుణ్యంగల కార్మికుడు మాత్రమే సురక్షితమైన కార్మికుడు కాగలడు. కనుక కార్మికుల నైపుణ్యమును పెంపొందించుట.
4. మార్కెట్ లో లభిస్తున్న ఆధునిక రక్షణ పరికరాలను నిత్యం బేరీజు వేయడం, వాటిని సక్రమంగా వాడేలా వారికి శిక్షణ ఇవ్వడం.
5. శూన్య ప్రమాద స్థాయి (Zero Accident Potential) ని చేరుకోవడమే అంతిమ లక్ష్యంగా ప్రమాదస్థాయి తగ్గించడం.

రక్షణతో ప్రారంభం రక్షణతో కర్తవ్యం రక్షణతోనే లక్ష్యం.

ఇదే సింగరేణి స్ఫూర్తి


- : HRD MISSION : -

- ✓ To retain our strategic role of a premier coal producing company in the country and excel in a competitive business environment.
- ✓ To strive for self-reliance by optimum utilisation of existing resources and earn adequate returns on capital employed.
- ✓ To exploit the available mining blocks with maximum conservation and utmost safety by adopting suitable technologies and practices and constantly upgrading them against international benchmarks.
- ✓ To supply reliable and qualitative coal in adequate quantities and strive to satisfy customers' needs by constantly sharing their experience and customizing our product.

- : OBJECTIVES : -

- ✓ A clear mission statement, which enables constant qualitative up-gradation of skills of SCCL executives and non-executives.
- ✓ Utilizing modern management methodologies for conducting training programmes.
- ✓ Making intensive use of Internet and I.T for keeping abreast of the latest developments relating to mining and allied sectors.
- ✓ Critically evaluating Best Global Practices available in mining industry and examining their applicability to our mining conditions.
- ✓ The mission and HRD programmes are prepared accordingly


కార్మికులు పాటించ వలసిన సాధారణ నియమాలు:

శ్రామికులకు అర్థం కావడానికి వారి మాతృభాష తెలుగులోనే బోధించడం జరుగుతుంది.

**బోధనా విధానం:** ఈ శిక్షణా పాఠ్యాంశాలలో పని విధామూ విధుల గురించి మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణా భద్రతా నియమావళి కూడా ఉంటుంది. ఈ పరిశ్రమలో పని చేయడం ప్రాణాన్ని పణంగా పెట్టడమే. కావున ఈ పాఠ్యాంశం రూపకల్పనలో పనికీ భద్రతకూ సమాన విలువనిచ్చారు. అందుచేత శిక్షణ సింగరేణి బొగ్గు గనులలో అత్యంత ముఖ్యమైనది. అధ్యాపకుడు తరగతి గదిలో ప్రొజెక్టర్‌ని ఉపయోగించి పవర్ పాయింట్ ప్రయోగంతో పాఠాలు బోధిస్తాడు. ఈ విధానం వలన శిక్షణ తీసుకునే శ్రామికులు బోధన వైపు ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. పరిశ్రమలలో సంభవించిన ప్రమాదాల వలన ప్రాణాలు కోల్పోయిన శ్రామికుల జీవితమూ, వారి కుటుంబ నేపథ్యాన్నీ వీడియో రూపంలో తరగతిలో చూపించడం వలన శ్రామికులు పని చేసే విధానం గురించి మరింత జాగ్రత్త పడతారు. యంత్రాల వాడుకా ఉపయోగాల గురించి వీడియో రూపంలో చూపించడం వలన పనిలో వాటిని ఉపయోగించే విధానం ఎక్కువగా అలవడుతుంది. ప్రమాదాలు సంభవించే తీరు వాటినుండి తప్పించుకునే ఉపాయల గురించి కూడా శిక్షణలో వారి మాతృభాషలో నేర్పిస్తారు కాబట్టి ఈ పనికి సంబంధించిన సూచనలు అన్నీ వారి మస్తిష్కంలో నిలదొక్కుకుంటాయి. పాఠ్యాంశాలు మాతృభాషలో పూర్తిగా అవగాహన చేసుకోవడం వలన పనికి సంబంధించిన పూర్తి అవగాహనా, పనిస్థలంలో జరిగే ప్రమాదాల గురించి భయాన్ని వదిలి ఆత్మవిశ్వాసంతో పని చేయడానికి సహాయపడుతుంది. మాతృభాషలో పాఠ్యాంశాలను బోధించడం వలన అధ్యాపకులకు శిక్షణ పొందేవారికి చక్కటి సంబంధాన్ని నెలకొల్పుతుంది. తద్వారా శ్రామికులు నిస్సందేహంగా పనికి సంబంధించిన ఏ సందేహం అయినా అడిగి నివృత్తి చేసుకుంటారు. తెలుగు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన శ్రామికులకు హిందీ మాధ్యమంలో ప్రత్యేకంగా సమయాన్ని తీసుకుని పాఠ్యాంశాలను బోధిస్తారు.

**భద్రతా సూచనలు:** భద్రతకూ భాషకూ అవినాభావ సంబంధం ఉంటుంది. భద్రతా నియమావళి ఉత్పాదనకు గీటురాయి. సింగరేణి బొగ్గు గనుల పరిశ్రమలో భద్రత సూచనలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు ఒక విభాగాన్ని ఏర్పరిచారు. ఈ విభాగం ఎప్పటికప్పుడు పనిస్థలాల్లో శ్రామికులు తీసుకోవలసిన జాగ్రత్తలను వారి మాతృభాషలో చెబుతూనే ఉంటారు. పనిస్థలంలో భద్రతా సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తూ ఉంటారు. పని స్థలాలలో పేలుళ్లనూ ప్రమాదాలనూ జరగకుండా తగు చర్యలను తీసుకుంటూ ఉంటారు. అందులో భాగంగానే పనిస్థలంలో ఎక్కువ మేరకు భద్రతా సూచనలను అడుగడుగునా బోర్డులలో రాసి ఉంచుతారు. విధుల్లోకి వెళ్లేటప్పుడూ విశ్రాంతి తీసుకునేటప్పుడూ విధుల నుంచి బయటకు వెళ్ళేటప్పుడూ అందరికీ కనిపించేలా ఈ బోర్డులను ప్రతి చోటా ఉంచుతారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న భద్రతా సూచనలు పనిస్థలంలో సూచన బోర్డు రూపంలో పునరావృతం అవుతూనే ఉంటాయి.

**చిత్రం 2. పనిస్థలంలో ఉపయోగించిన భద్రతా సూచనలు**

ఈ సూచనా పలకలో రాసిన భద్రతా సూచనలు 90% శ్రామికుల మాతృభాష అయిన తెలుగులో, 8% ఇంగ్లీషులో, రెండు శాతం హిందీలో రాసివున్నాయి. మాతృభాషలో ఈ సూచనలను వారి




ముందు ఉంచటానికి గల ముఖ్య ఉద్దేశం వారు ఎప్పటికప్పుడు ఆ పని సూచనలనూ, భద్రతా సూచనలనూ చూసి పనిలో పాటిస్తూ క్షేమంగా పనిచేయడం కోసమే. కొన్ని భద్రత సూచనలు నిరక్షరాస్యులకు కూడా సులభంగా అర్థం అవ్వడానికి బొమ్మల రూపంలో చూపించడం జరిగింది. ఉదాహరణకు పనిలోకి వెళ్లేముందు హెల్మెట్ను ఎలా ధరించాలీ, బూట్ల యొక్క ప్రాముఖ్యత ఏమిటీ, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి తక్షణ రక్షణ తీసుకోవాలి వంటివి మొదలగునవి బొమ్మల రూపంలో తెలియజేశారు. యంత్రాలనూ, వాటి పనితనాన్ని కూడా మాతృభాషలో వివరించడం జరిగింది.

**యాజమాన్య నోటీసులు:** శిక్షణా మాధ్యమం, భద్రతా సూచనలు మినహాయిస్తే అధికారిక ప్రకటనలు, నోటీసులు ఎక్కువ భాగం ఇంగ్లీష్‌లో ఉంటాయి. ఉద్యోగంలో చేరికా, క్రమశిక్షణా చర్యలూ, వేతన సంబంధిత నోటీసులూ, సెలవు ప్రకటనలూ, మొదలగు నోటీసులు అన్నీ ఇంగ్లీష్ లోనే ఉంటాయి. కేవలం భద్రతకు సంబంధించిన నోటీసులూ, ఉత్పత్తి లక్షణాలకు సంబంధించిన అధికారిక నోటీసులు మాత్రం స్థానిక భాష అయిన తెలుగులోనూ ఇంగ్లీషులోనూ ఉంటాయి. **(తరువాయి భాగం వచ్చే సంచికలో...)**

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

**ప్రజలభాషకు గౌరవాన్నిచ్చిన బౌద్ధం**

"మతాన్ని ప్రజల్లో వ్యాపింప చేయడానికి దేశీభాషను ఉపయోగించాలన్నది బౌద్ధులు నియమం. ప్రజల భాషకు పతిష్ఠను, హోదాని ఇచ్చిన భాషాభావన ఇది."

పరిశోధన

గారపాటి ఉమామహేశ్వరరావు
పరమేశ్వరి కృష్ణమూర్తి

# యంత్రానువాద వ్యవస్థ: అపసరణాలు

(గత సంచిక తరువాయి...)

**2.6 తెలుగు-తమిళ భాషల వాక్యనిర్మాణ అపసరణం:**

పోయిన నెల సంచికలో యంత్రానువాద వ్యవస్థల నిర్మాణంలో తెలుగు తమిళ భాషల మధ్యన గుర్తించిన పదాంశాత్మక అపసరణలను చర్చించాం. ఈ సంచికలో వాక్యనిర్మాణ అపసరణాల గురించి చర్చించి వాటిని యంత్రానువాద వ్యవస్థలో చేర్చటంవలన ఒనగూడే అనువాదాల మెరుగుదలను నిరూపించటం జరుగుతుంది. వాక్యనిర్మాణ అపసరణాలు, రెండూ అంతకంటే ఎక్కువ భాషల మధ్య సంభవించే వాక్యనిర్మాణంలోని వ్యత్యాసాలను సూచిస్తాయి. వీటిలో, కారక అసమతుల్యత, అన్వయం, అన్వాదేశం, నిషేధార్థకం, అప్రధాన సముచ్చయం లేక ఉపాంశం ఇంకా పదబంధాలూ పరసర్గలూ మొదలైనవాటి తేడాలను గమనించవచ్చు. తెలుగు-తమిళ భాషల మధ్యన ఉన్న వాక్యనిర్మాణ వైవిధ్యాన్ని అధిగమించి సరైన యంత్రానువాద వ్యవస్థ నిర్మాణానికి వివిధ వాక్యనిర్మాణ ప్రక్రియల బలమైన పరివర్తన వ్యాకరణం తప్పనిసరిగా అవసరం. తెలుగు-తమిళాల మధ్య వాక్యనిర్మాణ వ్యత్యాసాలకు ఉదాహరణలుగా ఈ కిందివాటిని చూపించవచ్చు.

**2.6.1 కారకాలూ కారక విభక్తులూ:**

ప్రతి కారక విభక్తికీ ఎన్నో ఉపయోగాలు ఉండటంతో అవి యంత్రానువాదంలో కారక అసమతుల్యతకు దారితీస్తాయని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, వివిధ ప్రమేయాలలో చతుర్థీ విభక్తి వాడకాన్ని తెలుగు, తమిళభాషలు పరస్మైపదార్థకం, గమనార్థకం, లక్ష్యార్థకం, అనుభవకర్త మొదలైన విషయాలలో ఏకీభవిస్తాయి (కృష్ణమూర్తి 2003, వర్మ 1990). ఏదేమైనా, రెండు అప్రాణి వాచక నామాల మధ్య సంబంధ కారకాన్ని వ్యక్తీకరించడానికి, అప్రాణి వాచక వర్గ నామవాచకాలలో ఒకటి తెలుగులో స్థాన కారకాన్ని వ్యక్తీకరించడానికి చతుర్థీవిభక్తిని కలిగి వాడుతుంది. ఇందులో, చతుర్థీ విభక్తి అవయవి -అవయవాల మధ్య సంబంధాన్ని కలిగి ఉన్న రెండు నామవాచకాల పదబంధాలకు సంబంధించినది. అవయవి పదం తెలుగులో చతుర్థీవిభక్తిని తీసుకుంటుంది అయితే దీనికి విరుద్ధంగా, తమిళంలో స్థానకారక విభక్తి వాడుకలో ఉంది. కింది ఉదాహరణలు చూడండి.

**తెలుగు:** గోడ-**కు** కిటికీ ఉంది.
గోడ- చ.వి. కిటికీ-ప్ర.వి. ఉండు- భూ.కా._3ఏ.అమ.
**తమిళం:** చువట్ట్-ఇల్ జన్నల్ ఇరు-క్కిఱ్-అతు.
గోడ-స.వి. కిటికీ-ప్ర.వి. ఉండు-వ.కా_3ఏఅమ
'గోడకి కిటికీ ఉంది.

**అపసరణ నియమం:**

తె.:{నా.ప.[+అవయవి]-చ.వి. నా.ప. [+అవయం] =
త.: నా.ప.[+ అవయవి] -స.వి. నా.ప. [+అవయం]

**2.6.2 తుమున్నర్థక క్రియల ప్రయోగ భేదం:**

తమిళంలో తుమున్నర్థక క్రియల వాడకం విస్తృతంగా ఉంటుంది, అయితే తెలుగులో దాని ఉపయోగం పరిమితంగా ఉండి ప్రధాన క్రియలకు సహాయక క్రియలు చేరి శబ్ద పల్లవాలు ఏర్పడేందుకు వీలుగా ప్రధాన క్రియలకు తుమున్నర్థకం చేరుతుంది. తమిళంలో తుమున్నర్థక క్రియలు వాక్యంలోని వివిధ ఉపవాక్యాలకు పరిపూరకాలుగా ఉపయోగించబడతాయి, వీటికి తెలుగులో సమానార్థకాలుగా భావార్థకాలను ఉపయోగించవచ్చు. ఉదాహరణకు, తమిళంలో తుమున్నర్థక క్రియలు, విరుంపు 'ఇష్టపడు, కోరు', వేండు 'వేడుకొను, కోరు', ఆచైప్పటు 'ఆశపడు' మొదలైన సన్నంత క్రియలకు పరిపూరకంగా వస్తాయి. ఈ విషయంలో, కింది ఉదాహరణలో వివరించిన విధంగా తెలుగులో భావార్థక క్రియలు పూరకంగా పనిచేస్తాయి.

త. నాన్ చినిమా.వ్-ఉక్కుప్ పోక్-అ విరుమ్బు-కిర్-ఏన్
నేను సినిమా- చ.వి. పో-తు. ఇష్టపడు- వ.కా.-1ఏ.అమ.
తె. నేను సినిమా-కు పోవు-అడం-కి ఇష్టపడు-తున్నా-ను.
నేను సినిమా-చ.వి. పోవు-భా.-చ.వి. ఇష్టపడు-వ.కా.-1ఏ.అమ.

నేను సినిమాకి వెళ్లాలనుకుంటున్నాను.'

అపసరణ నియమం:

త. పో-[{తు. }ఇష్టపడు- {వ.కా._1ఏ.అమ }]=
తె. వెళ్ళ-[{భా.-చ.వి.} ఇష్టపడు- {వ.కా._1ఏ.అమ.}]

**2.6.3 పద-అర్థపరక అపసరణం:**

పద-అర్థపరక అనువాద అపసరణాలు భాషల మధ్య పూర్తిగా పదాత్మక లక్షణాలతో నిర్ణయింప బడతాయి. ప్రాతిపదిక ద్వారా వ్యక్తీకరించబడిన భావన అన్ని సందర్భాలలోనూ ఒకే విధమైన అర్థాన్ని కలిగి ఉండకపోవచ్చు. తెలుగూ తమిళ భాషలలో ప్రాతిపదికల అర్థపరక అపసరణం ప్రధానంగా పదాల అర్థపరక సందిగ్ధతలూ ఇంకా బహుళ పదబంధ వ్యక్తీకరణల కారణంగా సంభవిస్తుంది.

**పద-అర్థ సందిగ్ధత:** ఉదాహరణకు, ఒక భాషలో ఒక భావనను వ్యక్తీకరించడానికి ఉపయోగించే ప్రాతిపదికలు అన్ని సందర్భాలలో ఒకే అర్థాన్ని కలిగి ఉండకపోవచ్చు. వీటికి బహుళ అర్థాలు ఉన్నప్పుడు, పదాల అర్థ సందిగ్ధతను అధిగమించడానికీ లక్ష్యభాషలో వాటికి రూపంతో తగిన భావాన్ని ఎంచుకోవడానికీ పదాల అర్థ అసందిగ్ధతలో స్పష్టత అవసరం. ఉదాహరణకు, కుట్టు అనే ధాతువు తెలుగులో అర్థసందిగ్ధత కలిగిన పదం. దానికి ఉన్న మూడు విభిన్న భావాలను, తమిళం మూడు సమానార్థక రూపాలలో ఈ కింద

చూపిన విధంగా వ్యక్తపరుస్తుంది:

**అర్థం 1:** కుట్టు 'కొరుకు, చీమలు మొదలైనవి కుట్టడం, ఈ సందర్భంలో దీనికి తమిళంలో సమానమైన పదం

**కటి** [కడి] 'కాటు వేయు'.

అర్థం 2: కుట్టు 'సూది మొదలైనవాటితో బట్టలు మొదలైనవాటిని కుట్టడం', ఈ సందర్భంలో

తమిళంలో సమానార్థకమైన పదం తయ్ 'కుట్టు'.

అర్థం 3: కుట్టు 'మొనదేలినవాటితో చెవులు, ముక్కు మొదలైనవాటిని పొడవటం', దీనికి తమిళంలో సమానమైన పదం లేదా కుట్టు 'పొడవటం'.

**2.6.4 పదబంధాలు:**

పదబంధాలు అనేవి అర్థాలలో మార్పులు లేకుండా తరచుగా వచ్చే పదవరుసలు. ఇవి రెండూ లేదా అంతకంటే ఎక్కువ పదాలతో తయారైనవి. ఇవి సాధారణంగా సహ-సంభావ్య అర్థాన్ని వ్యక్తం చేస్తాయి. వీటికారణంగా తెలుగు తమిళ భాషలలో అనేక వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు ఒక భాషలో రెండు పదాలతో వ్యక్తం చేసిన భావనను మరో భాషలో ఒకే పదంతో వ్యక్తీకరించటం. కింది పట్టికను చూడండి:

| క్ర.సం. | తెలుగు | తమిళం | అర్థం |
|---|---|---|---|
| 1. | కొబ్బరి నీళ్లు | ఇళ నీర్ | కొబ్బరి నీరు |
| 2. | ఆకలి అవ్వు | పచి | ఆకలిఅవ్వు |
| 3. | స్నానం చెయ్యి | కుళి | స్నానమాడు |
| 4. | పరిశోధించు | ఆయ్వు చెయ్ | వింగడించు |
| 5. | జనాభా | మక్కళ్ తొకై | జనాభా |
| 6. | ఎల్లుండి | నాళై మరునాళ్ | రేపటి తర్వాత రోజు |

పట్టిక-3 ఉదాహరణ తెలుగు తమిళ భాషలలో ఏకీకరణ అపసరణం

**3. అపసరణ సూచిక:** అపసరణ సూచిక భాషల మధ్యన ఉన్న తేడాల పరిమాణాన్ని సూచిస్తుంది. భాషా లక్షణాలలో వైవిధ్యాలు ఏ స్థాయిలలోనైనా (ఉపరితల, మధ్యస్థ, ఇంకా లోతైన స్థాయిలు) చూడవచ్చు. ఈ స్థాయిలు స్థా.1 (ఉపరితల స్థాయి), స్థా.2 (మధ్యస్థ స్థాయి), ఇంకా స్థా.3 (లోతైన స్థాయి) గా గుర్తించవచ్చు. ఒక జత భాషల మధ్య దాని స్థాయిలలో అపసరణాలను గుర్తించడం వలన యంత్రానువాదాన్ని రూపొందించడానికి, భాషలను నేర్పడానికీ నేర్వడానికీ అవసరమైన కృషిని అంచనావేయడం ఇంకా లెక్కించడం సాధ్యమవుతుంది. అపసరణాల స్థాయీ సాంద్రతను అర్థం చేసుకోవడానికి విభిన్న స్థాయిలను గుర్తించడానికీ వర్గీకరించడానికీ భాషా లక్షణాల జాబితా ఉపయోగపడుతుంది.

| క.సం. | మూలభాషాలక్షణం | లక్ష్యభాషాలక్షణం | అప.సూచి |
|---|---|---|---|
| 1. | అను | అను | 0 |
| 2. | అప | అప | 0 |
| 3. | అను | అప | 1 |
| 4. | అప | అను | 1 |
| 5. | అను / అప | అను / అప | 0 |
| 6. | అను / అప | అను | 1 |
| 7. | అను / అప | అప | 1 |
| 8. | అను | అను / అప | 0 |
| 9. | అప | అను / అప | 0 |

పట్టిక 4. అపసరణ సూచిక

పైన పేర్కొన్నట్లుగా పట్టిక-4 భాషలలోగల అపసరణ లక్షణాలను గుర్తించిన సందర్భాలను సూచిస్తుంది. అను. (అనుసరణం) లేక అప. (అపసరణం) ఒక జంట భాషలమధ్యన ఉన్న అపసరణ భాషా లక్షణాల ఉనికిని లేదా వాటి లేమిని సూచిస్తుంది. రెండు భాషల మధ్య పట్టిక 4 (1.-2., 5., 8.-9.) లో ఉన్నటువంటి ఉమ్మడి లక్షణాలలో ఎలాంటి వ్యత్యాసం లేదన్నది 0 ద్వారా సూచించబడింది. పట్టిక 4. (3.-4., 6.-7.)లలో తేడాలు అపసరణాలుగా గుర్తించబడ్డాయి (ఇవి 1 ద్వారా సూచించబడ్డాయి). కొన్ని సందర్భాల్లో కొన్ని లక్షణాల ప్రయోగంలో ఐచ్ఛికాన్ని సూచించడానికి అను./అప. లతో గుర్తించబడింది. మూలభాష లక్ష్యభాష రెండూ ఐచ్ఛికంగా ఉన్నప్పుడు, అపసరణాలు ఉండవు (పట్టిక 4 (5.) చూడండి). మూలభాషలో మాత్రమే ఆ లక్షణాలు ఐచ్ఛికంగా ఉన్నప్పుడు, అది వైవిధ్యంగా పరిగణించబడుతుంది, ఎందుకంటే ఎంపిక భిన్నంగా ఉన్నప్పుడు లక్ష్యభాషకు నేరుగా సమాన లక్షణంగా పరిగణించబడదు (పట్టిక 4 (6.-7.) చూడండి). ఎంపిక లక్ష్యభాష లో మాత్రమే సంభవించినప్పుడు, అది ఎటువంటి వ్యత్యాసంగానూ పరిగణించబడదు (పట్టిక 4 (8.-9.) ఎందుకంటే లక్ష్యభాష ఐచ్ఛికాన్ని అనుసరించి మూలభాష ప్రవర్తిస్తుంది, కాబట్టి మూలభాషా లక్షణాలు నేరుగా లక్ష్యభాషకి మార్పిడి పొందుతాయి.

**3.1 భాషాభాగాలలో పదనిర్మాణ అపసరణాలు:**

తెలుగు-తమిళ భాషలమధ్యన ఉన్న వివిధ భాషాభాగాలకు సంబంధించి రకరకాల పదనిర్మాణాలలో కనబడుతున్న అపసరణాలను సేకరించి కూర్చి ఈ కింద పట్టికలో చూపించినట్లుగా వివిధ స్థాయిలలో చేర్చబడ్డాయి. తెలుగు-తమిళ భాషలమధ్య లోతైన స్థాయిలోనే ఎక్కువ అపసరణాలు కన బడుతున్నై (183). వీటిలో ఎక్కువగా నామవాచకాలూ క్రియల మధ్యనే 175 అపసరణాలు కనిపిస్తున్నై. అంటే తెలుగు-తమిళ భాషలమధ్య పైపైన కంటే వ్యాకరణంలో లోతుల్లోకి వెళ్లేకొద్దీ తేడాలు ఎక్కువ కనిపిస్తాయన్నమాట.

**భాషాభాగాలలో పదనిర్మాణ అపసరణ సూచిక**

| వర్గం | స్థా1 | స్థా2 | స్థా3 |
|---|---|---|---|
| నామవాచకాలు | 5 | 22 | 124 |
| క్రియలు | 12 | 33 | 51 |
| విశేషణాలు | 9 | 0 | 0 |
| సర్వనామాలు | 12 | 0 | 0 |
| సంఖ్యాపదాలు | 1 | 7 | 8 |
| దేశకాలవాచకాలు | 1 | 6 | 0 |
| మొత్తం | 40 | 68 | 183 |

పట్టిక 5. పదనిర్మాణంలో అపసరణ పరిమాణ సూచిక




### 3.2 వాక్య నిర్మాణంలో అపసరణాలు:

తెలుగు-తమిళ భాషలమధ్యన ఉన్న వివిధ వాక్యనిర్మాణ అపసరణాలకు సంబంధించి కొన్ని వాక్యనిర్మాణాలలో కనబడుతున్న అపసరణాలను సేకరించి కూర్చి ఈ కింద పట్టికలో చూపించినట్లుగా వివిధ స్థాయిలలో (5) చేర్చబడ్డాయి. తెలుగు-తమిళ భాషలమధ్య 2, 3, 4 స్థాయిలలోనే ఎక్కువ అపసరణాలు కన బడుతున్నై (204). వీటిలో ఎక్కువగా మధ్యస్థ, ఉపరి మధ్యస్థ స్థాయిలలోనే ఎక్కువగా కనిపిస్తున్నై. అంటే తెలుగు-తమిళ భాషలమధ్య వాక్యనిర్మాణానికి సంబంధించిన అపసరణాలు మధ్యంతర వ్యాకరణంలోనే ఎక్కువ కనిపిస్తున్నాయన్నమాట.

వాక్య నిర్మాణ అపసరణ సూచిక

| వర్గం | స్థా 1 | స్థా 2 | స్థా 3 | స్థా 4 | స్థా 5 |
|---|---|---|---|---|---|
| కారక విభక్తులు | 16 | 34 | 27 | 3 | 3 |
| ఉపపదవిభక్తులు | 0 | 9 | 13 | 0 | 0 |
| ఒప్పందం | 9 | 14 | 9 | 10 | 8 |
| అన్వాదేశం | 0 | 2 | 8 | 13 | 8 |
| నిషేధార్థకం | 0 | 0 | 8 | 6 | 1 |
| ఉపాంశం/అధీనత | 0 | 11 | 24 | 8 | 0 |

పట్టిక 6. వాక్యనిర్మాణంలో అపసరణ పరిమాణ సూచిక




బొమ్మ 3. వాక్యనిర్మాణ అపసరణం

### 3.3 పద-అర్థపరక అపసరణ సూచిక:

రెండు భాషలలోనూ లభించే అర్థపరక పదకోశంలోని ఆరోపాల ఆధారంగా అంచనా వేయబడుతుంది. అర్థసందిగ్ధతగల (ambiguous) పదాలను అధ్యయనం చేయగా. వాటిని లక్ష్య భాషలోకి (తమిళంలోకి) మార్పిడి చేసినప్పుడు దాదాపు 6,706 పదాలు తెలుగులో అర్థసందిగ్ధత గలిగినవిగా తెలుస్తోంది. దాదాపు 6,798 బహుళపదబంధాలు (MWE) కూడా తెలుగులో గుర్తించబడ్డాయి. ఇవన్నీ లక్ష్యభాష అయిన తమిళంలో తగిన సమానార్థక పదబంధాలను ఎంపిక చేసి మార్పిడి చేయబడాలన్నమాట.

ఈ అపసరణ సూచిక ఫలితాల ఆధారంగా, తెలుగు తమిళ భాషల మధ్య పదనిర్మాణ, వాక్యనిర్మాణ వ్యత్యాసాలు వరుసగా సుమారు 43.47% మరియు 43.24% గా ఉందని తెలుస్తోంది. ప్రస్తుత యంత్రానువాదం వ్యవస్థలో వ్యత్యాసాలను అధిగమించడానికి ఈ విభాగంలో వివిధ పరిష్కార వ్యూహాలు ప్రతిపాదించబడ్డాయి. ఈ తేడాలను పరిష్కరించడంలో ప్రధానంగా పాల్గొనేవి సంగణక వ్యాకరణ భాగాలైన వాక్యవిశ్లేషిణి, పరివర్తన వ్యాకరణం, పద మార్పిడి, అన్వయవిభాగం, పదజనకం మొదలైనవి.

4. మూల్యాంకనం: మూల్యాంకన పద్ధతిలో అంటే, తెలుగు-తమిళ యంత్రానువాద ఉత్పాదనను మూల్యాంకనం చేయడానికి స్థానిక భాషావ్యవహర్త తీర్పును స్వీకరించి ప్రతి ఉత్పాదనా గుణాంకాల కింద ఇవ్వబడిన కొలమానం ఆధారంగా లెక్కించబడుతుంది:

| వర్గం | యంత్రానువాద ఉత్పాదనల గుణాత్మకత | గుణాంకం |
|---|---|---|
| 1. | ఆమోదయోగ్యమైన అనువాదం | 4 |
| 2. | అనువాదం స్పష్టం (చిన్న లోపంతో) | 3 |
| 3. | అనువాదం అర్థమవుతోంది(కొంచెం శ్రమతో) | 2 |
| 4. | అర్థం కాని అనువాదం (ప్రధాన లోపాలు ఉన్నై) | 1 |
| 5. | అనువాదం కాలేదు (పదాలు అనువాదం కాలేదు) | 0 |

పట్టిక-7: యంత్రానువాద ఉత్పాదనకు మూల్యాంకన కొలమానం

అనర్గళత (ఫ్లూయెన్సీ) , అర్థావగాహన (కాంప్రెహెన్సబిలిటీ) వంటి పరామితుల ఆధారంగా యంత్రానువాద ఉత్పాదనకు ఇచ్చిన గుణాంకాలు లెక్కించబడతాయి. అనర్గళతను, అనువదించిన వాక్యాల అత్యధిక మొత్తంలో (అనగా సం x 4), వాక్యాలలో 3-4 మధ్య వచ్చిన గుణాంకాల వాక్యాల మొత్తాన్ని అనర్గళతా శాతంగా నిర్వచించవచ్చు. అయితే, అర్థావగాహనను అనువదించిన వాక్యాల అత్యధిక మొత్తంలో వాక్యాల సంఖ్య 2-4 మధ్య వచ్చిన గుణాంకాల మొత్తం శాతంగా నిర్వచించటం జరుగుతుంది. ఈ కింద చూపిన విధంగా లెక్కించబడుతుంది:

వాక్యాల మొత్తం సంఖ్య = S వాక్యాల మొత్తం సంఖ్య అత్యధిక స్కోరు తో ఉన్నవి = S★4 = N;

$$\text{అనర్గళత} = \sum_{i=3}^{4} Si/N$$

$$\text{అర్థావగాహన} = \sum_{i=2}^{4} Si/N$$

అనువదించిన వాక్యాలలో ‘1’, ‘0’ గుణకాలు ఉన్నవాటిని వైఫల్యాలుగా పరిగణించబడతాయి. అందువల్ల యంత్రానువాద వ్యవస్థ ఉత్తమ పనితీరును లెక్కించడానికి వాటిని పరిగణించరు. అనువాదానికి ఇచ్చిన వాక్యాలూ వాటి గురించిన సమాచారం ఇలా ఉంది: మూల్యాంకనం కోసం సేకరించిన వాక్యాల సంఖ్య = 500;

వాటిలోని పదాల సంఖ్య = 5,234; వాక్యాలు సేకరించిన రంగాలు, పర్యాటకం, ఆరోగ్యం, సాధారణ కథనాలు (వికీపీడియా మరియు తెలుగులో రాసిన అంతర్జాల బ్లాగుల నుండి తీసుకొన్న వాక్యాలు); మూల్యాంకనంలో పాల్గొన్న స్థానిక వ్యవహర్తల సంఖ్య ముగ్గురు (టీచరు, గృహిణి, విద్యార్థి).

**సగటు ఫలితాలు కింద ఇవ్వబడ్డాయి:**

(అ) యంత్రానువాద వ్యవస్థకు అపసరణ సూత్రాలను అనువర్తించక ముందు గుణాంకాలు:

| పరామితులు | పర్యాటకం | ఆరోగ్యం | సాధారణ కథనం |
|---|---|---|---|
| అనర్గళత | 64.46% | 62.20% | 63.00% |
| అర్థావగాహన | 65.34% | 63.76% | 65.20% |

పట్టిక-8, తెలుగు తమిళ యంత్రానువాద మూల్యాంకనం-1

అపసరణ సూచిక సమాచారాన్ని ఉపయోగించి, 442 నియమాలతో పరివర్తన వ్యాకరణ విభాగాన్ని యంత్రానువాద వ్యవస్థలో చేర్చి దాని పనితీరు మెరుగుపరచబడింది. ఆ తరువాత అవే వాక్యాలను ఈ యంత్రానువాద వ్యవస్థద్వారా అనువదించి మూల్యాంకనం చేయబడ్డాయి.

(ఆ)యంత్రానువాద వ్యవస్థకు అపసరణ సూత్రాలను అనువర్తించిన తరువాత గుణాంకాలు:

| పరామితులు | పర్యాటకం | ఆరోగ్యం | సాధారణ కథనం |
|---|---|---|---|
| అనర్గళత | 88.66% | 84.00% | 87.45% |
| అర్థావగాహన | 90.66% | 87.33% | 90.00% |

పట్టిక9: తెలుగు-తమిళ యంత్రానువాదం మూల్యాంకనం-2

పైన చర్చించిన అపసరణ సూచిక నుండి తీసుకున్న నియమాల చేరిక వలన పట్టిక-9 లో చూపినట్టు, యంత్రానువాద వ్యవస్థ అనువదించే పనితీరు బాగా మెరుగుపడినట్లు స్పష్టమవుతోంది.

**6. తీర్మానమూ భవిష్యత్తులో చేయవలసిన పని:**

ఈ వ్యాసంలో, తెలుగు-తమిళ యంత్రానువాదం పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే పరివర్తన-ఆధారిత యంత్రానువాద వ్యవస్థ నిర్మాణానికి కావలసిన అపసరణ సూచిక అభివృద్ధిని పరిచయం చేయబడింది. అపసరణ సూచికను అభివృద్ధిపరచడానికి వివరణాత్మక భాషా శాస్త్ర అధ్యయనం అవసరం. దీనిని యంత్రానువాదానికే కాకుండా సంగణక భాషా పరిశోధనలోని వివిధ రంగాలకు అన్వయించవచ్చు. ఉదాహరణకు, భాషా బోధనలో రెండు భాషల యొక్క వైవిధ్యాలను అపసరణల రూపంలో విశ్లేషణలను అందించడం వలన అపసరణ సూచిక ప్రయోజనకారి కావచ్చునని ఈ వ్యాసం రుజువు చేస్తోంది. ఏ రెండు భాషల ప్రమేయం ఉన్న ఏదైనా భాషా పరిశోధననైనా మెరుగుపరచడానికి అపసరణ సూచిక సహాయకారిగా ఉండవచ్చు. విభిన్న భాషలతో వివిధ ప్రాంతాలలో అపసరణ సూచిక వినియోగాన్ని పరీక్షించడానికి మరింత సమగ్ర అధ్యయనం అవసరం.

**ప్రస్తావనలు:**

డోర్, బోనీ జీన్. 1993. యంత్రానువాదం: పదజాలం నుండి ఒక వీక్షణ (ఆంగ్లంలో). మాస్సచుసెట్స్: ఎమ్.ఐటిప్రెస్.

డోర్, బోనీ జీన్. 1994. యంత్రానువాద అపసరణం, ప్రతిపాదిత పరిష్కారాల వర్గీకరణ (ఆంగ్లంలో). కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, 20 (4). 597-633.

భారతీయ భాషలనుండి- భారతీయ భాషలకు యంత్రానువాద కన్సార్టియం. 2008. 'ఇండియన్ లాంగ్వేజ్ టు ఇండియన్ లాంగ్వేజ్ మెషిన్ ట్రాన్స్‌లేషన్ సిస్టమ్: సాఫ్ట్‌వేర్ రిక్వైర్మెంట్ స్పెసిఫికేషన్స్' IL యంత్రానువాదం కన్సార్టియం: హైదరాబాద్. http:// researchweb. iiit.ac.in/ rashid.ahmedpg08/ilmt.html

వ్యాసకర్తలు- అనువర్తిత భాషాశాస్త్ర
అనువాద అధ్యయన కేంద్రం ఆచార్యులు,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

## ప్రాకృతమే సంస్కృతానికి మూలం

*''ప్రాచీన భారతదేశం ఒక చారిత్రిక ప్రయోగశాల. ఈ ప్రయోగశాలలో బహు భాషలు పరస్పర సంబంధాలు, ప్రభావాల వల్ల, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామం వల్ల అభివృద్ధి చెంది సుసంపన్నమయ్యాయి.... ఆంధ్రప్రాంతంలో శాతవాహనుల పాలనలో బౌద్ధమత ఛత్రచ్ఛాయలో క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి క్రీ.శ. 3వ శతాబ్ది వరకూ ప్రాకృతం అధికారభాషగా ప్రాబల్యం వహించింది. క్రీ.శ 2వ శతాబ్ది నుండి పదో శతాబ్ది వరకూ ఉపప్రాంత రాజవంశాల పరిపాలనలో పలుకబడి పెంచుకుంటున్న హిందూ మత శాఖల మతభాషగా రాజాస్థానాలలో సంస్కృతం ప్రాబల్యం పొందింది. అయితే ఈ సుదీర్ఘకాల పర్యంతం సామాన్య ప్రజల భాష తెలుగు దేశి లేదా దేశ్యం. వివిధ ఆదివాసి భాషల మాండలికాలు, ప్రాకృతం కూడా ఈ ప్రాంతంలో వ్యవహారంలో ఉన్నాయి.... సంస్కృతం ఒక సుదీర్ఘ చారిత్రిక శుద్ధి ప్రక్రియ ద్వారా దాని లిపి, పదరూపాలు, ప్రయోగం, వ్యాకరణ సూత్రాలు మొదలైనవాటిలో సంస్కరణతో, ప్రాకృత మాండలికాల భాషా సామగ్రిని వుపయోగించుకొని అత్యంత సమగ్రమైన నిర్మాణాన్ని రూపాన్ని సంతరించుకున్నది. అందువల్ల ప్రాకృతమే సంస్కృతానికి మూలం. సంస్కృత ప్రాకృతాలలో ప్రసిద్ధ పండితుడు, కాశీ గురుకుల సంప్రదాయంలో చదువుకున్నవాడు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి ఈ సిద్ధాంతాన్ని ప్రచురించాడు."*

**- (వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు : కె. వెంకటేశ్వర్లు.. ఎమెస్కో ప్రచురణ)**

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# ఎవరు తెలివి గలవారు?!



**"...జనంగానీ మేధావులుగానీ ఇప్పుడెందుకు నిస్తేజంగా ఉన్నారనేదే పెద్ద ప్రశ్న. మహారాజా! ఇది చాలా లోతుగా ఆలోచించాల్సిన విషయం. చాలామంది మేధావుల, విద్యావేత్తల అభిప్రాయం ఏమిటంటే- బడి, ఆ బడిలో చదువులే ఇందుకు కారణం అంటున్నారు. నేడు మనుషులు చదువుకొనే చదువులు వారిని ఆలోచనాపరులుగా, విజ్ఞులుగా తయారు చేయకుండా, కర్మాగారాల్లో, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్ని మాత్రమే తయారు చేస్తున్నవి. బడిలో ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా, వ్యతిరేకించకుండా, ప్రశ్నించకుండా ప్రేక్షకుల్లా అనేక సంవత్సరాలు చదువుకొన్న ఫలితమే- అంటున్నారు..."**

**అ**దొకపెద్ద అడవి. ఆ ఆడవిలో జంతువులు, పక్షులు పెద్దసభ చేసాయి. రాజుగారైన సింహం ఎత్తైన బండరాతిమీద కూర్చుని ఉన్నారు. మంత్రిగారైన ఎలుగు, సైన్యాధ్యక్షులు ఏనుగు, న్యాయాధిపతి హంస, రాజు గారికి దగ్గరగా అటు ఇటు కూర్చుని ఉన్నారు. ఎదురుగా పక్షిజనాలు, జంతు జనాలు కూర్చుని ఏమి జరుగబోతున్నదోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మంత్రిగారు లేచి నిలబడ్డారు "సభా సదులారా! ప్రశాంతంగా ఉన్న అడవిలో ఈ మధ్య అలజడి ప్రారంభమైంది. రోజురోజుకు తగువులు ఎక్కువ అవుతున్నాయి. వాటిని తీర్చలేక పోతున్నాము. ఇంతకాలం లేని తగువులు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయో తెలుసుకోగోరుతున్నాం. మేధావులు, పండితులు, పెద్దలు దీనికి గల అసలైన కారణాలేమిటో మన మహారాజుగారికి తెలియజేయవలసినదిగా కోరుతున్నాను" అని చెప్పి మంత్రిగారు కూర్చున్నారు.

సామాజిక శాస్త్రపరిశోధకులైన ఒక ముసలినక్క గారు లేచి నిలబడ్డారు. "మహారాజా చాలాకాలంగా మనుషుల దగ్గర పెరిగిన జంతుజనాలు పక్షిజనాలు మన అడవిలోకి వచ్చి నివసిస్తున్నారు. కాని మధ్య వచ్చిన వారిలో కొంతమందితోనే ఈ అలజడి ప్రారంభమైంది. తగువులు తంటాలు ఎక్కువయ్యాయి. మహారాజా! వాళ్లు మనలా వేటాడలేరు. శ్రమ పడడం చేతకాదు. మనుషులు పెట్టింది తిని వళ్లు పెంచుకొని బరువెక్కిపరుగెత్తలేక త్వరగా అలసిపోతున్నారు. అహారం దొరక్క మన జనాలు సంపాదించినదానిని కొందరు దొంగిలిస్తున్నారు. మరికొందరు టక్కరి మాటలు చెప్పి మోసం చేసి మనవాళ్లు కష్టపడి సంపాదించిన దానిని కాజేస్తున్నారు. రహస్యంగా దాచి పెట్టుకొంటున్నారు. దీనివల్లనే తగువులు ప్రారంభమయ్యాయి. అంతేగాదు వాళ్లు మనుషుల దగ్గర తగిలించుకొన్న రకరకాల జబ్బుల్ని మనవాళ్లకు కూడా తగిలిస్తున్నారు" అని ముసలి నక్క గారు వివరించారు.

ఇంతలో ఒక పెంపుడు పిల్లి లేచింది. "మహారాజా ఇది అన్యాయం. దొంగతనాలు, మోసాలు, అనే మాటలతో పెద్దలు మమ్మల్ని అవమానిస్తున్నారు. ఈ మాటలు వెనక్కి తీసుకోవాలి. ఇవి మోసాలు కాదు. మనుషుల దగ్గర నేర్చుకొన్న తెలివితేటలు. అద్భుతమైన ఉపాయాలు" అంటూ పెంపుడు పిల్లి ఆయాసంగా కూర్చున్నది.

ఈ మాటలతో సభలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఈ మధ్య వచ్చినవారికి ఏమయింది అంటూ తమ ప్రక్కనున్న వారిని అనుమానంగా చూసారు. మంత్రిగారు న్యాయాధికారి ఏమి చెబుతారోనని జనాలంతా ఎదురుచూస్తున్నారు. మంత్రిగారు లేచి నిలబడ్డారు. "మహారాజా! సభాసదులారా! అసలు విషయం ఇప్పుడు అర్థమయింది. నిగనిగలాడుతూ కండలు పెంచిన ఈ పిల్లిగారు మనుషుల దగ్గర పెరిగిన పెంపుడు పిల్లిగారని తెలుస్తూనే ఉంది. లేచి నాలుగు మాటలు మాట్లాడలేక ఆయాసపడిపోతున్నారు. దొంగతనాలు చేయడం, మోసపు మాటలతో పరుల కష్టార్జితాన్ని కాజేయడాన్ని తెలివి తేటలు అంటారా? ఇవి మనుషుల దగ్గర నేర్చుకొన్న ఉపాయాల? మనుషులు ఇంతగా చెడిపోయారా? మనుషులు ఇంత బుద్ధిహీనులుగా మారారా?" అంటూ మంత్రిగారు విచారం వెలిబుచ్చారు.

ఈ మాటలకు ఒక గాడిద అభ్యంతరం చెప్పింది. "మంత్రి మహాశయా! మన్నించాలి. తమరు అనుకొన్నట్లు మనుషులంతా

దుర్మార్గులు కాదు. బుద్ధిహీనులు కారు. మంచివారు తెలివిగలవారు చాలామంది ఉన్నారు. దుర్మార్గులు మోసగాళ్లు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు" అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ ఉంది. ఇంతలో సభలో నుండి చాలామంది లేచి, కాదు కాదు.. మనుషులు మంచివాళ్లు కాదు అంటూ అరుపులు వినిపించాయి. రాజుగారు మంత్రిగారి చెవిలో ఏదో చెప్పారు.

మంత్రి గారు లేచి నిలబడ్డారు. "సభాసదులారా! మీ మాటల వలన రాజుగారికి ఒక సందేహం వచ్చింది. ఈ సృష్టిలో జీవులన్నింటికంటే ఎవరు తెలివిగలవారు? ఇది ప్రశ్న. ఇందుకోసం పదిరోజుల సమయం తీసుకోండి. భూగోళమంతా తిరిగిరండి. మీ కళ్లతో చూసింది, మీ చెవులతో విన్నది మీ స్వంతబుద్ధితో ఆలోచించి సారాంశాన్ని తెలియజేయండి సరిగ్గా పదకొండోరోజు ఇక్కడే సభ జరుగుతుంది అంటూ" మంత్రిగారు సభ ముగించారు.

సభ ఇంత తొందరగా ముగిసినందుకు అంతా ఊపిరి పీల్చుకొన్నారు. ప్రశ్నను గురించి ఆలోచిస్తూ జట్లు జట్లుగా చేరి మాట్లాడుకోసాగారు. సమాధానం ఏమిటో కుతూహలంతో తెలుసుకొనేందుకు ప్రపంచం నలువైపులా పరుగులు దీసారు. కొందరు బృందాలుగా, కొందరు ఒంటరిగాను వెళ్లారు. మనుషులు తిరిగే ప్రతిచోటు సందర్శించారు. పల్లెలు, పట్టణాలు, ఫ్యాక్టరీలు, దేవాలయాలు, విద్యాలయాలు, వైద్యాలయాలు సందర్శించారు. కోర్టులు, జైళ్లు, పోలీసుస్టేషన్లు, వివిధరకాల ఆఫీసులు వ్యాపార సంస్థలు, పరిశీలించారు. అంగళ్లు, బజారులు, సంతలు చూసారు. రైతులు, కూలీలు, నేత పనివారు వివిధ వృత్తి పనివాళ్లు చేసే పనులు వారి జీవితాలను చూసారు. మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, వారి జీవితాలను పరిశీలించారు. మురికివాడల్లో దుర్భరజీవితాలను గడుపుతున్న నిరుపేదల్ని చూసారు. రాజకీయ నాయకుల్ని, అధికారులను, మంత్రులను, రౌడీలను, గూండాలను కలుసుకొన్నారు. చిట్టచివరిగా ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేసే మనుషుల్ని కలుసుకొన్నారు. అందరు చెప్పిన మాటలు విన్నారు. వారివారి జీవితాలను పరిశీలించారు.

మానవ సమాజ పరిశీలన పూర్తయిన తర్వాత ఇతర జీవులు అవి నివసించే ప్రదేశాలను పరిశీలించారు. సముద్రం లోపల జీవిస్తున్న జలచరాలను, ఎడారులలోని నివసించే ప్రాణులను, మైదానాల్లో, అరణ్యాల్లో, కొండల్లో, కొండ గుహల్లో, నేల బొరియల్లో, చెట్లపై నివసించే ప్రతి ప్రాణిని పరిశీలించారు. తొమ్మిది రోజుల్లో ఈ పని పూర్తిచేసి పదోరోజు బృందాలుగా ఏర్పడి చర్చించుకొన్నారు. కాని ఒక ఆవు విభేదించి, తానూ మాట్లాడతానంది. దానికి అంతా అంగీకరించారు.

పదకొండోరోజు సభ ప్రారంభమయింది. ఎవరేమి చెబుతారో వినాలని సభలోని జనమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మంత్రిగారు లేచారు. "సభసదులారా! విషయాన్ని సూటిగా చెప్పండి. వాదోపవాదాలకు తావు లేదు. ఈ సృష్టిలో ఏది తెలివిగల ప్రాణి? సభ మధ్యలో ఎత్తైన రాయి ఉంది. దాని మీద నిలబడి అందరికీ వినబడేలా చెప్పండి" అంటూ కూర్చున్నారు.

వయస్సు మళ్లిన ఒక ఆవు లేచింది. మెల్లగా సభ మధ్యలో ఉన్న రాతిమీదకి ఎక్కింది. మహారాజా! నేను అనేక సంవత్సరాలు మనుషుల మధ్య పెరిగాను. వారిని బాగా గమనించాను. మానవుల కంటే తెలివిగల ప్రాణి ఈ భూమిమీద మరేదిలేదు. అన్ని జీవుల తెలివితేటలను ఒడిసిపట్టుకొన్నది మానవులే. మనుషులు సాధన చేసి, అనేక నైపుణ్యాలు సంపాదిస్తారు. నిరంతరం ఆలోచిస్తూ, అన్వేషిస్తూ కొత్త కొత్త సంగతులు తెలుసుకొంటూ ఉంటారు. కొత్తవస్తువులు, కొత్తయంత్రాలు తయారు చేస్తూ ఉంటారు. తమ తెలివితేటలతో సంఘ నిర్మాణం చేసుకొని తమ జాతిని భూమండలమంతా వ్యాపింపజేసారు. తమ తెలివితేటలతో అన్ని ప్రాణులపైన ఆధిక్యత సంపాదించారు. మానవులు తెలివిగలవారు అనడానికి ఇంతకంటే రుజువు ఏమి కావాలి? ఆవు ఈ మాటలు చెప్పి, వచ్చి, తన స్థానంలో నిలబడ్డది.

ఇంతలో ఒక నడి వయసులో ఉన్న గుర్రం లేచింది. దాని జూలు నేలను తాకుతున్నది. అది ఎంతో గంభీరంగా నడిచివచ్చి రాతిమీద నిలబడ్డది. నలుదిక్కుల సభికులకు నమస్కరించి, రాజువైపు తిరిగి, "మహారాజా ! మంత్రి వర్యా! సభసదులారా! నా మాటలు ఆలకించండి. మా బృందంలో సభ్యులంతా అనేక సంవత్సరాలు మనుషుల దగ్గర పెరిగినవారే. మనుషుల బుద్ధిని జీవితాలను నిశితంగా గమనించిన వారం. కాబట్టి మేము తెలుసుకొన్న విషయాలు సత్యమని అందరినీ ఆలోచించమని మనవి చేస్తున్నాను.

మనుషులు తెలివి గలవారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది నాణానికి ఒక వైపు మాత్రమే. రెండో వైపు కూడా చూడాలి. రెండో వైపు కూడా చూసి, తూకం వేసి చెప్పాలి. ఆ రెండో వైపు ఉన్న అతని బుద్ధిహీనతను, ఆశబోతుతనాన్ని, పిరికితనాన్ని, బానిస మనస్తత్వాన్ని, దుర్మార్గాన్ని అన్నింటిని తూకం వేసిచూస్తే, అతని తెలివితేటలు తేలిపోతాయి. మచ్చుకు కొన్ని విషయాలు క్లుప్తంగా వివరిస్తాను.

1. ఏ ప్రాణి అయినా ఈ నేల మీద పది కాలాల పాటు సుఖంగా బ్రతకాలని కోరుకొంటుంది. కాని మానవుడు ఈ భూమండలాన్ని భస్మీపటలం చేయగల అణుబాంబులు తయారు చేసుకొని, ఇంట్లో భద్రంగా పెట్టుకొని, తలుపులు బిగించుకొని నిద్రపోతున్నాడు. మీట నొక్కడానికి ఏ పిచ్చివాడో రాకపోడు. ఇవి తెలివితేటలా?

2. గాలిని, నీటిని, నేలను, తినే తిండిని విషపూరితం చేసుకొని అన్ని జీవులకూ హాని చేస్తూ, తాను అనారోగ్యం పాలై, ముక్కుతూ మూల్గుతూ బ్రతుకు ఈడుస్తున్నాడు. వీడు తెలివిగలవాడా?

3. డబ్బు అనే దాన్ని సృష్టించుకొని, దాన్ని స్వంతం చేసుకోడానికి అన్ని మానవ విలువలు పక్కన బెట్టి, ఎంతటి ఘోరాన్నైనా చేయడానికి వెనకాడడం లేదు. ఇవి తెలివితేటలా?

4. తనలా దేవుడి రూపాన్ని తయారు చేసుకొని, నగలు

**మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం**
**విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది – 'యునెస్కో'**

అంకరించి, ఒక ఆలయంలో పెట్టి, ఎంతో భయ భక్తులతో పూజిస్తున్నట్లు నటిస్తాడు. కాపలా లేకపోతే, ఆ దేవుణ్ణి ఎత్తుకొని వెళ్లి అమ్మేస్తాడు.

5. నిరంతరం హత్యలు, దొంగతనాలు, మానభంగాలు, మోసాలు, అవినీతి, అక్రమాలు చేస్తూ వుంటారు. మనిషి తెలివి గలవాడైతే ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడు?

6. న్యాయం కోసం కోర్టులు పెట్టుకొన్నాడు. డబ్బులు పెట్టి న్యాయాన్ని కొనుక్కోవాలి. ఎంత డబ్బులు ఎక్కువపెడితే అంత గొప్ప న్యాయం దొరుకుతుంది. డబ్బులు లేనివారు దీన్ని ఒప్పుకోవడమే ఒక విచిత్రం. ఇవేమి తెలివితేటలు?

7. నేరస్తులకు శిక్షలు వేసి నిర్బంధించడానికి జైళ్లు పెట్టుకొన్నారు. కోట్లు కాజేసినవారు బయట దర్జాగా తిరుగుతుంటారు. జేబులు కత్తిరించినవాడు జైల్లో ఉంటాడు. ఇదేమి తెలివి?

8. శ్రమ ద్వారానే సంపద సృష్టింపబడుతూ ఉంటుంది. ఆ సంపద ఎవరు శ్రమ చేస్తారో, వాళ్ల దగ్గర ఉండదు. విచిత్రంగా అదంతా వెళ్లి శ్రమచేయనివారి దగ్గరే చేరేటట్లు ఏర్పాటు చేసుకొన్నాడు. ఇవేమి తెలివితేటలు?

9. మహారాజా ఇవ్వన్నీ మనుషులకు తెలుసు. అయినా ఒప్పుకుని బానిసల్లా బ్రతుకుతున్నారు. ఇవి ఏమి తెలివితేటలు?

మహారాజా చెప్పుకొంటూ పోతే మనిషి బుద్ధిహీనతకు దుర్మార్గానికి సంబంధించి ఎన్నో చెప్పుకోవచ్చు. మనిషి ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించుకొని, అందులో నుండి బయటకు రాలేక గిరికీలు కొడుతున్న ఒక పిచ్చివాడు.

ఒకరు తెలివిగలవారు, ఒకరు తెలివిలేనివారని చెప్పలేం. ఎవరి తెలివి వారిదే. భూకంపాలు, సునామీలు వచ్చే సంగతి కొన్ని ప్రాణులు ముందే పసిగట్టి తమ ప్రాణాలను కాపాడుకుంటాయి. మానవులకు ఈ శక్తి లేదు. పిచ్చుకలు, సాలీడులు, ఇళ్ల నిర్మాణంలో అందెవేసినవి. క్రమశిక్షణలో, సంఘ నిర్మాణంలో చీమలతో తేనెటీగలతో పోటీ పడగల వారెవరున్నారు? కానీ, ప్రకృతి ఎలా జీవించమని నిర్దేశించిందో, అలాగే మిగిలిన జీవులన్నీ జీవిస్తున్నాయి. ఒక్క మనిషి మాత్రమే ప్రకృతి నియమాలను ఉల్లంఘించి, బ్రతుకుతున్నాడు. ప్రకృతి అతన్ని తప్పకుండా శిక్షించి తీరుతుంది." ఈ మాటలు చెప్పి గుర్రం వచ్చి కూర్చున్నది.

మంత్రిగారు లేచి నిలబడ్డారు "నిజమే సకల జీవుల మధ్య పోటీపెట్టి ఎవరు తెలివి గలవారో చెప్పడం సాధ్యంగాదు. ఒక్కో జీవిది ఒక్కో తెలివి. మనిషి తెలివితేటలు, అతని ఇతర గుణాలను బేరీజు వేసి, చాలా చక్కగా వివరించినందుకు అభినందనస్తున్నాను. అయినా ఇంత తెలివిగల మనిషి, ఇంత చెడును ఎలా భరిస్తున్నాడు? చెడు పైన, నియంతృత్వం పైన, విప్లవాలు లేవదీసిన మనుషులు ఇంత నిస్తేజంగా ఎందుకున్నారు? విజ్ఞులు, మేధావులు ఏమయ్యారు? ఎవరైనా మాట్లాడుతారా?" అంటూ మంత్రిగారు అడిగారు.

ఒక పెద్ద చిలుక లేచింది. దాని ముక్కు చాలాలావుగాను, ఎర్రగాను ఉంది. దాని శరీరం పసుపు, నీలం, ఆకుపచ్చ మూడు రంగులు కలసి చూపరులను ఆకట్టుకొంటూ ఉంది. వచ్చి మధ్యలో ఉన్న రాయి మీద నిలబడ్డది.

మహారాజుకూ మంత్రికీ సభాసదులకు నమస్కరించింది. మృదుమధురమైన కంఠంతో ఇలా అన్నది. "మహారాజా! మానవుడు అజేయుడు. కోట్ల సంవత్సరాలుగా ఒక నదీ ప్రవాహంలా మానవజాతి రక్తం అతని సంతాన పరంపర ద్వారా, భూమి మీద ప్రవహిస్తూ ఉంది. అనేక పరిణామాల ద్వారా మనిషి ఈ స్థితికి చేరుకొన్నాడు. ఈ చెడు, రాబోయే పరిణామాలు, ప్రమాదాలు అతనికి తెలుసు. అలా తెలుసుకొన్నవారు గొంతెత్తి అరుస్తున్నారు. వారి మాటలు ఆలకించి, మార్పు కోసం పోరాటం చేస్తారని ఆశిద్దాం. అయితే, జనంగానీ మేధావులుగానీ ఇప్పుడెందుకు నిస్తేజంగా ఉన్నారనేదే పెద్ద ప్రశ్న. మహారాజా! ఇది చాలా లోతుగా ఆలోచించాల్సిన విషయం. చాలా మంది మేధావుల, విద్యావేత్తల అభిప్రాయం ఏమిటంటే- బడి, ఆ బడిలో చదువులే ఇందుకు కారణం అంటున్నారు. నేడు మనుషులు చదువుకొనే చదువులు వారిని ఆలోచనాపరులుగా, విజ్ఞులుగా తయారు చేయకుండా, కర్మాగారాల్లో, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్ని మాత్రమే తయారు చేస్తున్నవి. బడిలో ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా, వ్యతిరేకించకుండా, ప్రశ్నించకుండా ప్రేక్షకుల్లా అనేక సంవత్సరాలు చదువుకొన్న ఫలితమే- అంటున్నారు. అంతేగాదు. బాల్యంలో స్వేచ్ఛగా, ఆనందంగా ఆడుకోవలసిన పిల్లల్ని, చదువుల పేరుతో రోజుకు గంటలకొద్దీ బలవంతంగా కూర్చుండబెట్టడం వలన, పరీక్షలు మార్కులవల్ల నిరంతరం భయపడుతూ, సిగ్గుపడుతూ పెరిగి, పెద్దవారై ముడుచుకొని పోతున్నారని తెలుస్తున్నది. ఈ చదువుల మార్పుకోసం కూడా కొంతమంది ప్రయత్నిస్తున్నారు. అంతా శుభం కలగాలని ఆశిద్దాం.

ఈ భూమండలాన్ని శాంతికాములు, ప్రకృతి ప్రేమికులు, విజ్ఞులు పరిపాలించాలని కోరుకుందాం..." అంటూ చిలక తన మాటలు ముగించింది.

మనం మంచి బడి పెట్టుకోలేమా? అని కొందరు పెద్దగా అరిచారు.

ఈ విషయంలో మరోసారి ఆలోచిద్దాం అని మంత్రిగారు చెప్పారు. అంతటితో ఆ రోజుకు సభ ముగిసింది.

*వచ్చే సంచికలో:* **అడవిలో బడి ఎలా ఏర్పాటయిందో చూడండి:**



*"అమ్మా! నీ భాష కావాలి
నిప్పులు చెరగటానికి
చెమటను జల్లెడపట్టి
సంపదలను తీయటానికి
తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి
మాతృభాష కావాలి"*

**1947 - 2013**

**-ఛాయరాజ్** ('మాతృభాష'- కవిత)

తెలుగు లిపి

జూపూడి బాలస్వామి
8106361802

# గుడింతానికి సంబంధం లేని తెలుగు అక్షరాలు

తెలుగు నుడి 'లిపి'ని సంస్కరించాలని అనేక అభిప్రాయాలు, సూచనలు లోగడ వచ్చాయి, ఇప్పుడూ వస్తున్నాయి. అయితే దీనిపై నిర్ణయం చేయవలసింది ఎవరు? తెలుగు విశ్వవిద్యాలయమా? తెలుగు అకాడమీనా? పాఠ్యాంశాల నిర్దేశకులా? పాలకులా? పొరుగు భాషారాష్ట్రాల్లోవలె భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఉన్నట్లయితే ఈ పని హాయిగా జరిగి ఉండేది. తెలుగుభాషోద్యమ సమాఖ్య చేసిన పోరాటాల ఫలితంగా మంత్రిత్వ శాఖతో పాటు, ప్రాధికార సంస్థకూడా ఏర్పడినా, పాలకవర్గాల పట్టనితనం, నిర్లక్ష్యం వల్ల అదంతా నీరుగారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల నేటి పాలకులు కూడా తెలుగునుడి స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రజలూ ఉద్యమకారులూ ఈ అంశాన్ని ముందుకుతెచ్చి ప్రజల్లో ప్రజామాధ్యమాల్లో చర్చకు తేవాలి. తెలుగు లిపిలో రావలసిన మార్పుల గురించి అనుభవజ్ఞుడైన ఉపాధ్యాయుడు బాలస్వామిగారి సూచనలను ఈ క్రింద పరిశీలించండి. - సంపాదకుడు

**మన తెలుగు నుడిలో ఇప్పటికీ కొన్ని అక్షరాలు ఎలా ఏర్పడ్డాయో ఆధారాలు లభించడం లేదు. పది అక్షరాలు గుడింతాలకు సంబంధం లేకుండా రాయడం జరుగుతుంది. ఆ అక్షరాలు ఎందుకు వ్రాస్తున్నారో అవి గుడింతాలకు సంబంధం లేకుండా ఎలా వాడుకలోకి వచ్చాయో అర్థం కావడం లేదు.**

**ఆ పది అక్షరాల వివరాలు " హెూ, యి, యీ మొ, మో, యో, యొ,ఘె,ఘొ, మీ"**

1. **హెూ** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం వ్రాయాలంటే "హ" కి ఒత్వం పొల్లు ఇస్తే "హో" అవుతుంది. కాని "హెూ" అనే ఈ అక్షరం ప్రకారం "హ"కి ఏత్వం ఇస్తే హె, దీనికి కొమ్ము దీర్ఘం ఇస్తే "హో" ఎలా అవుతుంది? ఆ అక్షరములో గుడింతం ప్రకారం ఒత్వన పొల్లు ( ో) లేదు. మరి "హో" ఎలా అవుతుంది.

2. **యి** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం రాయాలంటే "య" కి గుడి ఇస్తే "యి" అవుతుంది. కానీ యి అక్షరం ప్రకారం "య"కి తలకట్టు తొలగిస్తే "యి" ఎలా అవుతుంది. "యి" అక్షరంలో గుడింతం ప్రకారం గుడి లేదు. మరి "యి" ఎలా అవుతుంది.

3. **యీ** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "య"కి గుడి పొల్లు ఇస్తే "యీ" అవుతుంది. "యీ" అనే అక్షరం ప్రకారం "య" కి తలకట్టు తొలగించి దీర్ఘం ఇస్తే "యీ" ఎలా అవుతుంది? ఆ అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వనపొల్లు లేదు మరి (యీ) ఎలా అవుతుంది.

4. **మొ** : ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "మ"కి (ఒత్వం) ( ో) ఇస్తే "మో" అవుతుంది. "మొ" అనే ఈ అక్షరం ప్రకారం "మ"కి ఏత్వం ఇస్తే "మె" దానికి కొమ్ము ఇస్తే "మో" ఎలా అవుతుంది? "మొ" అనే అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వం లేదు. మరి "మో" ఎలా అవుతుంది? -

5. **మో** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "మ"కి ఒత్వన పొల్లు ఇస్తే "మో" అనే అక్షరం అవుతుంది. "మో" అనే అక్షరం ప్రకారం "మ" కి ఏత్వం ఇస్తే "మె" దానికి దీర్ఘం ఇస్తే "మో" ఎలా అవుతుంది? "మో" అనే అక్షరంలో గుడింతం ప్రకారము ఒత్వన పొల్లు లేదు. మరి "మో" ఎలా అవుతుంది.

6. **యొ** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "య" కి ఒత్వం ఇస్తే "యో" అవుతుంది. "యొ" అనే ఈ అక్షరం ప్రకారం "య"కి ఏత్వం ఇస్తే "యె" దీనికి కొమ్ము ఇస్తే 'యో' ఎలా అవుతుంది? "యొ" అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వం (ొ) లేదు. మరి "యో" ఎలా అవుతుంది?

7. **యో** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "య"కి ఒత్వన పొల్లు ఇస్తే "యో" అవుతుంది. కాని "యో" అనే ఈ అక్షరం ప్రకారం "య" కి ఏత్వం ఇస్తే "యె" దీనికి దీర్ఘం ఇస్తే "యో" ఎలా అవుతుంది. "యో" అనే అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వన పొల్లు ( ో) లేదు. మరి "యో" ఎలా అవుతుంది?

8. **ఘె** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా వ్రాయాలంటే "ఘ" కి ఒత్వం ( ొ) ఇస్తే "ఘొ" అవుతుంది. కాని " ఘె" అనే ఈ అక్షరం ప్రకారం "ఘ"కి ఏత్వం ఇస్తే "ఘె" దీనికి కొమ్ము ( ొ) ఇస్తే "ఘొ" ఎలా అవుతుంది? "ఘొ" అనే అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వం ( ొ) లేదు. మరి "ఘొ" ఎలా అవుతుంది?

9. **ఘొ** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా వ్రాయాలంటే "ఘ" కి ఒత్వన పొల్లు ( ో) ఇస్తే "ఘో" అవుతుంది. కాని "ఘొ" అనే అక్షరం ప్రకారం "ఘ" కి ఏత్వం ఇస్తే "ఘె" దీనికి దీర్ఘం ఇస్తే "ఘో" ఎలా అవుతుంది? "ఘొ" అనే అక్షరంలో గుడింతం ప్రకారం ఒత్వన పొల్లు ( ో) లేదు. మరి 'ఘో" ఎలా అవుతుంది.

10. **మీ** :- ఈ అక్షరం గుడింతం ప్రకారం ఎలా రాయాలంటే "మ" కి గుడి ఇస్తే "మి" దీనికి పొల్లు ఇస్తే "మీ" అవుతుంది. కాని "మీ" అనే అక్షరం ప్రకారం "మ" కి గుడి ఇస్తే "మి" దీనికి దీర్ఘం ఇస్తే "మీ" ఎలా అవుతుంది? "మీ" అనే అక్షరంలో గుడింతం ప్రకారం గుడిపొల్లు ( ీ) లేదు. మరి "మీ" ఎలా అవుతుంది?

ఇప్పటికీ తెలుగు నుడిలో అక్షరాలు గుడింతాల ఆధారంతో వ్రాస్తున్నాము. కాని ఇప్పటికీ హెూ, యి, యీ, మొ,మో,యె,యో, ఘె,ఘొ, మీ అక్షరాలు గుడింతంతో సంబంధం లేకుండా వ్రాస్తున్నాము. అందువలన ఆ పది అక్షరాలు గుడింతలతో సంబంధం ఉండేటట్లు సవరించి చదువుటకు, వ్రాయుటకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ వ్యాస రచయిత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# గుర్తింపుకు నోచుకోని తెలుగు శాస్త్రవారసత్వం

## (శాస్త్రేషు హీనాః కవయో భవంతి*)

**1950**-60నుండి , ఆచార్య రామరాజు, నాయని కృష్ణకుమారి, విశ్వవిద్యాలయాలను పల్లెలే కాదు అడవిలోకి నడిపిస్తూ, నృశాస్త్ర నేపథ్యాన్ని, సాంఘిక చరిత్రను చూపిస్తే, భద్రిరాజు నాయకత్వంలో మాండలిక వృత్తి పదకోశాలకు యువతరం చేరా, బూరా వగైరాలు క్షేత్ర కృషిచేశారు. మరుపూరి కోదండ రామిరెడ్డి మొదలైనవారు సామెతలు, పలుకుబడులు సంపాదిస్తే, కేతువిశ్వనాథ రెడ్డి ప్రభృతులు గ్రామనామాలు విశ్లేషించారు. నరసింహారెడ్డి సామెతలలో వ్యవసాయం రూపుకట్టించారు. భక్తవత్సలరెడ్డి ఒక ప్రణాళిక తయారుచేసారు..




ఈ 60లలోనే హరితవిప్లవం విస్తరించింది. ఆ వ్యూహాలను అమలు చేయటానికి, ముందు రైతు జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలని సాంఘిక శాస్త్రజ్ఞులు రాబర్ట్ చాంబర్స్ వంటి అభివృద్ధి విధానకర్తలు, విషయసేకరణకు ప్రజలను కలుపుకుపోతూ, త్వరితగతిన, వారి జ్ఞానం సేకరించి, చూపించే పటాలు గీయటం, పట్టికలు తయారు చేయటంవంటి వివిధ పద్ధతులు ప్రచారంలోకి తెచ్చారు.విస్తరణ విభాగాలు, రేడియో, పత్రికలు రైతునుండి తెలుసుకోటం కంటే, రైతుకు తమ పరిశోధనలను, ఉత్పత్తులను తెలియచేయటం మీద దృష్టి పెట్టసాగాయి. అయితే పల్లె ప్రజల నుడికారం సేకరించి, యువకులుగా ఎంతో కృషి చేసిన మన పండితులు, ఈ కార్యక్రమాలకు దూరంగా వ్యాకర్తలుగా, బోధనా మాధ్యమ పరిభాష పరిష్క ర్తలుగా, సాహిత్యగాళ్ళుగా, పత్రికల కోశకర్తలుగా, లిఖిత సాహిత్య విశ్లేషకులుగా ముందుకు సాగిపోయారు. పునాది కోల్పోతున్న తెలుగు భాషను నిలబెట్టుకోటానికి 1995లో సమావేశమైన పెద్దలు, ప్రసిద్ధమైన నూరు తెలుగు రచనలను పునర్ముద్రించాలని తీర్మానించారు కాని, వృత్తిపదకోశాలముద్రణను వేగిరం చేసి , అధివృద్ధి ప్రభావంతో వస్తున్న పదసంపదతో ప్రచురించిన వాటిని నవీకరించటం మీద ఒక్కమాట కూడా చెప్పలేదు.'

'ఈ రాష్ట్ర పాలకులు భాషాశాస్త్రానికి-సాహిత్యానికి మధ్య భేదాన్నిగుర్తించలేదు...ఈ పరిస్థితికి కారణం ఆ శాస్త్రజ్ఞుల వైఫల్యం కావచ్చు..' అని చేరా ఒప్పుకుంటే , 'ఎంతో కాలంగా భాషాశాస్త్రానికి, సాహిత్యానికి ఒకానొక అసహజమైన, అనవసరమైన దూరం కొనసాగుతూ వచ్చింది..ఈ దూరాన్ని విశ్వవిద్యాలయ తెలుగుశాఖలు బ్రహ్మాండంగా పెంచిపోషించాయి' అని (భాషానువర్తనం పుట xi) ముందుమాటలో అక్కసు వెళ్లగక్కారు. జానపద విజ్ఞాన వేత్తలు, కనుమరుగౌతున్న వారసత్వ సంపదను భద్రపరచటంలో మునిగి పోయారు. సాంఘిక శాస్త్రాల ఆచార్యులను సిద్ధాంతగ్రంధాల ('తెలుగు గిరిజన గీతాలు') పరీక్షకులుగా చేస్తూ,వాటితో సమన్వయం చేసుకోవాలనే ప్రయత్నాలను నిరసించి, అటువంటి ప్రయత్నాలు జానపద విజ్ఞానం ఒక స్వతంత్ర శాఖగా ఎదగటాన్ని, పక్కదారి పట్టిస్తాయని భావించారు. (జానపద సరస్వతి 2003 జానపద విజ్ఞానతత్వం పుట 93) ఇలా భాషా, జానపద రంగాలు ముందరికాళ్ళకు బంధం వేసుకుంటూ పోయాయి.. **లేవిస్ట్రాస్ వంటి మానవ శాస్త్రజ్ఞులు , సాహిత్యమానవ వేత్తలుగా; భాషా శాస్త్ర వేత్తలు చామ్స్కీ వంటివారు భాషాతత్వవేత్తలుగానేకాదు, పౌరహక్కుల ఉద్యమంలో భాషోద్యమాన్ని భాగం చేస్తే,** ('indegenous resistence' **చిరకాలం వలసపాలనలో మగ్గిపోయి, నేడు భాష, సంస్కృతులను పునర్నించుకుంటూ, ప్రభుత్వం రుద్దే మూసపోత విద్యను తిరస్కరిస్తూ, తమ సంస్కృతి పునాదిగా అభివృద్ధి కావటానికి, స్వయం పాలన కోసం ఉద్యమిస్తున్న దక్షిణ అమెరికా ఆదిమ సమాజాల ప్రముఖులతో చామ్స్కీ సంవాదం. ఓరియంట్ బ్లాక్ స్వాన్ ప్రచురణ 2010 ),** మనవారు వ్యాకర్తలు, సేకర్తలుగా, సాహిత్య రాయుళ్ళుగా మిగిలిపోయారు. మార్కెట్ శక్తులు, భాష సంస్కృతులను కైవసం చేసుకుంటుంటే, 'అచ్చ' తెలుగని, ఆధునికీకరణ అని, బోధనాభాష, అధికారభాష, అని, ఎవరికివారు ఏటికి కోటికి లాగుతూ, ఉనికిని




చాటుకుంటున్నారు. ప్రభుత్వం జీవ వైవిధ్య చట్టం అమలుకు తయారు చేయించే 'ప్రజా జీవ పట్టిక'లలో, అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామసభలను బలోపేతంచేసే కృషిలో తెలుగుతనాన్ని పెంచే చొరవ తీసుకోలేకపోతున్నారు. అటువంటివి ఉన్నాయనికూడా ఈ భాషాభిమానులకు తెలియదు.

ప్రజలనుబట్టి పాలకులు పోతారు. వారి ఆస్థాన విద్వాంసులు, వారిని దుయ్యబట్టే ప్రతిపక్ష నాయకులు పోటాపోటీగా ఉపన్యాసాలు దంచుతుంటారు. ఇందరి మధ్య సగటు భాషాభిమాని గుంపులోగోవిందా అని కొట్టుకుపోతున్నాడు. వాడితో **పాటు తెలుగు వారసత్వంలో శాస్త్రం / తెలుగుతనం తెరమరుగౌతున్నది. వచ్చీ పోయే కాలక్షేపం సినిమాలు / చిరుతిండి సాహిత్యమే (జంక్ ఫుడ్) తెలుగుతనంగా చలామణి అవుతున్నవి. జనాన్ని మత్తులోకి నెడుతున్నవి..**

ఇహ పరిశోధకులు, పల్లెల్లో నేటికీ తింటున్న వంటకాలను (నాల్గవ ప్రపంచ తెలుగురచయితల మహా సభల ప్రత్యేక సంచిక. జానపద విజ్ఞానం వంటలు; వార్పులు) వదిలేసి, కావ్యాలలో వంటలను వెతుక్కుంటున్నారు.. చిన్ననాడు చేసిన పొలంపనులను వర్ణిస్తూ, కొత్తపనులలో కొనసాగుతున్న పాత పద్ధతులు చూపించటం మరిచి పోతున్నారు( ప్రపంచ తెలుగు. వ్యాస సంకలనం 2019. వ్యవసాయ పదజాలం వివరణ పుట 147). మరికొందరు శిష్టులలో 'మడి పట్టించటం' లో 'స్త్రీల జీవిత చక్ర సంబరాలు' వర్ణిస్తూ , విశ్రాంతి కరువైన శ్రామిక వర్గాలలో వాటికి సంబంధించిన తంతు అంత విస్తృతంగా రూపొందలేదని చెప్పవచ్చు అని ఏకపక్షంగా తీర్పు చెపుతున్నారు. (జానపద సరస్వతి 2003.పుట 51). ఇలా ఏదో ఒక విధంగా తెలుగు వారసత్వం మినుకు మినుకుమంటూ కనిపిస్తూనే వున్నది..అలాగే కొత్తగా, తెలంగాణా పదకోశం, చర్మకార పదకోశం వగైరాలు వస్తూనే ఉన్నాయి.

**అటు పాలకులకు, వ్యాపారవర్గాలకు; పర్యావరణంలో సంక్షోభంవంటి కొత్త కొత్త సమస్యలకు పరిష్కారాలు పాతవైనా కొత్తగా చెప్పే ప్రయత్నాలు కావాలి. గతంలో, నేడు, జరుగుతున్న కృషిని సమన్వయం చేసుకుంటూ, పొరబాట్లను దిద్దుకుంటూ, లోపాలను పూరిస్తూ తరతరాల తెలుగు ప్రజల కృషిలో శాస్త్రం పునాదులు చూపించే ప్రయత్నం బలంగా చేయాలి. లేకపోతే కొద్దిరోజులలోనే శాస్త్ర చరిత్ర హీనులుగా మిగిలిపోతాము.**

**కేంద్ర సాహిత్య అకాడమి తెచ్చిన 'తెలుగు గిరిజన సాహిత్యం (2021) సంస్కృతిలో దేశకాలాల మూలాలను, అవి సాహిత్యంలో విరబూసిన తీరును ఆవిష్కరిస్తూ దారి చూపిస్తుంది. 'జాతి అస్మితలో పరిసరం విడదీయరానిది. ఆయా దేశకాలాలో జనం మనుగడలో కీలక పాత్రవహిస్తాయి.- జాతివారసత్వాన్ని ముందుతరాలకు**




**అందించే వాంగ్మయం లో మౌఖిక సాహిత్యానిది ప్రధాన పాత్ర. ఈ సాహిత్యంలో వివిధ ప్రక్రియలు దేశ కాలజ్ఞానంతో పాటు, కష్టసుఖాలను, ప్రాపంచిక దృక్పధాన్ని, మనో ప్రపంచాన్ని, చారిత్రక పరిణామాలను, సాంఘిక ఆర్థిక ఆదర్శాలను ప్రత్యక్షంగానో పరోక్షం గానో తెలియ చేస్తుంటాయి. ఆ లోతులు తెలియనిదే సంస్కృతి అర్థం కాదు. అన్ని ప్రక్రియలు పరిశీలిస్తే తప్ప సమాజం సమగ్రచిత్రం రూపుకట్టదు అందువల్ల కథలు, గేయగాథలు, పాటలలో కొన్ని భాగాలు, పొడుపుకథలు, సామెతలను, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను బలపరచే చట్టాల అమలును బలోపేతం చేసే దిశగా తీర్చిన కూర్పు ఇది'.**

**'ఆటమనదే పాటమనదే, అన్నీ
విద్యలుగల్లవారము
వేట మనదే వెట్టి మనదే, వేయి
విద్యలుగల్ల వారము
కొలువు మనదే కొలత మనదే,
కోటివిద్యలు గల్లవారము'**

– గోదావరిలోయల్లో కొండరెడ్ల పాట.

| | |
|---|---|
| * శాస్త్రేషు హీనాః కవయో భవంతి<br>కవిత్వ హీనాః పురాణ భట్టాః<br>పురాణ హీనాః కృషీవలాస్యుః<br>భగ్నాః కృషే భాగవతా భవంతి | శాస్త్రం మీద పట్టులేనివాడు కవి అవుతాడు<br>కవిత్వం చేతగానివాడు పురాణాలు చెపుతాడు<br>పురాణాలు రానివాడు పిచ్చివాగుడు వాగుతాడు<br>అదీ రానివాడు తైతక్కలాడతాడు |

కొల్లేటి రవిబాబు
9494398884

# తెలుగువాళ్ళు మరిచిన అనువాదకుడు
# కావలి వెంకట బొర్రయ్య



కల్నల్ మెకంజీతో కావలి వెంకట బొర్రయ్య సోదరులు.
28 జూన్ 1834 'సాటర్‌డే మ్యాగజైన్' ముఖచిత్రం ఇది.

**పం**దొమ్మిదో శతాబ్ది పూర్వార్థంలో తెలుగు స్థానికచరిత్రల సేకరణ, పరిష్కరణ, అనువాదాల్లో విశేషసేవ చేసినవ్యక్తి కావలి వెంకట బొర్రయ్య. ఉద్యోగరీత్యా దుబాసీగా ఉంటూనే ఆయన జీవితమంతా తెలుగువాళ్ళ చరిత్ర నిర్మాణానికి కావాల్సిన విలువైన ఆకరాల సేకరణకే అర్పించిన మహోన్నత వ్యక్తి. తదనంతరకాలంలో సి.పి. బ్రౌన్ లాంటివాళ్ళు తెలుగు సాహిత్యం, చరిత్రకు సంబంధించి విశేషకృషి చేయడానికి కావాల్సిన దారులు వేయడంలో మెకంజీకి ఎంతగానో తోడ్పడ్డాడు. విదేశీయుడైన మెకంజీ బొర్రయ్యవంటి స్థానిక పండితుని సహాయం లేకపోతే అంతటి విలువైన సమాచారాన్ని సేకరించడం సాధ్యమయ్యేదికాదు.

కావలి బొర్రయ్య 1776 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లా ఏలూరులో జన్మించాడు. బొర్రయ్య మచిలీపట్నం మోర్గాన్ స్కూల్ లో చదువుకున్నాడు. తన తండ్రి కావాలి వెంకట సుబ్బయ్య ప్రోత్సాహంతో సంస్కృతం బాగా అధ్యయనం చేశాడు. వీళ్ళు కావలి సోదరులుగా ప్రసిద్ధి. కావలి వెంకట బొర్రయ్య, లక్ష్మయ్య, రామస్వామి సోదరత్రయం. వీళ్ళు మెకంజీకి కైఫియత్తుల సేకరణ, భారతీయ విజ్ఞానసర్వస్వాన్ని అవగాహన చేయించడంలో విశేషంగా సహకరించారు. వీళ్ళలో బొర్రయ్య బహుభాషాకోవిదుడు. ఇతనికి సంస్కృతాంధ్రాలు, కన్నడం, ఆంగ్లం, హిందుస్తానీ భాషలతో పరిచయం ఉంది. తన అన్న నారాయణరావు ప్రోత్సాహంతో ఈస్టిండియా ఉద్యోగంలో చేరినా, 1796 లో కాలిన్ మెకంజీ దగ్గర అనువాదకుడిగా మారాడు.

కాలిన్ మెకంజీ వృత్తిలో భాగంగా దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించాడు. ఆ సందర్భంలో దేవాలయాల్ని ప్రాచీన లిపులుగల అనేక శిలలను చూడటం తటస్థించింది. ఫలితంగా ఆ ప్రాచీన అవశేషాల నుంచి ఎంతో విలువైన దేశచరిత్రను పునర్నిర్మించవచ్చు అని భావించాడు. ఆ కృషిలో మేధావి అయిన కావలి వెంకట బొర్రయ్య సేవలను పొందడం అతని విజయానికి కారణం అయ్యింది. బొర్రయ్య ఆంధ్రదేశంలోని దేవాలయాలలో ఉన్న శాసనాలను అవగతం చేసుకోడంలో సిద్ధహస్తుడు. ఆయనను మెకంజీ తన విలువైన పనులకు నియమించేవాడు.

'బొర్రయ్య ప్రతిభకు ముగ్ధుడనై అతని సహకారంతో ఎంతో తెలుసుకొన్నాను. దానికి అతనికి ఋణపడి ఉన్నాను. శ్రీరంగపట్నం పతనం తరువాత మాలో ఎవరూ కన్నడం నుంచి అనువాదం చేయగలవారు లేకపోయారు. ఇప్పుడు ఆధునిక లిపినుంచే కాకుండా కన్నడ తమిళ భాషల శాసనాల నుంచి కూడా చేసిన అనువాదాలు ఉన్నాయి. వీటికి అదనంగా సంస్కృతం నుంచి చేసిన అనువాదాలు కూడా ఉన్నాయి. నేను భారతదేశం వచ్చిన తొలినాళ్ళలో ఏ సమాచారమూ లభించేది కాదు. మేధావి అయిన బొర్రయ్య బుద్ధి కుశలత వలన హిందూవిజ్ఞానం తెలుసుకోడానికి అవకాశం కలిగింది. అయినప్పటికి కొద్ది సంవత్సరాల్లోనే అతను తనువు చాలించడంతో నేను నష్టపోయాను. అతని ఆదర్శాలు నిర్దేశాలు అతని సోదరులు శిష్యులు పాటిస్తూ వచ్చారు. క్రమంగా ఒక సంస్థ రూపొందింది. దాని ద్వారా చాలా ప్రదేశాలను విశ్లేషణాత్మకంగా చూడడం జరిగింది' అని బొర్రయ్య పట్ల మెకంజీ కృతజ్ఞతాభావం ప్రకటించినట్లు డబ్ల్యూ.సి. మెకంజీ (1952:57) పేర్కొన్నాడు.

మెకంజీ అవసరమైన సమాచారాన్ని సేకరించడానికి బొర్రయ్యను పంపించేవాడు. బొర్రయ్య విధిగా సమాచారాన్ని సేకరించి, కంపెనీవారికి ప్రయోజనాన్ని చేకూర్చాడు. బొర్రయ్య సర్వేపనిలో అడవులు, కొండలలో ప్రయాణం చేస్తూ చాలా కష్టపడవలసి వచ్చేది. బొర్రయ్య హైదరాబాదు నుంచి మద్రాసు తిరిగి వస్తూ మార్గమధ్యంలో ఒక నివేదికను తయారుచేస్తూ సంస్కృతంలోనూ, తెలుగులోనూ పద్యాలు రచించాడు. అంతేకాకుండా చాలా సాహిత్య సమాచారాన్ని కూడా సేకరించాడు. బొర్రయ్య 1798వ సంవత్సరంలో మెకంజీతో కలిసి టిప్పుసుల్తాన్ పైకి వెళ్ళే సైన్యంతో పాటూ వెళ్ళాడు. అతని ప్రయాణమార్గంలో నైజాం ప్రాంతంలోని చిన్న జమీందారి అయిన గద్వాల వచ్చే లోపల ప్రయాణ నివేదికను తయారు చేశాడు. బొర్రయ్య

మెకంజీతో సంప్రదించి శ్రీరంగపట్టణం వెళ్ళాడు. అక్కడి కోటను స్వాధీనం చేసుకోడంలో బొర్రయ్య ప్రత్యక్షసాక్షిగా ఉండి అక్కడి సంఘటలను గేయరూపంలో వర్ణించాడు. అక్కడ గోడలమీద బ్రిటిష్ వారి వైభవాన్ని చిత్రించడాన్ని బొర్రయ్య అద్భుతంగా వర్ణించాడు. మెకంజీ దీనిని మెచ్చుకొని అతనిని గొప్పగా సత్కరించాడు.

బొర్రయ్య ఏలూరులో ఉండగా యంత్రసంబంధమైన పనుల్లోనూ కళ, శాస్త్ర విజ్ఞానంలోనూ నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మెప్పు పొందేవాడు. అతని మృదుస్వభావాన్ని చూసి అతణ్ణి చాలామంది గౌరవించేవారు. 1800 వ సంవత్సరంలో సర్ ఆర్థర్ వెల్లస్లీ పాలనలో హరిహర వద్ద మరాఠా సేనాధిపతి దూండీని వశపరుచుకొన్నప్పుడు బొర్రయ్య ఒక కావ్యం రచించాడు. తర్వాత ఒక గురువుగారి మీద వందపంక్తుల కవితా ఖండికను రచించాడు. దాని ద్వారా ఆ మహనీయుని కీర్తి మరింతగా వ్యాపించింది. శ్రీరంగపట్నం సార్వభౌముల వంశక్రమానుగతిని ఉమ్మత్తూరు స్థాపన దగ్గర నుంచి పొందుపరుస్తూ 'శ్రీరంగరాజచరిత్ర' అనే కావ్యాన్ని కూడా బొర్రయ్య రచించాడు. దానిలో యాదవరాజులు శక్తిమంతులుగా వెలుగొందిన చారిత్రక నగర శిథిలాల వర్ణన ఉంది.

మెకంజీ సలహాపై బొర్రయ్య గణితం, రేఖాగణితం, ఖగోళశాస్త్రం, భూగోళశాస్త్రం మొదలైన శాస్త్రాలలో నిర్దుష్టమైన జ్ఞానాన్ని సంపాదించాడు. పాశ్చాత్య హిందూ పద్ధతులను తెలుసుకొన్నాడు. అతనికి ధారణాశక్తి ఎక్కువగా ఉండటంచేత అతను తొందరలోనే వివిధ స్థానిక భాషల్లో నైపుణ్యం సంపాదించాడు. బొర్రయ్య స్పష్టంగాను, నిర్మాణాత్మకంగాను భౌగోళిక పటాలను చిత్రించడాన్ని మెకంజీ ఎంతగానో మెచ్చుకొనేవాడు.

బొర్రయ్య ప్రాచీన నాణేలను, భిన్న లిపులలో రాసిన శాసనాల ప్రతిబింబాలను సంపాదించాడు. దోదరె వద్ద దొరికిన శాసనం హళగన్నడ లిపిలో ఉంటే దాన్ని చదివి, ఆధునిక లిపిలో బొర్రయ్య రాసినపుడు మెకంజీ మిక్కిలి కృతజ్ఞతాభావంతో అతని పేరును ఆ శాసన ప్రతి మీద రాయించాడు. తర్వాత దానిని ఏసియాటిక్ సొసైటీ వారి ప్రదర్శనశాలలో భద్రపరిచారు. 1801లో ఫోర్ట్ సెంట్ జార్జి నుంచి ప్రభుత్వ ఆదేశం రావడంతో కార్యాలయపని నిమిత్తం కర్నల్ మెకంజీ మద్రాసు రావలసివచ్చింది. ఆయనతో బొర్రయ్య కూడా వచ్చి రెండేళ్ళు రాజధానిలోనే ఉద్యోగిగా ఉండి కొన్ని గ్రంథాలను, విలువైన లిఖితప్రతులను, మరికొన్ని కార్యాలయ పత్రాలను అనువదించాడు.

ఇంతటి ప్రతిభావంతుడైన బొర్రయ్య 1803లో 26వ తేదీన మరణించాడు. అతని అకాల మరణం దక్షిణ భారతదేశ చరిత్ర పరిశోధనకు పూడ్చలేని నష్టాన్ని కలిగించింది. అతని జ్ఞాపకార్థం మెకంజీ ఒక స్మారక చిహ్నాన్ని మద్రాసుమెరీనా బీచ్ సమీపంలో ఏర్పాటు చేశాడు. అది ఇప్పుడు అక్కడ లేదు. "ఇంతటి సుప్రసిద్ధ వ్యక్తిపట్ల అభిమానాన్ని చూపకుండా మిత్రులపట్ల, ఉద్యోగులపట్ల అతను చూపిన సహృదయతను గుర్తించకుండా అతడు సేకరించిన లిఖిత ప్రతులను చదవకుండా ఉండలేను" అని ఆర్.ఎచ్. ఫిల్మోర్ అన్న మాటలు ఇక్కడ ప్రస్తావనార్హం.

ఆనాడు బొర్రయ్య తెలుగు చరిత్ర నిర్మాణానికి అవసరమైన రికార్డుల్ని వివిధ భాషనుండి అనువదించి తెలుగువాళ్ళకు అందించడం ఒక రకమైన అనువాదకృషి. ఈ స్థానిక చరిత్ర రికార్డుల్ని భారతీయ భాషలనుండి ఆంగ్ల అనువాదాలుగా మార్చి అప్పటి ప్రభుత్వానికి అందించడం మరోకృషి. ఇప్పటికీ బొర్రయ్య చేసిన అనువాదాలు మనకు అందుబాటులో లేదంటే ఆశ్చర్యమేస్తోంది. ఆధునికంగా స్థానిక చరిత్ర అధ్యయనంలో బొర్రయ్య అనువాదాలు ఎంతో విలువైన ఆకరాలు. అతడి అనువాదాలన్నిటినీ అందుబాటులోకి తెస్తే అతని అనువాదకృషి బయటికి రావడమే కాక, తెలుగువాళ్ళ చరిత్ర పునర్నిర్మాణానికి ఎంతగానో ఉపకరిస్తాయి.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.



స్మృతి

ప్రవీణ్ యజ్ఞల
9959979363

# వ్యవహారిక భాషకు అడుగుజాడ !



21-9-1862
30-11-1915

కరెంటు కనిపెట్టకముందూ కనిపెట్టిన తర్వాతా మానవ జీవన పురోగతిలో ఎంత వ్యత్యాసం ఉందో సాహిత్యంలో ప్రాచీనతకూ, ఆధునికతకూ అంతే విస్తృతమైన వ్యత్యాసం కనిపిస్తుంది. ఇరవయ్యో శతాబ్దం వచ్చేవరకూ ఉజ్జాయింపుగా తెలుగులో ఒక వెయ్యి పుస్తకాలు వచ్చాయనుకుంటే ఒక 20వ శతాబ్దంలో పదివేలు అయినా వెలువడి ఉంటాయి. పత్రికలలో కథలూ, వ్యాసాలూ, కవితలూ ఇలా లెక్కలోకి తీసుకుంటే ఈ సంఖ్య లక్ష కూడా దాటవచ్చు. 19వ శతాబ్దంలో తెలుగు నాట ముగ్గురు మహనీయులు జన్మించారు. వాళ్ళెవరంటే వీరేశలింగం, గురజాడ, ఇంకా గిడుగు. 20వ శతాబ్ది మొదటి దశకం గడచే నాటికే వీళ్ళు తెలుగు ప్రజల్ని చైతన్యపరిచారు. వీళ్ళు ఆశించిన సమాజ, సాహిత్య, భాషా విషయక నవీనాశయాలు ఇంచుమించుగా ఫలించాయి. గడచిన కాలాన్ని వీళ్ళు సంస్కరించి ఉండకపోతే సమాజపరంగా, సాహిత్యపరంగా ఇప్పటి వెలుగు, తెలుగులో ఉండకపోవచ్చునని మనం గుర్తించాలి.

**“నాకు కావలిసింది నా దేశభాష సజీవమైన తెలుగు భాష”** అని తన భాషావిధానాన్ని స్పష్టం చేశారు గురజాడ. **“స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం చిక్కుపడుతున్నాం. ప్రజాస్వామిక పరిపాలన కోరుతున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు సామాన్యులకు ఏ భాష ద్వారా జ్ఞానం కలుగజేయవలసి వుంటుందో, ఏ భాషలో గ్రంథ రచన సాగించవలసి వుంటుందో, ఆలోచించండి”** అని రచయితలనూ పత్రికలనూ ఉద్దేశించి గిడుగు ప్రశ్నించారు. గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషోద్యమానికి శాస్త్రీయదృష్టితో ఆచరణాత్మకతను చేకూర్చితే, తన రచనల ద్వారా వాడుక భాషను మహోన్నత స్థాయికి తీసుకెళ్లిన వాడుక-భాషా శాస్త్రవేత్త గురజాడ. గురజాడ, గిడుగులు తెలుగు భాషను సంస్కృతాధార గ్రాంథికభాష నుండి విముక్తం చేసి తెలుగు భాషకు ప్రామాణికతను కలిగించారు. ఇరువురూ సహాధ్యాయిలూ సహచరులూ సన్నిహితులూ. వీటికి మించి భాషా విషయమై ఒకే రకమైన స్థిరాలోచన కలిగిన తెలుగు భాషను ప్రజా భాషగా తీర్చిదిద్దిన వ్యావహారిక భాషోద్యమ విజయ స్తంభాలుగా మనం వీళ్ళను చూడాలి.

గురజాడ సృజన శక్తికి ‘కన్యాశుల్కం’ నాటకమే ఒక చక్కని నిదర్శనం. తెలుగు సాహిత్య చరిత్రను ప్రభావితం చేసిన గురజాడ రచనల వెనుక విస్తృతమైన పరిశోధనాత్మక అధ్యయనం ఉంది. గురజాడ వ్యాసాలూ, లేఖలూ, డైరీలనూ పరిశీలిస్తే ఈ సంగతి స్పష్టమౌతుంది. స్వతస్సిద్ధంగానే గురజాడ పరిశోధనాత్మక దృక్పథం కలిగినవారు. చరిత్ర పరిశోధన, భాషల అధ్యయనం, శాసన పరిశీలన, నాటక రచన, విద్యాబోధన, ఇతర భాషలతో తెలుగు తులనాత్మక సింహావలోకనం, కావ్య విమర్శ మొదలైనవన్నీ ఆయన పరిశోధనలో ఆసక్తినీ, కృషినీ తెలియజేస్తాయి. గురజాడ పరిశోధనలన్నింటిలో కెల్లా తలమానికమైనది భాషా పరిశోధన. గురజాడ తన జీవితకాలంలో అత్యంత విలువైన అత్యధిక సమయాన్ని కేటాయించింది భాషా పరిశోధనకే. అందుకు కారణం వాడుక భాషకు సాహిత్య గౌరవం కల్పించాలన్నదే ఆయన ధ్యేయం. అప్పటి పాశ్చాత్య ఆంగ్ల విద్యా ప్రభావంతో తన చుట్టూ ఉన్న ప్రపంచంలో గురజాడను ప్రధానంగా ఆకర్షించినవి రెండే రెండు- ఒకటి ‘భాష’. రెండోది ‘నాటకం’. ప్రపంచంలోని పలు దేశాల్లో భాషకు సంబంధించిన పరిణామాలను తనకు లభ్యమైన ఆధారాలను గురజాడ సూక్ష్మంగా పరిశీలించేవారు. పొరుగు భాషలైన తమిళం, కన్నడం, బెంగాలీ భాషల్లోనూ, యూరోపియన్ భాషల్లోనూ వచ్చే మార్పులూ-చర్చలూ ఎలా జరుగుతున్నాయో ఎప్పటికప్పుడు ఉత్సుకతతో ఆయన తెలుసుకునేవారు.

ఈ సమాచారం కోసం వివిధ ప్రాంతాలకు చెందిన భాషాశాస్త్రవేత్తలతో పరిచయాలేర్పరచుకొని వారి నుండి ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సమాచారాన్ని సేకరించి అవగాహన చేసుకునేవారు. అంతర్జాతీయ పత్రికల్లో వెలువడే భాషా విశేషాలను అధ్యయనం చేసేవారు. దీని వెనుక ఉన్న బలమైన కారణం ఒక్కటే. తెలుగును నిత్య నూతనంగా, సజీవ భాషగా నిలపాలన్నది గురజాడ ఆకాంక్ష. గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం బహుళ జనాదరణ పొందటంతో గ్రాంథికవాదులు “ఇది సాంఘిక నాటకం కాబట్టి మాట్లాడుకునే భాషలో రాయగలిగావు కానీ ఇది ఏ చారిత్రక నాటకమో అయితే మాట్లాడుకునే భాషలో రాయగలవా?” అనే సవాలుని విసిరారు. దానికి జవాబుగా ఆయన ‘బిల్హణీయం’ అనే నాటకాన్ని మాట్లాడుకునే భాషలో రాశారు. ఛందోబద్ధమైన కవిత్వం రాయలేకే గురజాడ ఇలాంటి రచనలు చేస్తున్నారని గ్రాంథిక వాదులు వాదించారు. ఈ సవాలుకి జవాబుగా ఆయన ‘సుభద్ర’ అనే కావ్యాన్ని, ‘సత్యవ్రత’ శతకాన్నీ రాసి చూపించారు.

సాహిత్యాన్నీ, విద్యనీ సమాజంలోని కొందరి సొత్తుగా భావించడాన్ని గురజాడ ఆక్షేపించారు. అవి సమాజంలోని అన్ని మూలలకు వ్యాపించాలనీ, అందుకు వ్యవహారిక భాషే సరియైన సాధనమని గురజాడ వాదన. ఈ ప్రయత్నంలో ఆయనకు గ్రాంథిక భాషావాదుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీన్ని ఎదుర్కొనే ప్రయత్నంలోనే విస్తృతమైన భాషాపరిశోధన చేశారు. వాటి ప్రతిరూపమే ‘అసమ్మతి పత్రం’. వ్యావహారిక భాషలో విద్యాబోధనకి ప్రథమ ప్రధాన బీజం ఇదే. ఈ పత్రంలో గురజాడ చేసిన భాషాపరిశోధన చారిత్రకమైనది.

వర్ణనాత్మకమైనది, తులనాత్మకమైనది, అనువర్తితమైనది. గురజాడ అసమ్మతి పత్రంలో భాషకు సంబంధించిన ప్రతీ సూక్ష్మాంశం పరిశీలించబడింది. ఈ పత్రాన్ని చదివేకొద్దీ కొన్ని అంశాలను సూక్ష్మాతి సూక్ష్మంగా ఇంత విస్తృతంగా ఎలా చర్చించగలిగారా? అని ఆశ్చర్యం కలగకమానదు.

**ఒక ప్రత్యేకమైన పరిశోధన చేయగలిగినంత విషయ ప్రాధాన్యత కలిగినటువంటిది ఈ అసమ్మతిపత్రం.** ఇంటర్మీడియట్ పరీక్షలో విద్యార్థులు రాసే సమాధాన పత్రాలలో అనుమతించదగిన తెలుగు భాషాశైలి ప్రమాణాన్ని నిర్ణయించడానికి మద్రాసు విశ్వవిద్యాలయం 1911వ సంవత్సరంలో ఒక సంఘాన్ని నియమించింది. అందులో గురజాడ కూడా సభ్యులు. ఈ విషయమై అనేక తీవ్ర వాదోపవాదాలు, తర్కవితర్కాలతో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. అనంతరం 1914లో ఈ సంఘం తీసుకున్న నిర్ణయాలు విద్యాభివృద్ధికి మేలు చేయకపోవడమే గాకుండా, తప్పక కీడు చేస్తాయని నిరూపిస్తూ విశ్వవిద్యాలయానికి గురజాడ సమర్పించిన విశ్లేషణాత్మక నివేదికయే అసమ్మతిపత్రం. సాహిత్య రచనలో వ్యావహారిక భాష ప్రయోగాన్ని నిరసిస్తూ కొమఱ్ఱాజు లక్ష్మణరావు గ్రామ్యరూపాలన్నీ దేశంలోని ప్రతి ప్రాంతంలో వాడుకలో ఉన్నాయన్న గురజాడ వాదనను ఆక్షేపించారు. ఆనాడు గ్రాంథిక భాషావాదులు వ్యవహారిక భాషకు పెట్టిన పేరు గ్రామ్యం. అందుకు గురజాడ 'స్తే' అన్న సంయుక్త హల్లు ఉండే క్రియా రూపాలను వందల కొద్దీ ఉదాహరణలిచ్చారు. (వస్తూ, చేస్తే, చూస్తూ, రాస్తూ, ప్రార్థిస్తూ మొదలైనవి). అతి ప్రాచీన కాలం నుండి శాసనాది సాహిత్య గ్రంథాలు మొదలుకొని తన కాలం వరకు గల రచనల్లో ఆ ప్రయోగం ఎంత విస్తృతంగా వాడబడిందో వందల కొద్ది ఆధారాలతో నిరూపించారు.

సాహిత్యంలో వ్యవహారిక భాషను ఉపయోగించడం ద్వారా భాషకు ఉన్న పవిత్రత, పటుత్వం పోయి సాహిత్యం సామాన్య స్థితికి దిగజారుతుందనేది గ్రాంథిక భాషావాదులు వాదించేవారు. ఈ భ్రమను పోగొట్టడానికి గురజాడ ప్రపంచంలోని పలు భాషల వికాసాన్ని చారిత్రక ఆధారాలతో వివరించారు. ఇలాంటి గ్రాంథిక భాషావాదన ప్రతి దేశంలోను ఉన్నదేననీ, ఈజిప్టు యూరోపిన్ భాషలలో కూడా ఆరంభంలో ఇలాంటి ప్రతిఘటనలే ఎదురయ్యాయని ఆయన పలు ఉదాహరణలను చూపించారు. ఐతే కాలక్రమంలో ఆయా దేశాలలో వ్యవహారిక భాష సాధించిన ఫలితాలనూ, వికాసాన్నీ చూపిన పిదప వారు తమ అభిప్రాయాలను మార్చుకున్నారని కూడా ఆ అసమ్మతిపత్రంలో గురజాడ పేర్కొన్నారు. అసమ్మతిపత్రం రాయడానికి పూర్వమే తెలుగుభాషలో సంస్కరించుకోవాల్సిన సందర్భాలను తరుచుగా మిత్రులకు లేఖల్లో, వ్యాసాల్లో గురజాడ సూచిస్తూ ఉండేవారు. వ్యాకరణ బద్ధంగా రాయాలనే పండితులే ఎన్ని రకాలుగా వ్యాకరణ నియమాలను ఉల్లంఘించారో వారి రచనల నుండే ఉదాహరణలు చూపించారు.

వాడుకభాషకు గ్రామ్యం, మ్లేచ్ఛం అనే పేర్లు పెట్టి హేళన చేసే గ్రాంథిక వాదులు, అసలు ఆ పదాలనే ఎంత తప్పుగా అర్థం చేసుకున్నారో చూపించడానికి పతంజలి మహాభాష్యం మొదలుకొని పలు వ్యాకరణ గ్రంథాల నుండి ఉదాహరణలు చూపిస్తూ అసలు అర్థాన్ని గ్రహించమన్నారు. గ్రాంథిక భాషావాది అయిన కొక్కొండ వెంకటరత్నం, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, కొమఱ్ఱాజు లక్ష్మణరావు, వేదం వేంకటరాయశాస్త్రి మొదలైన వారి రచనలను, అభిప్రాయాలను పేర్కొంటూ, వారి దోషాలను వారికే చూపిస్తూ గురజాడ విస్తృతంగా తన వాదాన్ని వినిపించారు. వేదం వేంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయ నాటకాన్ని ఒకవైపు ప్రశంసిస్తూనే అందులోని అచారిత్రకతను, అనుదాత్తతను నిలదీశారు. వేదంవారి ఇతర నాటకాల్లోని అనౌచిత్యాన్ని విమర్శించారు. రచనా శిల్పంలోని అనౌచిత్యాల విషయంలో ఆయన కందుకూరిని కూడా వదలలేదు. పాఠ్య గ్రంథాలుగా ఉన్న నవలలోని విరుద్ధ చిత్రణలను కూడా తీవ్రంగా విమర్శించారు. అందుకే ఆయన సాహిత్య అడుగుజాడ అయ్యారు.

గురజాడ కావ్యభాష ప్రస్థానాన్ని సామాజిక దృష్టితో శాస్త్రీయంగా పరిశీలించారు. సంకుచితమైన సామాజిక, రాజకీయ, సాహిత్య ఆదర్శాలపై పెత్తనంగా ఉన్న పరిస్థితులు కావ్యభాష ఉత్పన్నం కావడానికి దారితీశాయని తన పరిశోధన ద్వారా తెలియజేశారు. భాష- సమాజం- సాహిత్యం- సంప్రదాయాల మధ్య గల సంబంధాలు, అవి ఒకదానిపై మరొకటి చూపిన ప్రభావాల్ని నిగూఢమైన అంశాలను సులువైన రీతిలో సమగ్రంగా విశ్లేషించారు. సాహిత్య భాషకు ప్రజాదరణ ఉన్నదని గ్రాంథిక భాషావాదులు చేసే మొండివాదనను తోసిపుచ్చుతూ, సాహిత్య భాషకు ఏనాడూ ప్రజాదరణ లేదనీ, అది కొద్దిమంది గుత్తసొమ్ముగా వుండేదనీ పలు ఆధారాలతో గురజాడ నిరూపించారు. **ఒక భాషారూపం దేశంలోని ప్రతి ప్రాంతంలో, సమాజంలో ప్రతీ విభాగంలో వాడుకలో ఉండాలనేది గ్రాంథిక భాషావాదుల వాదన. ఈ వాదన ఊహాలోకపు ప్రయాణమంటూ, ఏమాత్రం ఆచరణయోగ్యం కాదని పలు ఆధారాలతో వాదించారు. విద్య, భాష, చరిత్ర, సాహిత్యం, శాసనాలు, నాటకరంగం మొదలైన విషయాలకు సంబంధించి గురజాడ చేసిన కృషి అపరిమితమైనది.** కానీ ప్రజలకు అందిన ఫలాలు పరిమితమే. అయినప్పటికీ అవి ప్రామాణికంగా చరిత్రలో నిలిచిపోయాయన్నది గమనార్హం. సంఘసంస్కరణతో పాటు భాషా సంస్కరణకు గురజాడ శ్రీకారం చుట్టారు. వ్యావహారిక భాషపై ఆయన చేసి వాదనలూ, ప్రతిపాదనలూ ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. వ్యావహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి, శ్రీనివాస్ అయ్యంగారు తదితరులు ఆయన చేత స్ఫూర్తి పొందినవారే. నాది ప్రజల ఉద్యమం, దానిని ఒకరిని సంతోషపెట్టడానికి వదులుకోను అంటూ గురజాడ చిత్తశుద్ధితో చివరి వరకు 'మాట్లాడుకునే' తెలుగు భాషకే పట్టం కట్టడానికే అంకితమయ్యారు. నవంబరు 30 గురజాడ వర్ధంతి సందర్భంగా ఇది ఒక అక్షర నివాళి!

-ఈ వ్యాస రచయిత
ఆంధ్ర విశ్వవిద్యాలయం, పరిశోధక విద్యార్థి, విశాఖపట్నం.

"చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్ర విజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థికి పాఠశాల గది బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, పాఠశాల గదిలో పరాయిభాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు, శాస్త్రం మీదే కాక, చదువు మీద కూడా ఆసక్తి తగ్గుతుంది' - డి.ఎస్. కొఠారి

గోవిందరాజు చక్రధర్
98498 70520

# అమృత భారతమా! అడుగులు ఎటు?

భిన్నప్రాంతాలు, సంస్కృతులు, భాషల సమాహారమైన స్వతంత్ర భారతదేశం ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను చవిచూసింది. అభివృద్ధినీ సాధించింది. దేశ సమైక్యతా సమగ్రతలకు సవాళ్లు ఎదురైన ప్రతీసారీ దృఢదీక్షతో ఏకతాటిపై నిలిచి ప్రపంచ దేశాల ముందు భారత పతాకను సగర్వంగా ఎగరవేసింది.

దేశానికి స్వాతంత్ర్యం రాగానే జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో సామ్యవాదం, సంక్షేమ రాజ్యం దిశగా అడుగులు వేశాం. పంచవర్ష అభివృద్ధి ప్రణాళికలకు పునాదులు పడ్డాయి. మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ఎంచుకుని ప్రభుత్వ రంగంలో భారీ ఉక్కు కర్మాగారాలను నిర్మించుకోగలిగాం. భాక్రానంగల్, నాగార్జున సాగర్ వంటి పెద్ద డ్యామ్‌లను కట్టి లక్షలాది ఎకరాలను సుసంపన్నం చేశాం.

హరిత విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవాలతో కొరతలను అధిగమించగలిగాం. ఒకప్పుడు గోధుమలను, పాలపొడిని దిగుమతి చేసుకున్న మనమే ఇప్పుడు పాల ఎగుమతిలో ప్రపంచంలో తలమానికంగా ఉన్నాం.

ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణకు ద్వారాలు తెరచి అతి పెద్ద మార్కెట్‌గా అవతరించాం. అంతర్జాతీయ విపణిలో పోటీకి దీటుగా తట్టుకు నిలబడ గలుగుతున్నాం. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో వడివడిగా అడుగులు ముందుకు వేస్తూ, అనేక కొత్త ఆవిష్కరణలు చేయగలిగాం. అంతరిక్ష పరిశోధనల్లో కూడా ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాం. సమాచార ఉపగ్రహాల ప్రయోగంలో పైచేయి సాధించాం.

కమ్యూనికేషన్ రంగంలో అద్భుత పురోగతితో దూరాలు తరిగిపోయి ప్రపంచమొక కుగ్రామంగా మారింది. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియాల ప్రభావంలో యువత మునిగి తేలుతున్నారు.

శ్రామిక వలసలే కాకుండా అమెరికా, కెనడా వంటి దేశాలకు మేధోవలసలు సాగుతున్నాయి. వైద్యం, టెక్నాలజీ రంగాల్లో మేథో పరంగా భారతీయులు అగ్రగణ్యులని రుజువు చేసుకుంటున్నారు. ప్రపంచ శ్రేణి దిగ్గజ కంపెనీలకు ప్రవాస భారతీయులు సారథ్యం వహిస్తుండటమే ఇందుకు రుజువు. సత్య నాదెళ్ల, సుందర పిచాయ్, ఇంద్ర నూయీ వంటివారు భారతీయ మేధాసంపన్నతకు సగర్వ పతాకాలు. కమలా హారిస్ వంటి భారతీయ మూలాలున్న వారు విదేశీ గడ్డపై కీలకస్థానాల్లోకి వస్తూ మనకు గర్వకారణమవుతున్నారు.

భారత్ మొదటి నుంచి పొరుగు దేశాలలో మైత్రీ సంబంధాలను కాంక్షిస్తూ శాంతియుత సహజీవనానికే కట్టుబడి ఉంది. పలు అంతర్జాతీయ వేదికల నుండి మన దేశ సారథులు ఇదే విషయాన్ని నొక్కిచెప్తున్నారు. ప్రభుత్వంలో పార్టీలు మారినా మన విదేశాంగ విధానం యథాతథంగా కొనసాగడం విశేషం. అయితే మనపై కయ్యానికి కాలు దువ్వితే వారికి తగు గుణపాఠం చెప్తున్నాం. చైనా, పాకిస్తాన్‌లతో జరిగిన యుద్ధాలు మన రక్షణ సన్నద్ధతను పెంచాయి.

ధన, కుల ప్రాబల్యాలు, ప్రలోభాలు వంటి లోటుపాట్లు, బలహీనతలు ఉన్నా ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతున్నాం. దాయాది దేశం పాకిస్థాన్ ఈ 75 ఏళ్లలో చాలా సార్లు సైనిక తిరుగుబాట్లు నియంతృత్వపాలనలను చవిచూసింది. విస్తీర్ణంలో, జనాభాలో ఎన్నోరెట్లు పెద్దదైన మనదేశం మాత్రం ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ రావటం ఘనంగా చెప్పుకోవచ్చు. 18 ఏళ్ల వయసు పైబడిన వారందరికీ సార్వత్రిక ఓటు హక్కు కల్పించుకుని, నిర్ణీత ప్రకారం అతిపెద్ద ఎన్నికల యజ్ఞాన్ని మొత్తం మీద దిగ్విజయంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వాలను అందించగలుగుతున్నాం. మన సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్రలో ఇందిరాగాంధీ ఆత్యయిక పరిస్థితి ఒక్కటే మినహాయింపు. నియంతలకు ఇక్కడ చోటు లేదని పరిణిత ఓటరు నిరూపించాడు. జనతాపార్టీకి పట్టం గట్టి ఇందిరకు గుణపాఠం చెప్పాడు.

**సన్నగిల్లిన కాంగ్రెస్ ప్రాభావం**

దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించి పెట్టిన కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల విధేయత తరం మారేకొద్దీ తగ్గుతూ వచ్చింది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ ఆకాంక్షలు ప్రబలంగా నాటుకోవడంతో అంతటా ప్రాంతీయ పార్టీలే. కాంగ్రెసు నామమాత్రంగా కొన్ని రాష్ట్రాలకే పరిమితమైంది. సమర్థ నాయకత్వం కొరవడి మనుగడకోసం పోరాడుతోంది.

'ఇందిరాయే ఇండియా, ఇండియాయే ఇందిర' అంటూ పరాకాష్ఠకు చేరిన వ్యక్తిపూజ ప్రాంతీయ పార్టీలకూ పాకడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ప్రాంతీయ పార్టీలలోనూ అంతర్గత ప్రజాస్వామ్యానికి తిలోదకాలిచ్చారు. ప్రజాస్వామ్యం స్థానే వ్యక్తిస్వామ్యం వేళ్లూనుకుంది. ఒకే వ్యక్తి తిరుగులేని అధికారాలు చలాయిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీలోని కుటుంబ పాలన జాఢ్యం ప్రాంతీయ పార్టీలకూ సోకింది. రాజకీయాల్లో సైద్ధాంతిక విధానాలు వెనకబడిపోయాయి. తాత్కాలిక ప్రయోజనాలు, ప్రాంతీయతలు, భావోద్వేగాలు, మొదటి స్థానంలోకి వచ్చాయి. రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలు, నదీజలాల వాటాల వివాదాలు కొనసాగుతున్నాయి.

**చట్టసభలకు విలువేది?**

ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు ఎంతో విలువ ఉంది. గతంలో చట్టసభల్లో ప్రతిపక్షవాణిని బలంగా వినిపించేవారు చర్చకు వచ్చే అంశాలపై ప్రజాప్రతినిధులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి అన్ని పార్శ్వాలలో లోతుగా చర్చించేవారు. ప్రతిపక్షనేతల సూచనలను, అభిప్రాయాలను, పాలక పక్షం కూడా గౌరవించి శిరసావహించేది. ఇప్పుడు ఈ సంప్రదాయాలకు నీళ్లొదిలారు. అంతకు ముందే ప్రభుత్వాధినేత తీసుకున్న నిర్ణయాలకు తమకున్న సంఖ్యాబలంతో

చట్టసభల్లో ఆమోద ముద్ర వేయించుకుంటున్నారు. ప్రతిపక్షసభ్యులు వ్యక్తం చేసే సవరణలను, అభ్యంతరాలను తమ సంఖ్యాబలంతో నొక్కేస్తున్నారు.

రాజకీయాల్లో మరీ ముఖ్యంగా అధికార పార్టీవారు సహనం కోల్పోయారు. మితిమీరిన అధికార మదంతో తమకు తిరుగులేదని విర్రవీగుతున్నారు. సభ్యతా సంస్కారాలు మరచి, హుందాతనాన్ని వీడి, దూషణలు, వ్యక్తిగత ఆరోపణలతో రాజకీయాలకే కళంకం తెస్తున్నారు. రాజకీయంగా పొడసూపుతున్న ఈ భ్రష్టాచారాలను మొగ్గలోనే తుంచే ప్రయత్నం చేయకుంటే అది చివరకు నియంతృత్వానికి దారితీసే ప్రమాదమూ ఉంది.

**ఇప్పుడు రాజకీయమే సమస్తం**

ఇప్పుడు రాజకీయ రంగమే కీలకమైంది. రాజకీయాధికారం ఉంటే చాలు, అన్నీ ఉన్నట్లేనని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. డాక్టర్లు, యాక్టర్లు, మొదలు రౌడీలు, దాదాల దాకా ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో చేరి ప్రజాసేవలో తరించాలని తపిస్తున్నారు. రాజకీయం ప్రజాసేవకోసం అనే ఉదాత్త ఆశయం కనుమరుగై, సంపాదన మార్గమన్న భావనలు ఊడలు దిగాయి.

రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అధికారంలోకి రావటానికి, దాన్ని నిలుపుకోవటానికి ఎంత డబ్బయినా గుమ్మరించటానికి వెనకాడటం లేదు. ప్రజా శ్రేయస్సును కాంక్షించే మేథావి వర్గాలు రాజకీయాలకు దూరమై నిస్సహాయంగా చూస్తుండిపోతున్నారు. ఈ ధనరాజకీయంతో మధ్య తరగతివర్గంలో నిష్క్రియాపరత్వం, నిస్తేజం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఒరిగేదేమీ లేదన్న భావనతో మధ్యతరగతివారు రాజకీయాలకు, ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. బాగా చదువుకుని ఏ అమెరికాలోనో మంచి ఉద్యోగంలో స్థిరపడితే చాలు, జన్మ ధన్యమైనట్లేనని అనుకునే యువత, దేశ సామాజిక రాజకీయ అంశాలపై నిరాసక్తంగా ఉంటోంది. మరో పక్క అల్పాదాయ వర్గాలను పలు రకాల తాయిలాలతో ఆయా పార్టీలు బుట్టలో వేసుకుని పబ్బం గడుపుకుంటున్నాయి.

**ఊడలు దిగిన అవినీతి**

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా చట్టాలు, సామాన్యుడి చుట్టాలు కాలేకపోయాయి. బ్రిటీష్ వారసత్వంగా సంక్రమించిన రాజద్రోహ చట్టాన్ని ఇంకా తలకెత్తుకుని ఊరేగుతున్నాం. వివిధ కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పేరుకుపోతూ పూళ్లూ ఏళ్లూ గడిచినా న్యాయం అందని ద్రాక్షగానే ఉంది. పాలనా సంస్కరణలను ప్రవేశపెడుతున్నా, ప్రభుత్వ కార్యాలయాలనుంచి లంచావతారాలను తరిమికొట్టలేకపోతున్నాం. ఉద్యోగులకు చేయి తడపనిదే పనికాదన్న చేదు నిజాన్ని గరళకంఠుడిలా సామాన్యుడు భరిస్తున్నాడు. అవినీతి ఉద్యోగులపై దాడులకు, సజీవ దహనాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయినా పరిస్థితిని చక్కదిద్దడంలో పాలకుల్లో చిత్తశుద్ధిలేదు. మరోపక్క మేంమాత్రం తక్కువ తిన్నామా అంటూ రాజకీయ నేతలూ అవినీతికి తెగబడుతున్నారు. **ఈనాటి అవినీతి స్థాయిని అంచనా వేయలేం అయిన కాడికి ప్రాజెక్టుల్లో కమీషన్ల రూపేణా నొక్కిన వందల, వేల కోట్లు బినామీల పేరిట పెట్టుబడి వరదలవుతున్నాయి. స్విస్ బ్యాంకుల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఆ డబ్బును స్వదేశానికి రప్పిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారే గానీ చిల్లిగవ్వ వెనక్కి వచ్చిన దృష్టాంతాలు మాత్రం లేవు. రాత్రికి రాత్రి కోట్లకు పడగలెత్తుతున్న వారిని నెత్తిన పెట్టుకోవడం మన ఆలోచనల వైపరీత్యానికి, విలువల పతనానికి పరాకాష్ఠ.**

**అన్నిరంగాలూ కార్పొరేట్ల పరం**

విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాల రంగం ఇలా సమస్తం కార్పొరేట్లపరం అయిపోతున్నాయి. సంక్షేమ రాజ్యభావనను కాల రాచారు. జాతి గర్వంగా చెప్పుకునే సంస్థలు, ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న సంస్థలూ ప్రైవేటుపరం అయిపోతున్నాయి. ప్రభుత్వ భూములను తెగనమ్ముతున్నారు. ఆర్థిక అంతరాలు పెరిగి పోతున్నాయి. బక్క రైతు, శ్రామికుడు, సామాన్యుడు బతకలేని పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి.

వైద్య రంగంలోని బోలుతనాన్ని కరోన కళ్లకు కట్టించింది. ఇప్పటికీ గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సదుపాయాలు లేవు. ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్య పరుస్తూ కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీకి ఆస్థులను తెగనమ్ముకుని ప్రాణాలను కాపాడుకునే దయనీయ స్థితిలో మనం ఉన్నాం. కనీసం పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు దేశవ్యాప్తంగా వైద్య కళాశాలను, ఆస్పత్రులని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి. పెరిగే జనాభాతోపాటు, విజృంభిస్తున్న సరికొత్త రోగాలతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపాల్లా కొట్టుకుంటున్నాయి.

స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్న యువతరానికి ఆ స్వేచ్ఛావాయువుల విలువేమిటో తెలియక పోవచ్చు. దేశం పట్ల అభిమానం లుప్తమౌతూ వస్తున్నది. ఈ దేశం సుభిక్షంగా, సుదృఢంగా ఉన్నప్పుడే భారతీయులుగా మన మనుగడ, అస్థిత్వం అనే వాస్తవాన్ని తెలియచెప్పి దేశం పట్ల, సాటి భారతీయుల పట్ల ప్రేమాదరణలు పెంచి పోషించటానికి విద్యాపరంగా గట్టి పునాదులు వేయాలి. వ్యక్తి స్వార్థమే ఏకైక పరమార్థంగా విలువల వలువలను ఊడ్చేస్తున్న ఈ కాలంలో బాల్యం నుంచే నైతిక విలువలను పెంచి పోషించాలి.

భారత్ పొరుగు దేశాలన్నీ రాజకీయంగా, ఆర్థికంగా ఏదో ఒక సమస్యతో, సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆయా దేశాలలోని అస్థిర సరిస్థితులలో భారత్‌లోకి అక్రమ చొరబాటుదారులు పెరిగే ప్రమాదం ఉంది. ఈ సమస్య జటిలం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

**వ్యవస్థల్లో, ఆలోచనల్లో జొరబడుతున్న జాడ్యాలను గుర్తించి వాటిని రూపు మాపటానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలి, పాలకులేగాక మేధావి వర్గాలూ తమ వంతు క్రియాశీల పాత్రపోషించాలి.**

రాబోయే తరాలకు సుసంపన్న శతవసంత భారతావనిని అందించటం మనందరి కర్తవ్యం.

డాక్టర్ షేఖ్ మహబూబ్ బాషా
డాక్టర్ మొహమ్మద్ కరీం

# వరకట్నాన్ని నిరసించిన మౌలానా ఆజాద్



**29** జనవరి 1914 (గురువారం) నాడు కలకత్తా నగరంలో బ్రాహ్మణ కులానికి చెందిన ఒక అమ్మాయి తాము అద్దెకుండిన యింటి పైకెక్కింది. తెల్లబట్టలేసుకున్న 14-15 సంవత్సరాల ఆ అమ్మాయి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోయింది. ఆమె తండ్రి ఆమెకోసం పెండ్లి సంబంధాలు చూస్తూండినాడు. కానీ విపరీతమైన వరకట్న డిమాండ్లను తట్టుకోలేక చివరకు తమకున్న కొద్దిపాటి పూర్వీకుల ఆస్తిని తాకట్టు పెట్టదానికి నిర్ణయించుకున్నాడు. తన పెళ్ళికోసం తండ్రి కష్టపడడం, తన కుటుంబం రోడ్డున పడే అవకాశముండడం యిష్టంలేని ఆ అమ్మాయి తనను తాను చంపుకోవాలనే నిర్ణయం తీసుకొంది. ఆ అమ్మాయే ఇరవయ్యవ శతాబ్ది ప్రథమార్ధంలో తీవ్ర సంచలనాన్ని సృష్టించిన స్నేహలతా ముఖోపాధ్యాయ. ఇంతదాకా లభిస్తున్న ఆధారాల ప్రకారం ఆమెది భారతదేశ చరిత్రలో తీవ్ర ప్రకంపనలు సృష్టించిన మొట్టమొదటి వరకట్న హత్య. ఆమె తండ్రి హరేంద్ర చంద్ర ముఖోపాధ్యాయ చిరుద్యోగి. అతనికి యిద్దరు కూతుళ్ళు; ముగ్గురు కొడుకులు. ఆడపిల్లల్లో స్నేహలత పెద్దది. ఆమె పెళ్ళి విషయంలో తండ్రి నిస్సహాయుడుగా మిగిలిపోయాడు.

వరకట్న దురాచారానికి పునాదులు వలసపాలనా కాలంలో పడ్డాయి. 1870ల నుండీ అది భారతదేశంలోనూ, బెంగాల్ లోనూ త్వరితగతిన వ్యాపించి వికృతరూపాన్ని చూపనారంభించింది. (బ్రిటీష్ వలస ప్రభుత్వ ఆర్థిక విధానాలు వరకట్న దురాచారానికి ఎలా దారితీసాయో వీనా తల్వార్ ఓల్డెన్ బర్గ్ తన “Dowry Murder” అనే పుస్తకంలో పంజాబ్ ప్రాంత ఉదాహరణలతో చక్కగా వివరించారు.) జీతభత్యాలు పొందే మధ్యతరగతి రూపొందిన తర్వాత వరకట్న మహమ్మారి విపరీతంగా పెరిగిపోనారంభించింది. ఇంగ్లీషు విద్య, యూనివర్సిటీ డిగ్రీలు, వలస ప్రభుత్వోద్యోగాలు పెళ్ళిళ్ళ మార్కెట్టులో వరుల డిమాండును విపరీతంగా పెంచనారంభించాయి. అమ్మాయిల తల్లిదండ్రులు కూడా వరులనెంపిక చేయడంలో ఈ విషయాలకే అధిక ప్రాధాన్యతనివ్వడంతో యిట్టి వరులకు డిమాండు పెరిగి అదే మోతాదులో వరకట్న డిమాండు అధికమైంది. లండన్లోని “టైమ్స్” పత్రిక సంపాదకునికి రాసిన లేఖలో (27 సెప్టెంబరు 1907న) హెచ్. టి. ప్రిన్సెప్ కలకత్తా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన అబ్బాయి పదివేల రూపాయల వరకట్నాన్ని డిమాండు చేసేవాడని రాశాడు. అలాగే జనాభా లెక్కల కమీషనర్ అయిన ఎడ్వర్డ్ ఆల్బర్ట్ గెయిట్ “పెళ్ళిళ్ళ మార్కెట్టులో బి.ఏ. డిగ్రీ చాలా విలువైన ఆస్తి”గా పరిగణింపబడేదని గమనించాడు. జనాభా లెక్కల ప్రకారం బీహారు వాళ్ళకన్నా బెంగాలీ అబ్బాయిలు వరకట్నాన్ని డిమాండు చేయడంలో చాలా చెడ్డ పేరు తెచ్చుకున్నారు.

వరకట్న సమస్య పెరిగే కొద్దీ దానికి వ్యతిరేకంగా నిరసన గళాలు వినిపించడం మొదలైంది. మేధావులు ప్రజలను జాగృతం చేయడానికి రచనలు చేస్తూ వచ్చారు. అమృతలాల్ బసు (‘బిబాహ బిభ్రత్’, 1885), రాజ్ క్రిష్ణరే (‘లో భేంద్ర గోబేంద్ర’, 1890), గిరీష్ ఘోష్ (‘బలిదాన్’, 1904) మొదలైనవారు బెంగాలీలో నాటికలను రచించడం ద్వారా వరకట్న వ్యతిరేక ప్రచారం గావించారు. ‘భారత్ వర్ష’, ‘బామబోధినీ పత్రిక’, ‘సోం ప్రకాష్’, ‘కాయస్థ పత్రిక’, ‘సులభ్ సమాచార్’ మొదలైన బెంగాలీ పత్రికలు వరకట్నాన్ని విమర్శిస్తూ అనేక రచనల్ని ప్రచురించాయి.

స్నేహలతా ముఖోపాధ్యాయ వరకట్న హత్యానంతరం అవే కారణాల వల్ల నిభానాని, చారుశీల అనే బాలికలు కూడా ఆమె మార్గాన్ని అనుసరించారు. స్నేహలత చనిపోయిన వెంటనే అనేక మంది బెంగాలీ మేధావులు సమకాలీన పత్రికల్లో ఆమెను గూర్చి రాశారు. ఉదాహరణకు 7 మరియు 14 ఫిబ్రవరి 1914 నాటి “అమృత బజార్” పత్రికలో ఆమె వరకట్న హత్యకు సంబంధించిన వివరాలు ప్రచురించబడ్డాయి. చునీలాల్ బోస్ 1914లో స్నేహలత వరకట్న హత్యపై ఒక కరపత్రాన్ని ప్రచురించాడు. స్నేహలత మరణం బెంగాల్లో వివాహ సంస్కరణ ముఖ్యంగా వరకట్న నిషేధం గూర్చిన తీవ్ర చర్చలకు దారితీసింది. అనేక సమావేశాలు జరిగి బెంగాల్ సార్వజనిక క్షేత్రంలోని ప్రముఖులెందరో వాటికి హాజరయ్యారు. ‘మహిష్య మహిళ’, ‘సువర్ణ బనిక్ సమాచార్’ వంటి కుల పత్రికలతోపాటు ‘భారతి’, ‘మహిళ’, ‘బామబోధినీ పత్రిక’ మొదలైన స్త్రీల పత్రికలు కూడా వరకట్న నిషేధ విషయాన్ని చర్చించాయి. “మృత్యు స్వయంభర్” (“మృత్యువుతో ఆలింగనం”) అనే దీర్ఘ కవితలో సత్యేంద్రనాథ్ దత్తా వరకట్నం తీసుకొనే వరులను తీవ్రమైన పదజాలంతో విమర్శించాడు. 1914లో ప్రచురించబడ్డ రవీంద్రనాథ్ టాగోర్ కథల్లో కూడా స్నేహలత మరణం విషయం సూచించబడింది. పవిత్ర గంగోపాధ్యాయ ఆత్మకథ “చలమాన్ జీబన్” ప్రకారం స్నేహలత బలిదానం విషయం బెంగాల్ అంతటిలోనూ తీవ్ర సంచలనం కలిగించడంతోపాటు పల్లెపట్టులకు కూడా పాకింది. అనేకమంది రచయిత్రులు కూడా స్నేహలత విషాదగాథపై స్పందించారు. మల్లికాసుందరీదాస్ అనే ఉపాధ్యాయురాలు “స్నేహలతార్ జీబన్ యజ్ఞ” (“స్నేహలత జీవిత త్యాగం”) అనే దీర్ఘ

కవితను 1916లో ప్రచురించింది. ఒక రచయిత్రి 'బామబోధినీ పత్రిక'లో రాస్తూ తన కూతురు కొన్ని సంవత్సరాల క్రితం వ్యాధి బారినపడి చనిపోయిందనీ, తను అలా చనిపోవడమే మేలైందనీ, లేకపోతే వరకట్న హత్యకు గురయ్యేదేమోనని వాపోయింది. స్నేహలత తండ్రి దగ్గరి స్నేహితుడైన రేబతీకాంత బంద్యోపాధ్యాయ 16 ఫిబ్రవరి 1914న "స్నేహలత" అనే శీర్షికతో స్నేహలతా ముఖోపాధ్యాయ 30 పేజీల జీవిత చరిత్రను ప్రచురించాడు.

అనేకమంది సమకాలీనులు స్నేహలతను దేశక్షేమం కోసం ఆత్మబలిదానం చేసిన "సతి" అనీ "దేవి" అని కొనియాడారు. అయినప్పటికీ స్నేహలతను విమర్శించినవారు కూడా కొందరు లేకపోలేదు. గోవింద చంద్రదాస్ లాంటి కవులు స్నేహలతను విమర్శించారు ('స్నేహలత'', 'నవ్యభారత్', ఆగష్టు-సెప్టెంబర్ 1915). రెండు పుటల ఈ కవితలో స్నేహలత పురాణ స్త్రీలైన సీత, ద్రౌపదిల్లాగా కష్టాలను భరించి ఉండాల్సిందనీ, పెళ్ళికాకపోయుంటే ఒంటరిగానే మిగిలిపోయి, పాశ్చాత్య స్త్రీల్లాగా దేశ సేవకు జీవితాన్ని అంకితం చేసి వుండాల్సిందనీ గట్టిగా వాదించారు. అయినా యిలాంటి వారి సంఖ్య చాలా తక్కువగానే వుండింది.

స్నేహలత కలిగించిన ప్రభావంతో వరకట్నాన్ని నిరసిస్తూ బెంగాల్‌లో అనేక బహిరంగ సభలు జరిగాయి. 21 ఫిబ్రవరి 1914న కలకత్తాలోని కాలేజ్ స్క్వేర్ మైదానంలో అతి పెద్ద బహిరంగ సభ జరిగి వరకట్నానికి వ్యతిరేకంగా శపథం తీసుకోవడం జరిగింది. అదే నెలలో కలకత్తాలో Anti-Marriage Dowry League స్థాపించబడింది. బెంగాలీలు వరకట్నాన్ని "జాతి పరంగా సిగ్గుచేటైన" విషయంగానూ, "జాతీయ బలహీనత"గానూ భావించడం మొదలు పెట్టారు. వరకట్నం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయంగా భావించనారంభించారు. వరకట్న వ్యతిరేక ప్రచారం బెంగాల్‌లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా సాగింది. వాస్తవానికి 1870ల్లోనే బీహారు, ఉత్తరప్రదేశ్‌లలో ముల్జీ ప్యారీలాల్ వరకట్న నిషేధం విషయంలో బృహత్తరమైన కృషి చేశాడు. ఈ విషయంలో అతడు బెంగాల్ సంఘసంస్కర్తలకన్నా అనేక విధాల ముందంజలో ఉండినాడు.

ఈ నేపథ్యంలో భారత జాతీయోద్యమ నాయకుల్లో ప్రముఖుడైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్నేహలత వరకట్న హత్యపై 11 మార్చి 1914 నాటి "అల్-హిలాల్" పత్రికలో 'షహీదె రస్మ్' అనే శీర్షికతో రెండు పుటల వ్యాసం రాయడంతో పాటుగా స్నేహలతా ముఖోపాధ్యాయ ఛాయాచిత్రాన్ని కూడా ప్రచురించాడు. 'షహీదె రస్మ్' అంటే సామాజిక (దుష్ట) ఆచారాలను రూపుమాపడానికి ప్రాణత్యాగం చేసిన వీరనారి. "అల్-హిలాల్" ('నెలవంక") మౌలానా ఆజాద్ సంపాదకత్వంలో జూన్ 1912 నుండి 1914 వరకు కలకత్తా నుండి ఉర్దూలో వెలువడిన వార పత్రిక. ఇందులో ఆజాద్ ఇస్లాం గూర్చీ, ముస్లింలలో జాతీయవాదాన్ని పెంపొందించడానికి సంబంధించీ, హిందూ - ముస్లిం ఐక్యత గూర్చి విస్తృతంగా చర్చించేవాడు. అలాగే సామాజిక మార్పుకు సంబంధించిన అంశాలనూ స్పృశించాడు. "అల్-హిలాల్" ఎంతగా ప్రజాదరణ పొందిందంటే పత్రిక వెలువడిన రెండేళ్ళకు చందాదారుల సంఖ్య 26 వేల వరకు పెరిగింది. "అల్-హిలాల్" పత్రిక ముస్లింలలో ప్రబోధిస్తున్న జాతీయ వాదంతో అలజడి చెందిన బ్రిటీష్ ప్రభుత్వం పత్రికా చట్టం ప్రకారం కట్టిన మొత్తం 12 వేల రూపాయల ధరావతును మ్రింగివేయడమే కాకుండా 1915లో 'అల్ - హిలాల్ ప్రెస్'ను స్వాధీనం చేసుకొందని మౌలానా ఆజాద్ తన స్వీయ చరిత్రలో రాసుకొన్నారు. ('India Wins Freedom', పు. 8-9)

స్నేహలతా ముఖోపాధ్యాయ వరకట్న హత్యకు ఉపోద్ఘాతంగా మౌలానా ఆజాద్ సంఘసేవ, దేశ ప్రేమ, స్వార్థత్యాగం, మానవాళిపట్ల ప్రేమ మొదలైన విషయాలకు సంబంధించిన తాత్త్వికాంశాలను చర్చించాడు. మంచి పనికోసం కష్టాలను భరించడం, ఆత్మబలిదానం చెయ్యడమే "జిహాద్"కు నిజమైన అర్థం అని ఆజాద్ నిర్వచించాడు. ఆయన ప్రకారం ప్రపంచానికి మేలు చేయడానికి మనిషి ఎంతో కొంత కష్టాలను భరించాల్సి వుంటుంది. కష్టాలకు గురికాకుండా మానవాళికి మేలు చేకూర్చే విషయంలో ఒక్కడుగు కూడా ముందుకు వెయ్యలేము. స్వసౌఖ్యాలను త్యాగం చెయ్యకుండా దేవుడినీ, అతడు సృష్టించిన మనుషులనూ నిష్కల్మషంగా ప్రేమించలేము. ఇతరులకు మేలు చేకూర్చాలనుకునేవారు స్వప్రయోజనాలను పూర్తిగా వదులుకోవాల్సి వుంటుంది.

ఆజాద్ అభిప్రాయంలో ఒక దేశభక్తుడు దేశం కోసం ఉరితాడును చుంబిస్తాడు. ఒక సత్యప్రవర్తకుడు లక్ష్యం కోసం తన విలాసవంతమైన, సౌఖ్యవంతమైన జీవితాన్ని వదులుకుంటాడు.

జ్ఞానాన్వేషణలో ఒక జ్ఞానీ, అన్వేషకుడూ తమను తాము కోల్పోతారు. వీరందరూ దైవ ప్రేమలో, మార్గంలో తమను తాము బలిచేసుకొనే 'జిహాదీ'లనబడతారు. మంచి పనికోసం ఆత్మబలిదానం చెయ్యనవసరం లేదనీ, మనిషి అరిషడ్వర్గాలను జయిస్తే చాలనీ ఇస్లాం చెబుతుందని వివరించాడు మౌలానా ఆజాద్. మానవాళి సేవలో, దేశ ప్రేమలో అర్పించిన పవిత్రమైన బలిదానాల సుదీర్ఘమైన చిట్టా చరిత్ర పొడుగునా వుందన్నాడు. సోక్రటీసు విషం సేవించాల్సి వచ్చిందనీ, క్రీటు దేశస్థులు తమ దేశంకోసం అగ్నిలో దూకారనీ, ఇటలీ దేశభక్తుడు జోసెఫ్ మాజినీ తన జీవితాంతం కష్టాల పరంపరకు గురయ్యాడనీ తెల్పుతూ ఈ అందరు మహనీయుల సరసన పదిహేడు సంవత్సరాల (ఆమె వయసు 14-15 సంవత్సరాలు; మౌలానా ఆజాద్ పొరబడ్డాడు) స్నేహలతా దేవికి స్థానం దొరకదా అని ప్రశ్నించాడు. ఆమె తన భర్త చితి మీద కాకుండా దేశప్రేమలో 'సతి' అయ్యిందని ఘంటాపథంగా చెప్పాడు.

భౌతికాభివృద్ధితో తళుకులీనుతున్న ఈ ప్రపంచం దాష్టీకంతో నిండి వుండి అందరూ కేవలం లాభాపేక్షతోనూ, స్వార్థపరత్వంతోనూ మెలుగుతుంటారన్నాడు ఆజాద్. నిశిరాత్రిలో కాలిపోయిన స్నేహలత ఆత్మ సామాజిక దుష్టాచారం పట్ల దీనంగా ఘోషిస్తుంటే సమాజం తనకేమాత్రం పట్టనట్టే ఉదాసీనంగా వ్యవహరిస్తోందని వాపోయాడు. స్నేహలత ఆత్మబలిదానంతో దేశానికి జీవించే మార్గాన్ని / సన్మార్గాన్ని చూపించిందనీ, ఈ ఘటన ఆధునిక భారతదేశంలోనూ, ఆధునిక బెంగాల్ లోనూ ఉన్న చిన్న బాలికలను సైతం జాగృతం చేస్తుందని ఆశిస్తూ హెచ్చరించాడు. అటువంటి బాలికలను తమ ఒళ్ళో పెంచే తల్లులను ఒకవైపు ప్రశంసిస్తూ ఇంకోవైపు పురుషుల్లో దేశంపట్ల ప్రేమ, సామాజిక బాధ్యతల లేమిని నిందించాడు.

స్నేహలతా దేవి ఒక పేద బెంగాలీ కుటుంబానికి చెందిన బాలిక

అనీ, ఆమె తల్లిదండ్రులు ఆమెకు పెళ్ళి చెయ్యాలన్న చింతలో ఉండినారనీ, వరకట్న దురాచారం వల్ల నిస్సహాయులుగా మిగిలిపోయారనీ, ఆమెకు సంబంధం కుదిరిన చోట వరుడి పక్షం వాళ్ళు 3,000 రూపాయల వరకట్నం డిమాండు చేశారనీ తెలియపరచాడు మౌలానా ఆజాద్.

బెంగాలీల్లోనూ, అధికశాతం హిందూ సమాజంలోనూ పెండ్లి అప్పుడు వరకట్న దురాచారం ఉన్న విషయాన్ని బహిర్గతం చేశాడు మౌలానా ఆజాద్. పెండ్లికూతురు తల్లిదండ్రులు పెండ్లికుమారునికి అధిక మొత్తంలో వరకట్న రూపేణ డబ్బు ముట్టజెప్పాల్సి వస్తోందన్నాడు. హిందూ స్త్రీలకు తండ్రి ఆస్తిలో వారసత్వపు హక్కు లేకపోవడం వరకట్న దురాచారం ఉండడానికి ఒక కారణమని చెప్పాడు. వరకట్న దురాచారం వల్ల కలిగే అసమాన అధికార సంబంధాలను వివరిస్తూ బాలికల తల్లిదండ్రులు బాలుర తల్లిదండ్రులను నీచాతినీచ బానిసలుగా చూస్తున్నారన్నాడు. అంతేకాకుండా వారి జీవితం మొత్తం వరుడి పక్షంవారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా తయారవుతున్నదనీ, అంత పెద్ద ఎత్తున వరుడి పక్షం అధికారం చలాయిస్తున్నదనీ విశ్లేషించాడు. ఎంత మంచి వరుడి కోసం వెతుకుతారో అంత ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తుందనీ, చాలాసార్లు ఏమౌతుందంటే అమ్మాయి పక్షం అవసరాన్ని ఆసరాగా చేసుకొని అబ్బాయి పక్షంవారు ధర పెంచేస్తారనీ వివరించాడు. దీని పర్యవసానంగా పేద బెంగాలీ కుటుంబంలో బాలికగా పుట్టడమే ఆమె వినాశనానికి కారణమౌతోందన్నాడు. ఎన్నో కుటుంబాలు కేవలం ఒక్క అమ్మాయికి పెళ్ళి చేసి తమ యావదాస్తిని కోల్పోయి ఆ తర్వాత యావజ్జీవితం పేదరికంలో మగ్గిపోవాల్సి వస్తోందని బాధపడ్డాడు.

వరకట్న దురాచార నిర్మూలన విషయంలో సంఘసంస్కర్తల వైఫల్యాన్ని ఎండగడుతూ 19వ శతాబ్ది బెంగాల్‌లో అనేకమంది ప్రఖ్యాతి వహించిన సంఘసంస్కర్తలు పుట్టుకొచ్చినప్పటికీ ఎవరూ వరకట్నం అనే "సంకెళ్ళను" త్రుంచలేకపోయారనీ, రాజారామ మోహన్ రాయలు సంఘసంస్కరణ విషయంలో అనేక విజయాలు సాధించాడనీ, కేశవ చంద్రసేన్ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా యావజ్జీవితం పోరాడాడనీ, కాని వరకట్న మహమ్మారి అనే "దేశ శత్రువు"ను ఎవరూ ఓడించలేకపోయారనీ నిష్ఠురమాడాడు. ప్రముఖులైన సంఘ సంస్కర్తలు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఈ విషయంలో విఫలమయ్యారనీ, కానీ పేద కుటుంబానికి చెందిన కేవలం 17 సంవత్సరాల బాలిక తనొక్కతే వరకట్నమనే శత్రువును ఎదుర్కొన్నదనీ, వరకట్న శత్రువును ఎదుర్కొనడానికి ఆమె దగ్గర సాధన సంపత్తులేవీ ఉండినవి కాదనీ, అయినప్పటికీ సంఘ సంస్కర్తలు యావజ్జీవితకాలంలో సాధించలేకపోయిన పనిని స్నేహలత మొగ్గలాంటి తన జీవితాన్ని చిదిమేసుకోవడం ద్వారా ఒక్కక్షణంలో సాధించిందని ప్రశంసించాడు. సామాజిక మార్పును కోరుకునేవారిని ఉద్దేశించి రాస్తూ ఈ ప్రపంచంలో మార్పు తీసుకురావడానికి ఒకే ఒక ఆయుధముందనీ, అది ఆత్మబలిదానమనీ తెలిపాడు. సంఘ సంస్కర్తల్లో బలిదాన లక్షణం లేని కారణంగా వారు స్నేహలతవలె విజయం సాధించలేకపోతున్నారని విమర్శించాడు.

తన పెళ్ళికోసం తల్లిదండ్రులు తమకున్నదంతా త్యాగం చేయనున్నారని తెలుసుకొని స్నేహలత బాధపడిందని తెలియజేశాడు ఆజాద్. ఆమె తల్లిదండ్రుల వద్ద ఉండడానికి ఒక ఇల్లు, కొంత స్థలమూ ఉండినాయనీ, వాటిని తాకట్టు పెట్టి కొంత మొత్తం తేవాలనుకున్నా ఎవరూ సరైన మొత్తం యివ్వడానికి సిద్ధంగా లేకుండినారనీ, యిదంతా గమనించిన స్నేహలత తన మనసులో ఒక గట్టి నిర్ణయం తీసుకుందనీ తెలిపాడు. ఆజాద్ ప్రకారం ఆమె తనను తాను ఈ విధంగా ప్రశ్నించుకుంది: నాకోసం తల్లిదండ్రులు యిలాంటి నిర్ణయం తీసుకుంటుంటే వాళ్ళను కష్టాల నుండి కాపాడడానికి నేనేమీ చేయలేనా? ఆమె ముందు ఒక నిండు జీవితం, జీవితానికి సంబంధించిన రంగుల స్వప్నం ఉండినాయి. కానీ ఆమె వాటికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంది. సున్నిత మనస్కురాలైన ఒక స్త్రీ తీసుకునే నిర్ణయాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడే అలలుకానీ, అత్యంత ఎత్తైన కొండలు కానీ, భూకంపాలు కానీ, శక్తిమంతమైన రాజు సైన్యాలు కానీ మార్చలేవనీ, స్త్రీ హృదయం గుప్తమైన మాయ అనీ, దాని ఆంతర్యాన్ని గ్రహించడం ఎవరికీ సాధ్యం కాదనీ ఖచ్చితంగా చెప్పాడు మౌలానా ఆజాద్.

ఒకరోజు ఉదయం స్నేహలత కాలి బూడిదై పోయిందనీ, ఆ బూడిద మనిషి స్వార్థం పట్ల నవ్వుతున్నట్లుండినదనీ వ్యంగ్యంగా అన్నాడు. ఆమె మంచంపై ఒక ఉత్తరం వుండిందనీ, అందులోని ప్రతి పదం కన్నీటి వరద ప్రవహింపజేసేలా ఉందనీ దీనంగా అంటూ స్నేహలత తన తండ్రికి రాసిన ఉత్తరాన్ని ప్రచురించాడు. అది ఈ క్రింది విధంగా వుంది:

"ప్రియమైన నాన్నా! నాకు సౌఖ్యవంతమైన జీవితాన్నివ్వడం కోసం మీరు జీవితాంతం కష్టాల పరంపరకు గురికావడం నాకెంతమాత్రమూ యిష్టం లేదు. మీరు నన్ను ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. నాకోసం మీరు బలికావడం నాకిష్టం లేదు. నేనే కాలిబూడిదైపోవడం మేలు. వేల కుటుంబాలను నాశనం చేస్తున్న ఈ వరకట్నమనే దురాచారానికి వ్యతిరేకంగా నన్ను నేను బలిచ్చుకుంటున్నాను. కాలిపోయే నా శరీరం నుండి ఉవ్వెత్తున ఎగిసిపడే ఈ అగ్నిగోళం మొత్తం భారతదేశంలో వ్యాపించి పేద బాలికలకు భర్తలు లభించకుండా చేస్తున్న ఈ వకరట్న దురాచారాన్ని కాల్చి బూడిద చేస్తుంది" స్నేహలతా ముఖోపాధ్యాయను మౌలానా ఆజాద్ "షహీద్"గానూ, "ఉలుల్-అజమ్" ("గొప్ప సంకల్పశక్తి వున్న వ్యక్తి")గానూ, వరకట్నానికి వ్యతిరేకంగా ఆమె చేసిన బలిదానాన్ని దైవమార్గంలో చేసిన "జిహాద్" ("జిహాదె-ఫి-సబీలిల్లాహ్") గానూ వర్ణించారు.

స్నేహలత ఊహించిన విధంగానే మండుతున్న ఆమె శరీరం నుండి ఎగిసిపడ్డ అగ్నిగోళం యావద్భారత దేశాన్ని దహించి వేసింది. స్నేహలత వరకట్న హత్య బెంగాల్‌లో ఎలాంటి ప్రకంపనల్ని సృష్టించిందో యింతకు ముందే తెలుసుకున్నాం. ఆమె మరణం తెలుగు ప్రాంతంలోని మేధావుల హృదయాలను కూడా తీవ్రంగా కదిలించి కరిగించింది. భావకవుల్లో ప్రఖ్యాతి వహించిన రాయప్రోలు సుబ్బారావు "స్నేహలత" శీర్షికతో స్నేహలతా ముఖోపాధ్యాయపై 1914లో ఒక కావ్యాన్ని రాశారు. ఇది అనేక పునర్ముద్రణలు పొందిందంటే ఎంతగా ప్రజాదరణకు నోచుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందులో ఆయన పొందుపరచిన స్నేహలత తన తండ్రికి రాసిన ఉత్తరం అత్యంత హృదయవిదారకంగా

## ప్రేమ సమాధులపై మాత్రం పూలు వాడిపోలేదు



అగ్ని భాషిస్తుంది.
నీరు ధ్వనిస్తుంది.
ఆకాశం మౌనంగా ఉంది.
ద్వేషం ప్రకోపిస్తుంది.
ప్రేమ సమాధులపై మాత్రం
పూలు వాడలేదు.
ఆ బౌద్ధారామాన్ని తవ్వితీశారు.
అది చెక్కు చెదరలేదు.
దానిమీద శివలింగాలు ఒరిగిపోయాయి.
పంచారామాల్లోనే కాదు,
ఆఫ్ఘనిస్తాన్ నడిబొడ్డున బౌద్ధ ఆరామాలు.
కాశ్మీర్లో బౌద్ధం పరిమళించింది.
గుజరాత్‌లో తథాగతం గమిస్తుంది.

చరిత్ర పునరుజ్జీవనం.
త్రిచరణాలను ధ్వంసించిన
త్రినేత్రులు, త్రిలోకాలు
అన్నీ కల్పనలే.
త్రిచరణాలే ప్రపంచ పునర్నిర్మాణ సూత్రాలు.
ఆ అక్షరాలు మౌఖికంగా పలికినవే.
అనంత భాషల్లో అవి ధ్వనించాయి.
కోట్ల గొంతుల్లో పలుకుతున్నాయి.
అవి బౌద్ధ జీవన సౌరభాలు.
బౌద్ధ తాత్త్విక జీవిత సత్యాలు.
సత్యాన్ని పలకండి.
మనిషిని ప్రేమించండి.
ధర్మంగా బతకండి.
మూడే వాక్యాలు.
అనంత అబద్ధ సాక్ష్యాలను
మూడు మాటలు జయించాయి.
ప్రేమలో సృజన ఉంది.
ద్వేషంలో ధ్వంసం ఉంది.
కక్ష, కార్పణ్యాలు
మానవాభ్యుదయానికి
గొడ్డలి వేటు.
నీతి శిఖరం కూలదు సుమా !
ఎందరో రాజులు వచ్చారూ పోయారు.
రాజ్యం అశాశ్వతం.
భట్టిప్రోలులో ఉన్న ఆరామాలు

శ్రమజీవుల జీవన సౌందర్యం.
శ్రమ ఓ ఔన్నత్యం.
శ్రమ ఓ శిల్పం.
శ్రమ ఓ ఉత్పత్తి.
శ్రమ ఓ జీవనగానం.
శ్రమ ఓ ఊపిరి.
శ్రమ పునాదుల నుండే
బౌద్ధం పుట్టింది.
ఆయుధాలకు బదులు
ఔషధాలు తయారు చేయండి.
గర్భవతులకు పుష్టినిచ్చే ఆహారం లేదు!
రక్తలేమి భారతంగా దృశ్యీకృతమౌతుంది.
ఆహారం కూడా ఓ ఔషధం.
ఆకలి ఓ దుర్భర సత్యం.
ఆకలి ఓ ఆరని మంట.
ఆకలి ఓ సముద్ర గానం.

...

త్రిచరణాలు
మళ్లీ ఆచరణబద్ధం కావాలి.
అప్పుడే భారతదేశానికి
సామాజిక సాంస్కృతిక
రాజకీయ విముక్తి.

డా. కత్తి పద్మారావు 25-10-2021,
9948748812/9849741695.

ఉంది. వెంకట కాళిదాస కవి అనే ఆయన "స్నేహలతా దేవి" శీర్షికతో 1930-31 నాటి 'సమదర్శిని' (డాక్టర్ టి. యం. నాయర్ స్మృతి సంచిక)లో స్నేహలతపై పద్యాలు ప్రచురించాడు. అంటే స్నేహలత 1914లో చనిపోయినా ఆమె స్మృతి 1930ల్లోనూ, ఆ తర్వాతా వెంటాడింది. 1921లో ప్రచురితమైన కాళ్ళకూరి నారాయణరావు నాటకం "వర విక్రయం " పై స్నేహలత వరకట్న హత్య ప్రభావం తప్పకుండా వుండి ఉంటుంది. స్నేహలతలాగే మరణించిన కొంతమంది బాలికలకు సంబంధించిన వార్తలను జూన్ 1914 నాటి "ఆంధ్ర పత్రిక" ప్రచురించింది ("ఒక బెంగాలీ కన్య ఆత్మహత్య", "వరశుల్క దురాచారము").

స్నేహలత అనుసరించిన మార్గాన్ని ఇవాళ మనం ఆమోదించక పోవచ్చు. కానీ ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో వరకట్నానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమౌతున్న తొలిదశలో స్నేహలత లాంటివాళ్ళు ఆత్మహత్యను కూడా ఒక పోరాట రూపంగానే చూశారని నాటి పరిస్థితుల్ని దగ్గరగా గమనిస్తే మనకర్థమవుతుంది. ఇరవయ్యవ శతాబ్ది ప్రథమార్థంలో తీవ్ర సంచలనం కలిగించిన స్నేహలతా ముఖోపాధ్యాయ వరకట్న హత్య ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక గొప్ప విషాదం. ఇలాంటి విషాదాలు 1980-90 దశకాల్లో తీవ్రరూపం దాల్చి వంటిళ్లల్లోని గ్యాస్ స్టౌలు "అకస్మాత్తుగా" పేలడం, కోడళ్ళు మంటల్లోపడి చనిపోవడం మనం ఎరిగిందే. ప్రస్తుతం వరకట్న దురాచారం వికృతరూపం దాల్చి వుంది. దీనికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేయాల్సిన బాధ్యతా, ఉద్యమించాల్సిన ఆవశ్యకతా సమాజ ప్రేమికులందరిపై, దేశభక్తులందరిపై వుంది. వరకట్నానికి వ్యతిరేకంగా పోరాడడం కూడా మౌలానా ఆజాద్ కు నివాళి అర్పించడంలో భాగమే!

***-నవంబరు 11 మౌలానా ఆజాద్ జయంతి సందర్భంగా***

ఈ వ్యాసరచనలో మాకుసహకరించిన మొహమ్మద్‌ముస్తఫా అలీ, మొహమ్మద్ ఇమ్రాన్, మొహమ్మద్ ఆసిమ్ గార్లకు మప్పిదాలు.

డాక్టర్ షేఖ్ మహబూబ్ బాషా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ 9160579705
డాక్టర్ మొహమ్మద్ కరీం రిసర్చ్ అసిస్టెంట్, ఐ.క్యూ.ఏ.సీ., 9440445098
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హైదరాబాద్

సునీల్ బోయిన
90001 48273

# జానపద వృత్తిపురాణాలు-పటం కథలు : ఒక పరిశీలన

జానపద కళారూపాల్లో పటం కథలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. పటం కథలు కేవలం తెలంగాణా ప్రాంతంలోనే కనిపిస్తాయి. ఈ కళాకారులు కథాగానం చేసే కథాంశానికి సంబంధించిన బొమ్మలను ఒక నూలుగుడ్డపై నకాషీ చిత్ర కళాకారులతో వేయించు కొంటారు. దీన్నే పటం అంటారు. ఈ పటం కళారూపాలను ప్రదర్శించే కళాకారులు వేరు వేరు కులాల వారు అయినప్పటికీ వారందరినీ 'పటం వాళ్లు' అని 'పటమోళ్లు' అని పిలుస్తారు. వీరికి అతి పురాతనమైన చరిత్ర ఉంది.

వైదిక వాఙ్మయంలోనే యమపటాల ప్రస్తావన కనిపిస్తుంది. ఆనాడు యమపటాల ద్వారా వైదిక సంస్కృతికి సంబంధించిన ప్రచారం జరిగింది. బౌద్ధమతం తన ధర్మ ప్రబోధనాలకు, జాతక కథల ప్రచారానికి 'పటం' కథలను ఉపయోగించుకుంది. అదే విధంగా జైనమతం కూడా పటాల ద్వారా మత ప్రచారాన్ని చేసుకుంది. బౌద్ధ, జైన మతాల ప్రజల భాషల్లోనే తమ మతాలను ప్రచారం చేసినందువల్ల సామాన్య పామర జనులను పటం కథలు ఆకట్టుకొని ఉండవచ్చు. ఆ మతాలు క్షీణించిన తరువాత పామరులు తమ కులపురాణాల ప్రచారానికి పటం కథలను స్వీకరించి ఉండవచ్చు. పటం కథలు భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రచారంలో ఉన్నాయని, అంతేగాకుండా వివిధ దేశాల్లో కూడా పటం కథలు ప్రచారంలో ఉన్నాయని పరిశోధనల ద్వారా తెలుస్తున్నది.

పటం ఆధారంగా ప్రదర్శించే కళారూపాలు పదకొండు ఉన్నాయి. అవి: 1. కూనపులి పటం కథ, 2. గౌడ శెట్టి పటం కథ. 3. ఏనూటి పటం కథ , 4. మాసయ్య పటం కథ, 5. అద్దపు పటం కథ, 6. డొక్కల పటం కథ, 7. తెరచీరల పటం కథ, 8. పెక్కర్ల పటం కథ, 9. తోటి పటం కథ, 10. కాకిపడిగెల పటం కథ, 11. గుర్రపు పటం కథ. ఈ పటం కళాకారులు ఆయా కుల పురాణాలను తరతరాలుగా కథాగానం చేస్తూ జీవిస్తున్నారు.

ఈ కళారూపాల కళాకారులు కథాగానం చేసేటప్పుడు ప్రదర్శనలో ఒకరు హావభావాలను ప్రకటిస్తూ ప్రేక్షకులకు విజ్ఞానాన్ని, కథపట్ల ఆసక్తిని కలిగిస్తూ ప్రదర్శిస్తారు. ప్రదర్శనలో ఒకరు ప్రధాన కథకునిగా వ్యవహరిస్తాడు. అతనికి వంతగా ఇద్దరు కళాకారులు ఉంటారు. మరో ఇద్దరు తబల, హార్మోనియం, వాయిస్తూ ప్రధాన కథకునికి సహకరిస్తారు. పటం మీద కథాంశానికి సంబంధించిన చిత్రాలు సంఘటనలు చిత్రించి ఉంటాయి. కాబట్టి ప్రధాన కథకుడు చిత్రాలను ప్రేక్షకులకు చూపిస్తూ సందర్భానుగుణంగా ఆయా రసాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకుడిని రంజింప చేస్తాడు. పటం కథల సాహిత్యంలో సమాజంలోని కులాలు, వృత్తుల ఆవిర్భావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వీటి వెనుక సాంస్కృతిక నేపథ్యం ఉన్నట్లు తెలుస్తుంది. ఒక్కొక్క పటం కథలోని సాహిత్యాన్ని పరిశీలించినట్లైతే విశదమవుతుంది.

**కూనపులిపటం కథ :** ముందుగా కూనపులి పటం కథను



పరిశీలించినట్లైతే వీరు పద్మశాలీలకు ఆశ్రితకులం. మార్కండేయ పురాణాన్ని పటం ద్వారా కథాగానం చేస్తారు. కథ పద్మశాలీల ఆవశ్యకతను, కుల నిర్మాణ సరళిని వివరిస్తుంది.

కూనపులివారు చెప్పే కథాగానంలో సురాముప్పది మూడుకోట్ల దేవతలు, మునులు, మనుషులు వస్త్రాలు లేని తమ దుస్థితికి సిగ్గుపడుతూ ఉంటారు. దీనికి తోడు రాక్షసులు వీరందరినీ హేళన చేస్తూ ముప్పతిప్పలు పెడుతూ ఆనందిస్తూ ఉంటారు. ఇదంతా తట్టుకోలేని దేవతలు, మునులు, మనుషులు మొదట శివుడిని దర్శించి తమ కష్టాన్ని విన్నవించుకొంటారు. అందుకు శివుడు వారందరినీ శ్రీమహావిష్ణువు దగ్గరకి తీసుకుపోయి ఇందుకు పరిష్కారం చూపించమని వేడుకుంటారు. అప్పుడు విష్ణువు నిత్య బ్రహ్మచారియైన మార్కండేయునికి వివాహం జరిపించి పుత్రకామేష్ఠి యాగం చేయించాడని, తన అంశతో యజ్ఞం నుంచి భావనారుషి జన్మిస్తాడని చెప్పి, అతడు తన పద్మం నుంచి తంతువులను గ్రహించి వస్త్రం నిర్మిస్తాడని, అతనే లోక కళ్యాణార్థం రాక్షస సంహారం చేస్తాడని చెపుతాడు. ఆ ప్రకారంగా భావనారుషి జన్మించి విష్ణువు పద్మం నుంచి తంతువులను గ్రహించి వస్త్రం నేయడంతో పద్మశాలీలు (అంటారు) అయ్యారు. అయితే ఈ కథలోనే పద్మశాలీలకు మూల పురుషుడైన భావనారుషి కాలువాసురుడు అనే రాక్షసుడితో యుద్ధం చేస్తున్న సమయంలో భావనారుషి శివుడిని యుద్ధంలో సహాయం చేయమని కోరగా, అతడిని రక్షించే నిమిత్తం భావనారుషి చెమట నుండి కూనపులి వారి జననం ఏర్పడుతుంది. కూనపులి వారు భావనారుషిని ఆ యుద్ధంలో రక్షిస్తాడు. అప్పుడే సురాముప్పది మూడుకోట్ల దేవతుల పద్మశాలీలకు, కూనపులివారికి ఒప్పందం కుదురుస్తారు. కూనపులివారు పద్మశాలీలకు ఇంటికి పెద్దకొడుకుని ఆడబిడ్డతో సమానమని, వీరు కడుపు చూసి అన్నం పెట్టాలని, వీపు చూసి బట్టలివ్వాలని చెపుతారు. అప్పటి నుంచీ కూనపులివారు పద్మశాలీలకు మార్కండేయ పురాణం చెపుతూ జీవిస్తున్నారు. అంతేకాకుండా వీరు చెప్పే కథలో కూనపులి వారిని ఆశ్రయించే

గౌడుగు బట్లు లేదా గరుబట్లు కులం ఆవిర్భావానికి సంబంధించిన కథ కనిపించడం విశేషంగా చెప్పుకోవచ్చు. గురుబట్లు అనే కులం వారు కూనపులి వారిని కీర్తిస్తూ కథాగానం చేయడం ప్రధాన వృత్తి.

**గౌడశెట్టి పటం కథ, ఏనూటి పటం కథ:** ఈ రెండు పటం కథలు చెప్పే కథాంశం ఒక్కటే. ఇద్దరూ గౌడపులి కులాన్ని ఆశ్రయిస్తూ గౌడ పురాణం చెపుతారు. వీరు చెప్పే కథలో బహ్మ చెమట నుంచి కౌండన్యుడు జన్మిస్తాడు. ఇతని పుట్టుకతోనే ఈత, తాటి, ఇప్ప చెట్లు పుడతాయి. దేవతలు కౌండన్యుడితో నీతోపాటు పుట్టిన చెట్ల నుంచీ సురాపానీయం తీస్తూ, జీవించమని చెపుతారు. అతనే గౌడకులానికి మూల పురుషుడయ్యాడు. శివుడు ఇతనికి నలుగురు కొడుకులను, ఒక కూతుర్ని ప్రసాదిస్తాడు. అన్నదమ్ములు కొంత కాలం కలసి ఉండి ఆ తరువాత విడిపోతారు. అన్నదమ్ముల్లో ఇద్దరు తమకిచ్చిన ధనాన్ని ఖర్చు చేసుకొని, ఏమి చేయాలో తోచక నిష్టగా ఉండి ప్రతిదినం శివుడిని పూజించే పుంగమాగౌడ్ దగ్గరకి వచ్చి పని చూపించమని వేడుకుంటారు. అప్పుడు వారిద్దరినీ గౌడులకు గౌడపురాణం చెప్తూ వారికి ఆశ్రితులుగా ఉండమని చెబుతాడు. ఇందులో ఒకరు గౌడజెట్టి మరొకరు ఏనూటి. ఈ విధంగా మూడు కులాల ఆవిర్భావం కనిపిస్తుంది.

**మాసయ్య పటం కథ:** వీరు చాకలి వారికి మడివేలయ్య పురాణం కథాగానం చేస్తారు. వీరు చెప్పే కథలో దక్షప్రజాపతి చేసే యజ్ఞానికి శివపార్వతులను ఆహ్వానించడు. అయినా పార్వతి వెళ్లగా అవమానించడంతో ఆ యజ్ఞంలోనే పార్వతీదేవి ఆహుతి అవుతుంది. ఇది తట్టుకోలేని శివుడు వీరభద్రున్ని పుట్టించి దక్షుణ్ణి సంహరించ మంటాడు. ఆ ప్రకారం వీరభద్రుడు అతన్ని సంహరించి త్రిమూర్తుల వద్దకు వెళతాడు. త్రిమూర్తులు అతనితో నువ్వు పాపం చేశావని పాపపరిహారం కోసం పాలగుండంలో దూకి మడివేలయ్యగా అవతారమెత్తమంటారు. ఆ విధంగా పాలగుండంలో దూకగా మడివేలయ్య, మాసయ్య ఇద్దరు పుడతారు. మడివేలయ్య సురాముప్పది మూడు కోట్ల మంది దేవతల వస్త్రాలను పాప పరిహారం కోసం పన్నెండు సంవత్సరాలు పిండుతాడు. ఇతనే చాకలి కులానికి మూల పురుషుడయ్యాడు. మడివేలయ్య బట్టలు ఉతుకుతుండగా, మాసయ్య శివుని పూజిస్తూ ఉంటాడు. ఒక రోజు మాసయ్య మడివేలయ్య భిక్షమెత్తుకొని తెచ్చుకున్న అన్నం తినటంతో కోపించిన మడివేలయ్య ఏడాదికోసారి ఆర్థివాడయ్య తన ఇంటికి వస్తే త్యాగమిస్తానంటాడు. అప్పటి నుంచి చాకలి వారికి మాసయ్యలు ఆశ్రితులయ్యారు. ఈ రకంగా రెండు కులాలు ప్రస్తావన కనిపిస్తుది.

**అద్దపు పటం కథ:** వీరు మంగలి కులానికి కథాగానం చేస్తారు. వీరు చెప్పే కథలో దేవతలకు పెళ్లిళ్లు చేసే సమయంలో గంధమాదమ పర్వతం వద్ద సుమంగళుడు తపస్సు చేస్తాడు. అతనితో తీపి వరభక్తుడు కావాలంటాడు. అందుకు సుమంగళుడు విభూతి గుండం ఏర్పాటు చేసి అందులో బ్రహ్మపాకశాస్త్రం, విష్ణునాభికమలం, శివుడు చిత్తకను వేయగా అగ్గిపుట్టి అంగారకుడు జన్మిస్తాడు. అతడు అగ్గి నుంచి పుట్టడంతో అంగారకుడు అని. దేవతలకు క్షౌరం చేయడంతో క్షౌరకుడనీ కళ్యాణానికి ముందు నడవడంతో కళ్యాణభక్తుడని, సమంగళుని కొడుకు అయినందువల్ల శుభ మంగళుడు అయ్యాడు. ఇతడే మంగళికులానికి మూల పురుషుడు. అంగారకునికి ధనపాలక, పరిపాలక, శివపాలక, అనే ముగ్గురు కొడుకులు పుడుతారు. ధనపాలకు, వైష్ణవ సాంప్రదాయంలో పెరిగినవాడు. శివపాలకుడు శైవ సాంప్రదాయంలో పెరిగినాడు. ఒక రోజున తండ్రి శివపాలకునితో ధనపాలకున్ని తీసుకురమ్మని కోరుతాడు. అయితే ఆవిధంగా వెళ్లినప్పుడు అన్న దగ్గర తమ్ముడు భోజనం చేస్తాడు. ఈ విషయం తెలిసిన అంగారకుడు అతనితో అన్న దగ్గర అన్నం తిన్నావా? అంటే తినలేదు అంటాడు. అప్పుడు అంగారకుడు అపశబ్దం మాట్లాడావు కాబట్టి అర్ధిమంగళి కావాలని అద్దపోళ్ళని పేరుపెట్టి మంగళిపురాణం కథాగానం చేసుకుంటూ అద్దపువారిగా జీవించమని పలుకుతాడు. ఈ రకంగా వీరు చేప్పే కథలో రెండు కులాల ప్రస్థానన కనిపిస్తుంది.

**పెక్కర్ల పటం కథ:** వీరు గుండ బ్రహ్మపురాణం లేదా శాలివాహన పురాణాన్ని కుమ్మరివారికి కథాగానం చేస్తారు పెక్కర్లు చెప్పె కథలో వీరి కులానికి మూల పురుషుడైన శాలివాహనుని వృత్తాంతం చెబుతారు. ఇతనే మంగళి కులానికి మూల పురుషుడు. పెక్కర్లు అంటే పెడ ఇంటివారే. పెక్కర్లు పెక్కింటి వారయ్యారని, మరో కథలో ఒక కుమ్మరి మట్టిని తెచ్చి రాశి పోసుకుంటాడు. మరో కుమ్మరి దాన్ని దొంగిలిస్తారు. అతన్ని కులం వాళ్ళు పట్టుకొని, కులం నుంచి వెలివేస్తారు. ఆ విధంగా వెలివేయబడినవాడు నాకు భృతి చూపించమని వేడుకోగా గుండ బ్రహ్మపురాణం చెప్పుకుంటూ జీవించమని చెబుతాడు. ఈ విధంగా వీరి కథలో కూడా రెండు కులాల ప్రస్తావన కనిపిస్తుంది.

**తెర చీరల పట్టం కథ :** వీరు గోల్ల కులానికి ఆశ్రితులు. గంగమ్మ పండుగ చేసే సందర్భంలో, గంగమ్మ కథాంశానికి సంబంధించిన కథ చెబుతారు. ఇందులో కులాల ప్రస్తావన లేకపోయినప్పటికి గొల్లవారికి ఆశ్రితులు కావడంతో రెండు కులాల ఆవిర్భావానికి సంబంధించిన ప్రస్తావన కనిపించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**గుర్రపు పటం కథ :** వీరు మాలకులానికి భేతాళ పురాణం చెబుతారు. కథలో మాలల ప్రస్తావన ప్రధానంగా చెప్పి ఆ తర్వాత గుర్రపు వాళ్ళ ప్రస్తావన కనిపిస్తుంది. మాల కులంలో ఇద్దరు అన్నదమ్ములు ఉంటారు. తమ్ముడికి పెళ్లి చేసే సందర్భంలో ఊరేగింపుకోసం మాల కులం వాళ్ళ అన్న ఐన మల్లన్నను గుర్రం కోసం పంపుతారు. అతను ఆలస్యంగా గుర్రాన్ని తెచ్చేలోపల తమ్ముడి పెళ్ళి ఐపోతుంది. కోపగించిన ఆ కులంవాళ్ళు నువ్వు గుర్రం మల్లయ్యగానే ఉండమని కులం నుంచి పంపిస్తారు. అతనే గుర్రపు మల్లయ్యగా పేరు పొంది మాలవాళ్ళకు భేతాల పురాణం చెప్పుకుంటూ జీవిస్తాడు.

**తోటి పటం కథ :** వీరు పద్మ నాయకులు అనే గిరిజన తెగకు ఆశ్రితులు వీరు ప్రధానంగా పద్మనాయకుల వృత్తాంతం చెబుతారు.

**పాఠశాల విద్యలో అమ్మనుడినే బోధనా మాధ్యమంగా ఉంచాలి**




## వుండాల్సిన మనిషి

**240** పుటల అందమైన, విలువైన, ముచ్చటైన పెద్ద పుస్తకంలో 150 మంది పెద్దలు, రచయితలు, కవులు, సమాజ సేవానిరతులు, ఉద్యమకారులు, నేతలు, ఒక ప్రత్యేకమైన విశిష్ట వ్యక్తి గురించి వ్రాసిన జ్ఞాపకాలు, అభిప్రాయాలు, అభినందనలు...! ఆ గ్రంథం పేరు 'వుండాల్సిన మనిషి.... సాకం నాగరాజ'. ఆ పొత్తాన్ని చేత్తో పట్టుకొని పేజీలు తిప్పుతుంటే నాకు తెలియకుండానే ఒక గంట గడిచిపోయింది. ఒక ఫోన్‌కాల్ రావడంతో యీ లోకంలోకి వచ్చిచూస్తే ఇంకా సగం పుస్తకం మిగిలే ఉంది. మళ్లీ ఆ రాత్రికి పుస్తకాన్ని పూర్తిగా చూడడానికి, సారాన్ని కొంత వరకైనా బుర్రకెక్కించుకోవడానికి మరో గంటన్నర పట్టింది. సాకం నాగరాజ గారి గురించి నా జ్ఞాపకాల్ని అన్నింటినీ పొందుపరచగల రచనాపాటవం నాకు లేదు. అయితే ఆయనతో కలిసి తెలుగు భాషోద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభూతులు నా గుండెల్లో చిరస్మరణీయాలు. తిరుపతిలో 'తెలుగు భాషోద్యమ సమితి' పేరుతో ఆయన నిర్వహించిన కార్యక్రమాలు ఎన్నో. పిల్లలకూ, పెద్దలకూ పనికొచ్చే ఎన్నో. పుస్తకాల్ని కూడా ఆ సంస్థ తరఫున ప్రచురించారు. సేవాదక్షుడు, నిత్యచైతన్య స్ఫూర్తి సాకం నాగరాజ గారి నుండి నుండి ప్రజా ఉద్యమకారులూ రచయితలూ ఉపాధ్యాయులూ నేర్చుకోదగిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఈ పుస్తకం ధర అమూల్యం. పుస్తకాన్ని అందుకోగలిగిన అదృష్టవంతులు నాగరాజ గారిని సమగ్రంగా అర్థంచేసుకోగల సాధనాన్ని పొందినట్లే.

– సామల రమేష్‌బాబు

వీరు చెప్పే కథలో పద్మనాయకుల పుట్టుక గురించి తెలియజేస్తూ తోటి కులం పుట్టుకను కథాగానం చేస్తారు. తోటివారిని కోర్రాజులు అని కూడా పిలుస్తారు.

**డక్కలి పటం కథ :** వీరు జాంబవ పురాణాన్ని పటం ద్వారా మాదిగ కులానికి కథాగానం చేస్తారు. వీరు చెప్పే కథలో మాదిగ కులానికి మూల పురుషుడైన జాంబవంతుని వృత్తాంతం వివరించి వృత్తి నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. డక్కలి వారి పుట్టుక కథలో జాంబవంతుని పెద్ద కొడుకు విశ్వబ్రహ్మకు అస్త్రాలు చేసిన కారణంగా అతని శరీరంలో డొక్క మిగిలింది. ఆ డొక్క నుంచి మాతంగపురి పట్నంలో పిల్లవాడు పుడతాడు. అతడే డక్కలివాడు అయ్యాడు. విశ్వకర్మ, జంగందేవి కలిసి డక్క వారికి మాదిగ మారు ఇంటికి రూపాయి ఇరుస బెత్తం ఇవ్వాలని, దానం ఇవ్వకపోతే పది గోవులు చంపిన పాపం తగులుతుందని చెబుతారు. అప్పటి నుంచి డక్కలి వారు జాంబపురాణాన్ని కథాగానం చేస్తూ జీవిస్తున్నారు.

**కాకి పడిగెల పటం కథ:** వీరు పటం ఆధారంగా పాండవుల కథ చెబుతారు. వీరు ముదిరాజుల ఆశ్రితులు ముదిరాజుల తోటలకు కాపరులుగా ఉంటారు. కాకి పడిగెల వారు చెప్పే కథలో ముదిరాజుల వృత్తిని తెలియజేస్తుంది. కాకి పడిగెల పుట్టికకు సంబంధించిన కథలో ముదిరాజుల కులంలో ఐదుగురు అన్నదమ్ములు కలిసి పెండోట వనం వేసి ఆ వనానికి కాపాలా ఉంటారు. ఒక రోజున అవుసలి బ్రహ్మ పండ్ల కోసం ఆ వనానికి వచ్చి వారిని అడుగుతాడు. ఇక వాళ్ళు పండ్లు అతనికి పెట్టకుండా పంపిస్తారు. కోపంతో వెళ్ళిన అవుసలి ఒక బంగారు కాకిని చేసి పెండోట వనంలోని పండ్లని నాశనం చేయమని పంపుతాడు. ఆ కాకి వనాన్ని నాశనం చేస్తుండగా కోపంతో చిన్నవాడు దాన్ని సంహరిస్తాడు. దాన్ని తీసుకొని తల్లి దగ్గరకి వెళ్ళగా అప్పుడు తల్లి సూర్యున్ని చూసి సుక్క బొట్టు పెట్టమని, చంద్రున్ని చూసి చంద్రమక పెట్టమని, వరాహం ఎదురస్తే ఏడు నాతుల్లో స్నానం చేస్తామని చెప్పి, అతను కాకిని చంపి తీసుకొచ్చినందుకు, అతను, కాకి పడిగెలవాడివై పక్కకు ఉంటాడని శపిస్తుంది. అతను తనకు భృతి ఏది అని అడిగితే ముదిరాజులకు పాండవులు అంటే ఇష్టం కాబట్టి పాండవుల కథలు చెప్పుకుంటూ ముదిరాజులను ఆశ్రయించమని చెబుతుంది. ఈ రకంగా ఈ కులం పుట్టుక ఏర్పడుతుంది.

జానపద పటం సాహిత్యంలో సమాజంలోని కులాల ఆవిర్భావం, వాటి జీవనోపాధికి సంబంధించిన సాంఘిక ఆర్థిక జీవన విధానం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పటం కథలు ఆయా కులాల పుట్టుక దేవకార్యం నిమిత్తం ఏర్పడినట్లు, ఆ తరువాత కొంతకాలానికి ప్రధాన కులంలోని మూల పురుషునికి జన్మించినవాడు కానీ లేదా ప్రధాన కులంలోని అన్నదమ్ములు కొన్ని కారణాల వల్ల విడిపోయి ఆ కులానికే ఆశ్రిత కులంగా ఏర్పడడం వంటి సన్నివేశాలు కనిపించడం గమనించవచ్చు. ఈ రకంగా **సమాజంలో ఆశ్రిత కులానికి కూడా ఒక గౌరవ ప్రదమైన స్థానాన్ని పటం కథలు ఏర్పరిచాయి. అట్లాగే కులాల మధ్య న్యూనత భావాన్ని పోగొట్టడానికి పటం కథల సాహిత్యం దోహదపడుతుందని చెప్పవచ్చు. అంటే సమాజంలో ఒక కులం కంటె మరొక కులం గొప్పదనే భావన రాకుండా ఉండేందుకు ప్రతీకులానికి సంబంధించిన మూలపురుషుడు దేవుని అంశంతో జన్మించినవాడు కావడం పటం కథల సాహిత్యంలో ప్రధానంగా కనిపించడం, అంతేగాకుండా ఒక కులం మరొక కులాన్ని పోషించడానికి దైవం నిర్ణయించినట్లుగా, గౌరవంగా, హక్కుగా భావించే విధంగా పటం కథల సాహిత్యం ఉందని చెప్పవచ్చు.** ఇలాంటి పటం కథల సాహిత్యాన్ని సంస్కృతిలో, సమాజంలో కనుమరుగు కాకుండా ఉండేందుకు దానికి బహుళ ప్రాచుర్యాన్ని కల్పించి వాటి సాహిత్యసంపదను పరిరక్షించుకోవలసిన అవసరం ఉంది.

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-12

# నా తిరుపతి - పెదమల్లెల యాత్ర

తిరుపతిలోని కపిలతీర్థం- అలిపిరిరోడ్డులో బసచేసిన నేను, ఉదయాన్నే నడక మొదలు పెట్టాను. కపిలతీర్థం నుంచి- కె.టీ. రోడ్డు మార్గంలో ఖాదీ కాలనీ దాకావెళ్లాను. నేను 1973-77 మధ్య తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ వాస్తు, శిల్ప కళాశాలలో చదివిన రోజులు గుర్తుకొచ్చాయి. ఆ రోజుల్లో మా ఉపాధ్యాయుడు శ్రీ తిరువీధుల రామమూర్తి గారు నన్ను బాగా చేరదీసి ఆదరించారు. ఆయన ఒక్కోసారి ఒక్కో ఆలయానికి తీసుకెళ్లి, నిర్మాణ విశేషాలను తెలియజేసేవాడు. ఒకసారి ఖాదీ కాలనీకి సమీపంలో గల ఒక గోపురం, ప్రాకారంతో గల ఒక ఆలయాన్ని చూపించారు. ఆ గుడి గుర్తుకొచ్చి, కలియ చూశాను. కనిపించలేదు. గుడినీ, గుళ్లో లింగాన్నీ మాయం చేస్తారనే వ్యంగ్య సామెత గుర్తొచ్చింది. ఇక్కడుండే ఆలయం ఏమైందా అని ఆలోచిస్తూ, స్థానిక అంగళ్లలో విచారించగా తెలియదన్నారు. అప్పుడు వెంటనే, మిత్రులు బి.వి. రమణ గారికి ఫోను చేశాను. ఆయనెందుకనో ఫోను తీయలేదు. ఆయన్నే ఎందుకడిగానంటే తిరుపతి, తిరుమల చుట్టుప్రక్కలా తిరిగి, కాళ్లరిగి, కలంపట్టి, 'తిరుపతి అందచందాలు' అన్న పుస్తకంలో వాటన్నింటినీ ఆసక్తికరంగా వివరించారు గాబట్టి. ఆయన బహుశా ఎక్కడో ఎస్వీ భక్తి ఛానల్ పనిమీద వెళ్ళిఉంటాడనుకుంటాను.

'శ్రీనివాసమంగాపురం మరియూ మన ఆలయాలు' అన్న పేరిట తిరుమల తిరుపతి, ఇతర ఆలయాలపై చక్కటి కథనంతో పుస్తకాన్ని రాసిన శ్రీగోపీకృష్ణగారు మదిలో మెదిలారు. పక్కనే టీ అంగట్లో టీ తాగుతూ, ఆయనకు ఫోన్‌చేసి, ఖాదీకాలనీ దగ్గర గుడి ఏమైందని అడిగాను. ఆయన నన్ను ఆప్యాయంగా పలకరించి అదొక పెద్ద కథ అని చెప్పటం మొదలుపెట్టారు.

తిరుపతికి ఉత్తరదిక్కులో గల ఆ ఆలయం అచ్యుతపెరుమాళ్‌దనీ, గోవిందరాజదేవాలయంలోని (సంఖ్య జి.టీ.140) క్రీ.శ. 1536, తిరుమల ఆలయంలోని (సంఖ్య-317) క్రీ.శ. 1538 నాటి అచ్యుతరాయల శాసనాల ద్వారా తెలుస్తుందనీ, ఇతర వివరాలను అందించారు. మొదటి శాసనంలో, చంద్రగిరి పొలిమేరలో గల కృష్ణరాయ పట్టణానికి చెందిన సాదయపల్లి తిప్పుశెట్టి కుమారుడైన నామిశెట్టి అనే నగరత్తారు 31-1-1537న 2805 నర్పణాలను శ్రీవారి భండారానికి సమర్పించి, ఒక కైక్కోలర్ (నేతపనివారు) నుంచి కొని ఏర్పాటుచేసిన నివేశన స్థలంలో తాను నిర్మించిన పారువేట మండపంలో గోవిందరాజస్వామికి పారువేట ఉత్సవ సందర్భంగా, ఈ అచ్యుతపెరుమాళ్లుకు నైవేద్యాలు సమర్పించే ఏర్పాటు చేశాడు. తాను కొన్న నేలను కొలవటానికి 16 జానల కొలబద్దను తొలగించి, 36 అడుగుల కొలబద్దను ఉపయోగించాడు. ఇక రెండో శాసనంలో, అచ్యుతరాయన్, అచ్యుతపెరుమాళ్ అచ్యుతరాయపురాల ప్రస్తావన ఉంది. అందుచేత, విజయనగర చక్రవర్తి అచ్యుతదేవరాయలు, తనపేర అచ్యుతరాయపురాన్ని నిర్మించి, అందులో అచ్యుతరాయపెరుమాళ్ళకు ఒక ఆలయం కట్టించి, అచ్యుతరాయ పెరుమాళ్ళను ప్రతిష్ఠించినట్లు చెప్పుకోవచ్చని గోపీకృష్ణగారు చెప్పారు.

గోవిందరాజస్వామి దేవాలయంలోని క్రీ.శ.1536 నాటి శాసనం (జి.టి.355) లో శ్రీవెంకటేశ్వరుని తిరువడైయాట్టు (ఉత్సవ, పూజాదికాలకై సమర్పింపబడిన) గ్రామం అయిన కొట్టూరులో శ్రీభండారానికి 2400 నర్పణాలను చెల్లించి, కొనుక్కొని, ఆభూమిలో అచ్యుతపెరుమాళ్ళుకు ఆలయాన్ని నిర్మించాడని చెప్పబడింది. ఆ దేవాలయం చుట్టూ 120 ఇళ్ళను నిర్మించి, బ్రాహ్మణులకిచ్చి అగ్రహారంగా ప్రకటించి, దానికి, తనపేర అచ్యుతరాయపురమని పేరుపెట్టాడు.

చరిత్రసరే. మరి ఆలయం ఇప్పుడక్కడ లేదు. ఎక్కడికెళ్ళిందని అడిగాను. గోపీకృష్ణగారు నవ్వారు. తిరుపతిలో కొత్తకొత్త కాలనీలొచ్చి, ఆలయాలు, వాటి చుట్టుప్రక్కల గల భూముల్ని గుట్టుచప్పుడు గాకుండా ఆక్రమించేస్తున్నారని, అది గమనించిన తి.తి.దేవస్థానం అధికారులు, ఆ ఆలయం శిథిలమై పోగా, గోపురాన్ని జాగ్రత్తగా ఊడదీసి, తిరుమల ఘాట్‌రోడ్డులోని మోకాళ్ల (చుక్కల) పర్వతంపైనగల అవ్వాచారికోనలో పునర్నిర్మించారని చెప్పారు. ఆయనే లేకపోతే ఖాదీ కాలనీలోని గుడిగురించిన నా ప్రశ్న శేషప్రశ్నగానే మిగిలిపోయేది. ఇంతలో పేటశ్రీ కనిపించారు. ఏమన్నా ఇక్కడున్నారు? అని అడిగారు. జరిగిందంతా చెప్పగా, ఆయన నాకు తిరుమల, తిరుపతి, తిరుమల-తిరుపతిలలో ఒకప్పుడు ఉండి, ఇప్పుడులేకుండాపోయిన అనేక అపురూప ఆలయాలగురించి పూసగుచ్చినట్లు చెప్పాడు. మళ్లీ హోటల్‌కు తిరిగొచ్చి, నాపాటికి నేను తయారైనాను.

మళ్లీ ప్రయాణం మొదలు. రమణగారు, తుడా వీసీ హరికృష్ణగారు, కలసి ముందుగా అనుమతి తీసుకొని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలోని విజయనగర కాలంనాటి విశాలమైన దిగుడుబావిని చూడటానికి వెళ్లాం. ఓ మహిళా లెక్చరర్‌గారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. కరోనా కాబట్టి కళాశాలకు శెలవు. అలికిడి లేదు. బావిని పైనుంచి చూశాం. బావి అనేకంటే కోనేరు అనొచ్చేమో! ఎంత అపురూపంగా ఉందో! భూమికి దాదాపు 30 అడుగుల లోతునుంచి, ముందుగా ఎనిమిది పలకల మెట్లు అయిదు వరుసలు,



మహిళా విశ్వవిద్యాలయంలో దిగుడుబావి

ఆతరువాత, నలువైపులా మెట్లకు ఎదురుగా ఆలయాలు, కోనేరు లోపలి అరుగులపైన స్థంభాలు, వాటిపైన పుష్పపోదికలు, ఎంత

ఆకర్షణీయంగా ఉన్నాయంటే, చూచి ఆనందించాల్సిందే! స్థంభాలపైనకప్పు, దానిపైన పిట్టగోడ, స్థంభాలపైనగల అనేక శిల్పాల్లో, స్థంభాన్ని చీల్చుకొని బయటికొచ్చే నరసింహస్వామి విగ్రహం యాబ్‌స్ట్రాక్టు ఆర్టుకు చక్కటి ఉదాహరణ. ఈ కోనేటి నీటిని, సమీపంలోఉన్న ఆలయ సముదాయ అవసరాలకు వినియోగించేవారు. మండపాలు, ఆలయాలు, స్థంభాలపైన శిల్పాల శైలినిబట్టి ఈకోనేరు క్రీ.శ.16వ శతాబ్దిలో నిర్మించారని చెప్పొచ్చు. ఈ కట్టడానికి మనం ఏంచెయొచ్చని అడిగారు హరికృష్ణగారు. కేవలం చరిత్ర, కట్టడ కౌశలాన్ని తెలిపే పేరుపలక, కట్టడహితమైన లైటింగ్ తప్ప ఇంకా ఏమీ చేయొద్దని చెప్పాను.

ఇంతకీ ఈకోనేరు, కోనేటికి ఉత్తరంగా ఉన్న ఆలయాలను ఎవరు నిర్మించారనే ప్రశ్న నన్ను వేధిస్తోంది. నాతోపాటే ఉన్న హరికృష్ణగారు, రమణగారితో కలిసి, కోనేరుకు ఎడమవైపునున్న శిథిలాలయాల్ని చూశాం. చుట్టుపక్కల శాసనాలు లేవు. ఒక్కకోనేటి మండపం తప్ప మిగతా ఆలయాలన్నీ ఇటీవలి వందేళ్లలోపు దేవాలయాలనిపిస్తున్నాయి. కోనేరు మాత్రం క్రీ.శ.16వ శతాబ్దిదే. మరి ఈ మూడు ఆలయాలు, ఒక వాహనాలయం, ఒక భవంతి, ఒక ఇటుకరాతి బావిని ఎవరు నిర్మించారోనని రమణ గారినడిగాను. ఇవి బహుశ మహంతులు నిర్మించారని చెప్పారు. మళ్లీ గోపీకృష్ణగారికి ఫోన్ చేశాను. ఆయన ఓపిగ్గా మరిన్ని వివరాలనిచ్చారు. తిరుమల ఆలయ పాలకులుగానున్న తిరుపతి మహంతులు బహుశా వందేళ్లకింద నిర్మించి ఉంటారని చెప్పారు. వారు పాత ఆలయాలను పునర్నిర్మించటమే కాక, కొత్త ఆలయాలనుకూడా నిర్మించారని, ప్రస్తుత మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఒక ఉద్యానాన్ని ఏర్పరచి, దశావతారాలకు విడివిడిగా ఆలయాలను నిర్మించటానికి పూనుకొని మూడు మాత్రమే పూర్తిచేశారన్నారు. నేను, హరికృష్ణగారు, రమణగారు అక్కడి శిథిలాలయాలదగ్గర కూర్చొని వీటిని గురించి చర్చించుకోగా తేలిందేమంటే మహంతులే వీటిని నిర్మించారని.


మహిళా విశ్వవిద్యాలయంలో మహంతుల దశావతారాల గుడి

ఒకసారి తిరుమల తిరుపతి చరిత్రను సమీక్షించుకొన్నాం. క్రీ.శ.1684 నాటి తిరుమల శాసనం (సంఖ్య టీటీ.263), అక్కడే ఉన్న క్రీ.శ.1849 నాటి మరో తిరుమల శాసనం(సంఖ్య టీ.టీ.350) మధ్య అంటే, 165 సం॥ ల చరిత్రకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. క్రీ.శ 1801లో తిరుమల తిరుపతి దేవాలయ నిర్వహణ బాధ్యతను, అప్పటికే ఆప్రాంతాన్ని తమ ఏలుబడిలోకి తెచ్చుకొన్న బ్రిటీషువారు హస్తగతం చేసుకొన్నారు. క్రీ.శ. 1843లో ఆలయాల నిర్వహణను ఉత్తర ఆర్కాట్‌జిల్లా కలెక్టర్‌ద్వారా, తిరుపతిలోని శ్రీహతీరాంజీ మఠాధిపతిఅయిన మహంత్ శ్రీసేవాదాస్‌జీకి అప్పగించారని నాకూ, హరికృష్ణగారికీ రమణగారు వివరించారు. అదే క్రమంలో, కొండమీది స్వామివారి పుష్కరిణిని 31-8-1849న పునర్నిర్మించారు. దాంతోపాటు, సేవాదాస్‌జీ మహంతు, తిరుమల వెంకటేశ్వరాలయానికి కొన్ని మరమ్మతులు చేయించారు. మహంతు సేవాదాసు క్రీ.శ.2.2.1865లో మరణించగా, ఆయన శిష్యుడు, వారసుడూ అయిన తిరుపతి మఠాధిపతి ధర్మదాస్‌జీ, సేవాదాస్ గారి భౌతికకాయంపైన బృందావనాన్ని నిర్మించి, గోవిందరాజస్వామి దేవాలయంలో ఒక శాసనాన్ని (జి.టి.నం.83) వేయించాడు. ఈ ధర్మదాస్‌జీ, కపిలతీర్ధ పుష్కరిణిని, చుట్టూ ఉన్న మండపాల పునర్నిర్మాణాన్ని, చేపట్టి 10.2.1865 నాటికి, తిరుమల పడికావలి గోపురాన్ని క్రీ.శ.11.9.1878 (టి.టి.శాసన సంఖ్య382) నాటికి పూర్తిచేశారని గోపీకృష్ణగారు వివరిస్తుంటే తిరుమల తిరుపతి దేవస్థానాల చరిత్రను మరింత లోతుగా తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఆ తరువాత, రమణగారు అందుకొని, ఆలయాల విచారణకర్త శ్రీ ప్రయాగదాస్‌జీ మహంత్‌గారు, వారి సోదరులు, శిష్యులూ అయిన శ్రీరామలక్ష్మణ్‌దాస్‌గారు, శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయ గర్భగృహం మీది విమానం- ఆనందనిలయంపైన క్రీ.శ.30.9.1908న బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడని చెప్పి, ఆలయనిర్మాణ, నిర్వహణలో కొత్తవిషయాలను వెల్లడించారు. తిరుపతి మహిళా విశ్వవిద్యాలయ హాస్టలు ప్రక్కనే రెండు ఆలయాలు, ఒక వాహన ఆలయం, ఒక విశ్రాంతి మందిరం, ఒక ఇటుకరాతి బావి చివరిద్దరు మహంతులు నిర్మించినవేనని తేలింది.

ఆలయాలు మాత్రం ముమ్మూర్తులా విజయనగర వాస్తుశిల్పానికి అనుకరణగా నిర్మించారు. కప్పు వరకూ రాయి, పైన ఇటుక, సున్నంతో విమానం. దశావతారాలకోసం ప్రారంభించిన ఆలయాల్లో ఒకటి రామునికి, మరొకటి నరసింహునికి ఉద్దేశించినవని ఆలయ శిల్పాన్నిబట్టి చెప్పొచ్చు. రామాలయం పూర్తైందికాని, నరసింహాలయం కప్పుదాకావచ్చి ఆగిపోగా, రేకులతో కప్పారు. అక్కడి శిధిల సౌందర్యాన్ని కళ్లారాచూచి, ఆనందంతో కూడిన బాధను అనుభవంలోకి తెచ్చుకొన్నాం. రమణగారు ఆలయాలు, శిధిలాలను తన కెమెరాలో పదిలపరుస్తున్నారు. హరికృష్ణగారు, ఈ ఆలయాలకు మళ్లీ గతవైభవ ప్రాభవాలను తేవచ్చా అని అడిగారు. నిధులుండాలేగానీ, పదిలంగా సుందరతీరం చేసే బాధ్యత, స్థపతిగా నాదే నన్నాను. సేవాదాస్ మహంత్‌గారు పెట్టించిన ఉద్యానవనం ఆనవాళ్ళు లేవు గాబట్టి, ఆలయాల చుట్టూ ఆధునిక ఉద్యానాన్ని ఏర్పాటుచేయండన్న నా విజ్ఞప్తికి హరికృష్ణగారు, సానుకూలంగా స్పందించారు. ఎప్పట్నుంచో చూడాలనుకొన్న ఈ కట్టడాల్ని చూడగలిగామన్న తృప్తితో విశ్వవిద్యాలయ ప్రాంగణంనుంచి బయటికొచ్చాం.

ఎక్కడికెళ్ళాలని అడిగిన రమణగారితో, తొండవాడ మొండి గోపురం చూద్దామన్నాను. అంతే, పావుగంటలో అక్కడికి చేరుకొన్నాం. కారులోనుంచి దిగకముందే అత్యంత రూపలావణ్యంతో అలరారుతున్న తిమ్మప్పగుడి గోపురం మమ్మల్ని ఆకర్షించి, ఆహ్వానించింది. గుడి శిధిలమైపోగా, గోపురం మిగిలింది. చుట్టూఉన్న స్థలం అన్యాక్రాంతమైంది. ముళ్లకంచెల్ని తొలగించుకుంటూ అంచెలంచెలుగా,

అతి కష్టంమీద క్రీ.శ.16వ శతాబ్దినాటి తిమ్మప్ప దేవాలయ మొండి గోపురం దగ్గరకెళ్లాం. అనేక వరుసలతో అలరారుతున్న అధిష్ఠానం, అందమైన పాదవర్గం (గోడలు), చూపరులను ఇట్టే ఆకట్టుకొంటున్న ప్రస్తరం (కప్పు–చూరు), చుట్టూ తిరుగుదామన్న మా ప్రయత్నాలకు పొదలు, ముళ్లకంచెలు అడ్డుతగిలాయి. అతికష్టంమీద గోపురం ద్వారంలోకి ప్రవేశించాం. అటూ ఇటూ చూచిన మాకు ఆ శిల్పాలను చూచి మతిపోయింది. సురసుందరులు, భాగవత, రామాయణ దృశ్యాలు, భారతీయ సంప్రదాయాలకు అద్దంపడుతున్నాయి. కఠిన శిలల్లో కారుణ్యాన్ని ప్రసరింపజేసిన అలనాటి శిల్పులకు మొక్కి బరువెక్కిన గుండెల్ని అదిమిపట్టుకొని బయటికొచ్చి, ఆ గోపుర సౌందర్యాన్ని మళ్లీ చూశాం.

ఆగోపురం చరిత్రను తెలుసుకొందామని రమణగారిని అడిగాను. పదకవితా పితామహుడు అన్నమయ్య కుమారుడు, సాలెవారికి, జాండ్రవారికి శ్రీవారి ఆలయ మర్యాద, మన్ననల విషయంలో తలెత్తిన


తిమ్మప్పగుడి గోపురం – తొండవాడ

వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాడని, అందుకు అంగీకరించిన ఇద్దరూ, వారి ఆదాయంలో భాగాలను జమచేసి తిరుమల తిమ్మప్ప (వెంకటేశ్వరస్వామి) కు ఒక ఆలయాన్ని నిర్మించాడని, క్రీ.శ.18వ శతాబ్దిలో ఒక ముష్కరమూక దాడిలో ఆలయం, మండపం, గోపుర శిఖరాలు నేలమట్టమైనాయని చెప్పాడు. ఇదే విషయాన్ని గోపీకృష్ణగారు, పేటశ్రీకూడా తెలిపారు. శిథిలమైనా, శిల్పకళా శోభితమూ, వాస్తుపదవిన్యాసమూ పుణికిపుచ్చుకొన్న ఈ తిమ్మప్ప గుడి చుట్టూవున్న ముళ్లపొదల్ని తొలగించి ఆహ్లాదకరమైన ఉద్యానవనంతోపాటు, ఆలయ చరిత్ర, వాస్తుశిల్ప విశేషాలను తెలియజేసే ఒక పేరు పలకను, సాయంకాలం సేదతీరటానికి బెంచీలు, లైటింగు ఏర్పాటు చేస్తామని హరికృష్ణగారు ఇచ్చిన ధీమాతో కూడిన హామీతో నాకు ఊరట కలిగింది.

ఇంతలో చంద్రగిరి నుంచి ధమ్మాచారిగారి నుండి ఫోను. అయ్యా, మీరు ఒకసారి పెదమల్లెల గ్రామంలోని శిథిల మాధవాలయాన్ని చూచి, సలహాలిస్తే, ఆ ఆలయాన్ని పునరుద్ధణ చేద్దామనుకొంటున్నామని చెప్పారు. హరికృష్ణగారు, రమణగారు తిరుపతిలో ఆగిపోగా, నేను మళ్లీ చంద్రగిరి వెళ్ళి, ధమ్మాచారిగారిని కారులో ఎక్కించుకొని శ్రీనివాస మంగాపురం, మోహన్‌బాబుగారి శ్రీనికేతన్ విద్యాలయాల మీదుగా, చక్కటి ప్రకృతి ఒడిలోనున్న కొండలు, గుట్టలు, వాగులు, వంకలూ, చెరువులూ, గుంటలతో నిండిన ప్రాంతంగుండా, ఎప్పుడో బ్రిటీషువాళ్లేసిన ఘాట్‌రోడ్డుమీదుగా, చిత్తూరుజిల్లా రొంపిచెర్ల మండల కేంద్రం మీదుగా మళ్లీ మెలికలు తిరిగిన రోడ్డుమీదుగా, పెదమల్లెల గ్రామం శివారులో పొలాల సదుమ గల చిన్న రాతి రోడ్డు మీద గల దేవాలయాన్ని చేరుకొన్నాం. గర్భాలయం, అర్థమండపం వరకేఉన్న మాధవస్వామి ఆలయ గోడలరాళ్లు ఊడిపోయాయి. శిఖరంపైన సున్నపు శిల్పాలు పూతరాలిపోయాయి. ముందున్న ముఖ మహామండపం కనుమరుగైంది. ధ్వజస్థంభం విరిగిపోయింది. బలిపీఠం ఎక్కడుందో తెలియదు. ప్రాకారం, ఆకారం కోల్పోయింది. క్రీ.శ.16–17 శతాబ్దాల్లో సకల అర్చనలు, ఉత్సవాలతో కళకళలాడిన ఆలయం, నేడు వెలవెలబోతోంది. ధమ్మాచారి విశ్వకర్మ. సరసరానా, వాస్తు, శిల్పశాస్త్రాలతోపాటు, విశ్వకర్మ అందించిన ఆలయనిర్మాణ, ప్రతిమా లక్షణాలను బాగా ఆకళింపు జేసుకొన్న ఆయన, ఈ ఆలయ పునర్నిర్మాణానికి పూనుకొన్నాడు. ఆలయ గోడలమీద ఇంకా పరిష్కరణకు నోచుకోని క్రీ.శ.17–18 శతాబ్దాల శాసనాలు, పడిపోయిన


మాధవాలయం – పెదమల్లెల

ధ్వజస్థంభం, తలలేని రాజదంపతుల శిల్పం, కొంచెందూరంలో ఒక బండపై చెక్కిన ఆ ఆలయనిర్మాత సాష్టాంగ నమస్కార శిల్పాలు కలసికట్టుగా, ధమ్మాచారిగారిని వేడుకున్నాయోఏమో, ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టబడింది. దేవుడు కరుణించాడోఏమో, ప్రభుత్వం నిధులిచ్చింది. కొత్త ఆలయ నిర్మాణం, పాత ఆలయాల పునరుద్ధరణలో సిద్ధహస్తుడైన స్థపతి సూరిబాబుకు ఆ పని దక్కింది. అలయ పునరుద్ధరణకు అవసరమైన సలహాలిచ్చి వెనుతిరిగాను. తిరుపతికి తిరిగొచ్చాను. ఒక్కరోజులో లెక్కలేనన్ని వారసత్వ కట్టడాలను చూశామన్న తృప్తి కలిగింది. ఇంతలో విమాన ప్రయాణంలో గాలిలో తేలిపోతున్న నాకు శిథిలాలు గుర్తుకొచ్చి, వ్యథ మిగిలింది. విమానం హైదరాబాదులో వాలింది. అ

## అమ్మనుడి రచయితలకు ఒక చదువరి సూచన

తెలుగువారికి ఇంటిపేరు ఆభరణం. వారసత్వ సంపదను సూచిస్తుంది. కాబట్టి 'అమ్మనుడి' రచయితలను (ఉదా: సెప్టెంబరు 2021 సంచికలో జె.డి.ప్రభాకర్, సి.వి.కృష్ణయ్య, పి.శివరామకృష్ణ, యం.సాహితి) తెలుగులో తమ ఇంటిపేరు వ్రాయవలసిందిగా కోరుతున్నాను. 'అమ్మనుడి' తెలుగు భాషకు ప్రశంసనీయమైన సేవ చేస్తోంది. మన సత్సంప్రదాయాలను కూడా గౌరవించుకోవాలి.

– త్రిపురనేని హనుమాన్ చౌదరి,
సికిందరాబాద్ – 500009.
ఫోన్ 98490 67359/ 83093 92687

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# ‘కరమజోవ్ సోదరులకు’ స్వాగతం




**బతికివుండగానే మరణాన్నీ, నరకాన్నీ అనుభవించిన మానవుడు మాత్రమే రాయగలిగే రచనలు చేశాడు. దోస్తోయేవ్‌స్కీని చదవడమంటే జీవితపు చీకటి కోణాల్నీ, అస్తిత్వపు అన్ని పార్శ్వాలనూ నిర్దాక్షిణ్యంగా, నిర్మోహంగా, నిశితంగా, విస్పష్టంగా తరచి చూడడమే! ‘బ్రదర్స్ కరమజోవ్’ నవల కేవలం నవల మాత్రమే గాదు. అదొక యితిహాసం. వుపనిషత్తు. మానసిక విశ్లేషణ. మానవుడి ఆలోచనా పరిధి యెంత విస్తృతికీ, యెంత లోతుకూ, యెంత బలంగా నిశితంగా చేరగలదో అంతవరకూ పాఠకుల్ని తీసుకెళ్లే రచన యిది.**

ప్రపంచంలోని గొప్ప నవలల్ని చదవాలనుకుంటే రష్యాకో, ఫ్రాన్సుకో వెళ్ళాల్సిందే అంటాడు ప్రఖ్యాత యింగ్లీషు నవలారచయిత, యి.యెం.ఫాస్టర్ తన ఆస్పెక్ట్స్ ఆఫ్ ది నావెల్ (Aspects of the novel)లో.. అంతేగాదు, ‘టాల్‌స్టాయ్‌లా యే యింగ్లీషు నవలా రచయితా మానవుడి జీవితాన్నంతా– గృహజీవితంతోబాటు సామాజికజీవితాన్నంతా తన రచనలో చూపించలేకపోయాడు. దోస్తోయేవ్‌స్కీలా యింగ్లీషు నవలారచయితా మానవుడి అంతరంగపు లోతుల్ని తరచి చూడలేక పోయాడు. యే యింగ్లీషు రచయితా ‘మార్సెల్ ఫ్రౌస్ట్‌లా ఆధునిక చైతన్యాన్ని విశ్లేషించలేక పోయాడు’ అని అంటాడాయన. నేనయితే రష్యాకూ, ఫ్రాన్స్‌కూ బెంగాల్‌ను(యిక్కడ నేను దేశాలని గుర్తించడం లేదు, భాషల్నే!) కలుపుకోమని ఫాస్టర్‌కు సలహా యిస్తాను. బెంగాల్ అన్నప్పుడు నేను ప్రత్యేకంగా పేర్కొంటున్నది శరత్‌చంద్రచటర్జీని. ఆయన టాల్‌స్టాయ్, దోస్తోయేవ్‌స్కీ, ప్రౌస్ట్‌లు ముగ్గురు చేసిన పనినీ వొక్కచేత్తో చేయగలిగాడు. వాళ్ళముగ్గురూ రాసిన నవలలో ఫాస్టర్ ప్రత్యేకంగా పేర్కొన్నవి రెండు మూడింటిని మాత్రమే! శరత్‌బాబును పూర్తిగా తెలుసుకోవాలంటే ఆయన రచనలనంతా చదవాలి. ఆయన రచనలన్నీ బంగారమే! అయితే శరత్‌తో పెద్దచిక్కుంది. ఆయన సాహిత్యకారుడు చేయాల్సిన ముఖ్యమైన పనిపైనే యెక్కువగా దృష్టిపెడతాడు. ఆయనో అద్భుతమైన కథకుడు. కథచెప్పడంలో ఆయన తర్వాతే యెవరైనా! యిబ్బంది యేమిటంటే యెంత అప్రమత్తంగావున్నా ఆయన కథ పాఠకుల్ని ముంచేస్తుంది. అందువల్ల కథతోబాటూ, కథనం వెనక నేపథ్యంగా, ఆయన చెప్పదలచుకున్న అనేక సాంఘిక, వ్యక్తిగత, తాత్త్విక, ఆధ్యాత్మిక, అంశాలను పాఠకులు పట్టుకోలేకపోతాడు. టాల్‌స్టాయ్, దోస్తోయేవ్‌స్కీ అలాకాదు. కాస్సేపు కథను ఆపికూడా వాళ్ళు విశ్లేషణలూ, చర్చలూ చేస్తారు.

తెలుగువాళ్ళ అదృష్టమేమిటంటే, దేశీప్రచురణలు బొందలపాటి శివరామకృష్ణగారి శరత్ అనువాదాలనంతా యాభై, అరవై సంవత్సరాలక్రితమే తెలుగువాళ్ళకు బహుమతిగా తీసుకొచ్చేశారు. శరత్‌ను తెలుగు రచయితగా భావించే తరమొకటి మనకుండేది. అలాగే టాల్‌స్టాయ్ రచనల్ని కూడా దాదాపు అదే కాలంలో రష్యాలోని రాదుగా ప్రచురణల వాళ్లు తెలుగులోకి తీసుకొచ్చారు. ఆర్వీఆర్, రాచమల్లు రామచంద్రారెడ్డి, ఉప్పల లక్ష్మణరావు వంటివాళ్ళు రష్యాకెళ్ళి రష్యన్ భాషలోంచీ నేరుగా తెలుగు అనువాదాల్ని చేశారు. అయితే దోస్తోయేవ్‌స్కీ దగ్గరకొచ్చేసరికి ఆయన నేరము–శిక్ష (Crime and Punishment శివం గారి తెనుగు అనువాదం) పేదజనం, శ్వేతరాత్రులు (నిడమర్తి ఉమారాజేశ్వరరావు గారి అనువాదం) మాత్రమే తెలుగువారికి దక్కాయి. మరోపుస్తకం ‘తిరస్కృతులు’ అనువాదం వచ్చిందిగానీ, దాని ప్రతులేవీ అందుబాటులోలేవు. ఆయన ప్రసిద్ధరచనలు, ప్రపంచసాహిత్యాన్నంతా ప్రభావితం చేసినవి, నోట్స్ ఫ్రం అండర్ గ్రౌండ్, ఇడియట్, డెమన్స్, బ్రదర్స్ కరమజోవ్ – యివి తెలుగులోకి అనువాదం కాలేదన్న సంగతినికూడా తెలుగుసాహిత్య ప్రపంచం యిన్నిరోజులవరకూ పట్టించుకోలేదు. తెలుగువాళ్ళకు కావల్సినంత సాహిత్యస్పృహ లేకపోవడమూ, పఠనాశక్తిని కోల్పోవడమూ, చివరకు నవలారచనకు పూనుకున్న తెలుగు రచయితలకు కూడా అధ్యయనమూ, సాధనా కొరవడడమూ యీ అలసత్వానికి కారణమని యిప్పటికైనా గుర్తించితీరాలి.

అయితే యిన్నాళ్ల తర్వాత యీలోపాన్ని గుర్తించి, దోస్తోయేవ్‌స్కీ రచనల తెలుగు అనువాద కార్యమనే యజ్ఞాన్ని చేపట్టిన వాళ్ళు దొరకడం తెలుగు సాహిత్య ప్రపంచపు అదృష్టం. చాలా సంవత్సరాలు అమెరికాలో గడిపి యిటీవల యిండియాకు తిరిగొచ్చిన రచయిత, సాహితీప్రేమికుడు కూనపరాజు కుమార్ యీ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆయనకు విజయవాడ



కుమార్ కూనపరాజు

సాహితీ ప్రచురణలు సంస్థ (నిర్వాహకురాలు లక్ష్మి) సహకారం తోడయ్యింది. రెండేళ్ల ముందు వాళ్లు టాల్‌స్టాయ్ రచనలనంతా పునర్ముద్రణ చేశారు. యిప్పుడు దోస్తోయేవ్‌స్కీ రచనలవైపుకు మర్లారు. యిదివరకే ప్రచురించబడిన పేద జనం, శ్వేతరాత్రులు నవలికలను మళ్లీ ప్రచురించారు. వచ్చేనెల (నవంబరు) 11వ తేదీ దోస్తోయేవ్‌స్కీ ద్విశతాబ్ది జయంతి వుత్సవ సందర్భంలో కరమజోవ్ సోదరులు, శాశ్వతభర్త (eternal husband), కొన్ని కథల పుస్తకమూ ఆవిష్కరించ బడబోతున్నాయి.

''బ్రదర్స్ కరమజోవ్'' నవల తెలుగు అనువాదం ప్రచురించబడాన్ని గొప్ప చారిత్రక సంఘటనగా గుర్తించాల్సిన అవసరముంది. 1880లో రష్యాలో తొలిసారిగా ప్రచురించబడిన ఆ నవల 1912లో యింగ్లీషులోకి అనువదించబడింది. అప్పటి నుంచీ ఆ నవల ప్రపంచ సాహిత్యాన్ని కుదుపుతూనే ఉంది. యిరవయ్యవ శతాబ్దపు ప్రపంచ సాహిత్యాన్నంతా తన మానసిక విశ్లేషణలతో ప్రభావితంచేసిన సిగ్మండ్‌ఫ్రాయిడ్ కీ పుస్తకం గొప్ప భూమికగా వుండేది. ఆ కాలపు మహారచయితలు వర్జీనియా వూల్ఫ్, హెర్మన్‌హెస్సీ, జేమ్స్ జాయిస్, డీహెచ్‌లారెన్స్, హెమింగ్వేల వంటి వాళ్లందరూ బ్రదర్స్ కరమ్‌జోవ్‌ను అధ్యయనంచేసి మెచ్చుకున్న వాళ్లే! యిక ఫ్రాంజ్‌కాఫ్కా, ఆల్బర్ట్‌కామూలయితే దోస్తోయేవ్‌స్కీ ప్రభావంలోపడి కొట్టుకుపోయారు. లాటిన్ అమెరికన్ రచయితలనంతా ప్రభావితం చేసిన ప్రముఖ అమెరికన్ నవలా రచయిత విలియం ఫాక్నర్‌– బైబిలు, షేక్స్‌పియర్ నాటకాల తర్వాత బ్రదర్స్ కరమజోవ్ నవలనే పారాయణం చేశానని భక్తిగా చెప్పుకుంటాడు. నోబుల్ బహుమతి వచ్చిన నవలా రచయితలంతా బ్రదర్స్ కరమ్‌జోవ్‌ను తమ ఆరాధనీయ నవలగా పేర్కొన్నారు. జె.యం.కోయట్జీ అనే నోబులు బహుమతి నవలా రచయిత దోస్తోయేవ్‌స్కీ ని పాత్రగా చేసుకుని 'ది మాస్టర్ ఆఫ్ పీటర్స్‌బర్గ్'' అనే నవలే రాశారు.

బ్రదర్స్ కరమజోవ్ నవలను రాయడానికి దోస్తోయేవ్‌స్కీకి రెండు సంవత్సరాలకు పైగా పట్టింది. ఆ నవలను ప్రచురించిన నాగులు నెలల్లోనే ఆయన చనిపోయాడు. అది ఆయన చివరి రచన మాత్రమేకాదు, ఆయన మానవజాతికిచ్చిపోయిన వీడ్కోలు కానుకకూడా! ఆయన చెప్పదలచుకున్న విషయాలనంతా, యే మొహమాటాలూ, మినహాయింపులూ లేకుండా, చెప్పేసిన నవల అది. దోస్తోయేవ్‌స్కీ మానవుడిలోని అమానుషమైన క్రౌర్యాన్ని చూసినవాడు. అలాగే దుర్మార్గుడైన మానవుడిలోకూడా వుండే కాసింతదైనా అయినా కరుణను పసిగట్టి గలిగాడు. మానవజీవితంలో అనుమానాలూ భయాలూ ఆయన్ని కుదిపేశాయి. సంప్రదాయ క్రైస్తవ మతంలో ఆయనకు ప్రగాఢమైన నమ్మకముంది. అయితే అంత నమ్మకమున్నా జీవితంలో చివరి వరకూ దేవుడి వునికి గురించిన అనుమానంతోనే ఆయన వూగిపోయాడు. అలా మేధోజీవిగా మాత్రమే గాకుండా సాధారణ మానవుడికి గూడా ప్రతినిధి కాగలిగాడు.

దోస్తోయేవ్‌స్కీ కి తన జీవితమే గొప్పగురువై కూచుంది. ఆయన తండ్రిని సెర్ఫ్‌లు (కౌలురైతులలాంటి వాళ్లు) చంపేశారు. 28 సంవత్సరాల వయస్సులో వున్నప్పుడు ఆయన తిరుగుబాటుదార్లతో కలిశాడు. ప్రభుత్వం మరణశిక్ష విధించింది. తోటి ఖైదీలతోబాటూ ఆయన్నీ వరసలో నిలబెట్టి తుపాకీలు గురిపెట్టారు. మరికొన్ని నిముషాల్లో ప్రభుత్వం మరణశిక్షను సైబీరియా ప్రవాసంగా మార్చిన తాఖీదు అందింది. కానీ మరణంకోసం వేచివుండిన ఆ కొద్ది నిముషాల్లో దోస్తోయేవ్‌స్కీ మరణంతో భేటీ అయ్యాడు. సైబీరియాలో గడపిన కాలంలో ఆయన నరకాన్నీ రుచిచూశాడు. బతికివుండగానే మరణాన్నీ, నరకాన్నీ అనుభవించిన మానవుడు మాత్రమే రాయగలిగే రచనలు చేశాడు. దోస్తోయేవ్‌స్కీని చదవడమంటే జీవితపు చీకటి కోణాల్నీ, అస్తిత్వపు అన్ని పార్శ్వాలనూ నిర్దాక్షిణ్యంగా, నిర్మోహంగా, నిశితంగా, విస్పష్టంగా తరచి చూడడమే! 'బ్రదర్స్ కరమజోవ్' నవల కేవలం నవల మాత్రమే గాదు. అదొక యితిహాసం. వుపనిషత్తు. మానవిక విశ్లేషణ. మానవుడి ఆలోచనా పరిధి యెంత విస్తృతికీ, యెంతలోతుకూ, యెంతబలంగా నిశితంగా చేరగలదో అంతవరకూ పాఠకుల్ని తీసుకెళ్లే రచన యిది. ఆ రచనను చదివిన తర్వాత పాఠకుడి మనస్సు తుఫానువచ్చి వెళ్లిపోయిన తరువాతి డ్రాయింగ్‌రూంలా వుంటుందంటాడు– యి.యెం.ఫాస్టర్. తుఫాను వచ్చివెళ్లిపోయాక ఆ గదిలోని వస్తువులన్నీ విరిగిపోయి వుంటాయి. చెల్లాచెదురైపోయి వుంటాయి. ఆగొప్ప అనుభవం యెలావుంటుందో తెలుసుకోవాలంటే ఆ నవలను చదివితే తప్ప తెలుసుకోలేము.

కరమజోవ్ సోదరులలో రెండవవాడైన యెవాన్ 'the great inquisitor' అనే అధ్యాయంలో దేవుడితో, మరో అధ్యాయంలో 'సాతాను' తోనూ భేటీ అవుతాడు. ఆ రెండు అధ్యాయాల్లో దోస్తోయేవ్‌స్కీ మానవుడి ఆక్రోశాన్నంతా అనితరసాధ్యమైన రీతిలో చిత్రిస్తాడు. మొత్తం నవలలో ప్రపంచమనే అయోమయంలో అంతుచిక్కని ప్రశ్నలతో అతలాకుతలమయ్యే మానవుడి ఆరాటం వ్యాపించివుంటుంది. అయితే యింతజేసీ దోస్తోయేవ్‌స్కీకి మనిషి పైన అంతులేనిప్రేమా, మానవుడి భవిష్యత్తుపైన గొప్ప నమ్మకమూ వున్నాయి. మానవుడి విముక్తి సామాజిక సంఘీభావంపైన ఆధారపడి వుంటుందనీ, మనుషులు విడివిడిగా జీవించడం

**తరువాయి 48వ పుటలో....**

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209




## 8

"**అమ్మా!** మీ అమ్మబాస అయిన తెలుగులోనే మీ బిడ్డలని చదివిస్తే వుండే ఉపయోగాలు ఇవి" వీదిలా నింకా వినబడిన మాటలు విని ఆడికి పోతిని.

నన్ను చూస్తానే నారాయణన్న, కిష్టన్న మాట్లాడిచ్చిరి. ఆ మూడో మనిషి ఎవరా అని నేను అందాజు చేస్తా వున్నట్లే "ఈ అప్ప రమేశప్ప అని, మన ఓసూరు తెలుగుపైన పి.హెచ్.డి. చేసేకి మద్రాసునింకా వచ్చి, ఈడ మన తెలుగువాళ్లు పడే బాసాబాదలు చూసి, పెండ్లిపెటాకులు లేకుండా పదేండ్లుగా ఈడే వుండాడు. తెలుగు కోసరము, మన కోసరము పనిచేస్తా వుండాడు" నారాయణన్న అనె.

"ఈ అప్ప చదివిండే చదువుకి ఏదయినా యూనివర్సిటిలా పని చిక్కిణ్ణు. ఆ పని చేసుకొని ఆరాముగా వుండకుండా" అంటా కిష్టన్న చెప్పతా వుంటే "ఇబుడు నాకేమయింది. ఈడ నేను ఆరాముగానే వుండాను" అంటా వుండాడు రమేశప్ప.

ఈ కాలములా కూడా ఇట్లా వాళ్లు వుండారా? ఏమిస్తే ఆయప్ప రుణం తీరుతుంది అనిపిచ్చె నాకు.

ఆమీట నేను వాళ్లతో కలసి వాళ్లపనిని నాపనిగా చేస్తా వీదిలాని ఇండ్లంతా తిరిగితిని.

"తెలుగు గురించి మీరు ఇంత మాట్లాడుతారు కదనా, నీ బిడ్డని సర్కారి తెలుగు ఇస్కూలులా చదివిస్తుండావా" అంటా ఒగ అమ్మ అనె.

ఇదే మాటని ఆడవుండే అయిదారుగురు బిడ్డల అమ్మలు, అబ్బలు అనిరి.

నేను ఇంగ ఏమీ మాట్లాడలే.

"నా బిడ్డని మీరు చెప్పిన స్కూల్లానే చేరస్తాను" అని మాత్రమే అంటిని. అట్లే చేస్తిని.

నేను కారులా పోయి నా బిడ్డని తెలుగు స్కూలు తావ దింపి పోతా వుంటే కొందరు "వీడొగ తెలుగు తిక్కలోడు" అంటా నగతా వుండారు.

ఆ మాట వింటానే నాకు రేగిపోయ. ఏది తిక్కలు? ఎవరా తిక్కలోడు? మీరు కడుపుకి అన్నం తింటా వుండారా, ఇంగేమైనా తిని తోస్తా వుండారా? మన భారత రాజ్యాంగము, మహాత్మాగాంధీ, డా.బి.ఆర్.అంబేద్కర్ అట్లా మహానుభావులు తల్లినుడిలా చదువుకోవాలని చెప్పిండారే. ఎన్నో విద్యాకమిషన్లవాళ్లు ఇదే మాటని అనిండారే. మన తమిళనాడులా, కర్నాటకాలా, కె.జి. నింకా పి.జి చదువు దంకా వాళ్లవాళ్ల నుడుల్లానే చదువు చెప్పిస్తా వుండారే. చైనా, జపాను, జర్మనీ, ఫ్రాన్స్, అట్లా దేశాలలో కూడా ఇదే మాదిరిగా చేస్తా వుండారే. మీకది తెలుసా? అయినా, మీకు సిగ్గు, శరము లేకుండా నన్ను చూసి నగతారా" అని వూగిపోతిని.

నా వూగుని చూసి వాళ్లు ఏడికో పారిపోయిరి. అయినా నా కోపము కొండ ఎక్కలే. కారెక్కి పోతే తగ్గుతుందని వూరి ముందరికి పోతిని.

ఆడ తెలుగు సంఘమోళ్లు కనిపిచ్చిరి. వాళ్లని చూస్తానే నా కోపము కొండెక్కి కానా, చేనూ తిరిగి కనిబీకుండా పోయె.

"ఆవులపల్లిలా తెలుగుస్కూలుని మూసిందానికి వూరోళ్లంతా చేరి తమిళస్కూలుకి బీగం వేసిరంట" అనే సుద్ది చెప్పిరి.

"ఎట్లా చల్లని తెలుగు సుద్ది చెప్పితిరన్నా" అంటా వాళ్లని టీ అంగడితావుకి పిలుచుకొని పోతిని.

అబుడు ఆడికి కరపత్రాలు ఎత్తుకొని శామ్‌సింగ్‌గారు వచ్చిరి. ఈ అప్ప తెలుగు అభిమానే కాదు.. ఘంటసాల అభిమాని కూడా. ప్రతి ఏడాది సమితిలా ఘంటసాల పాటల పోటీ పాటకచేరి కూడా పెట్టిస్తాడు.

"రేపు ఆయితారము పదిగంటలకి కార్యక్రమము సురువు అవుతుంది. అందరూ రావాల" అని చెప్పి పోయిరి.

నా పనులంతా బిర్నా ముగించుకొని సమితి దోవ పడితిని. జనం ఒగొగరే వస్తా వుండారు.

వాళ్లని మాట్లాడిస్తా, అన్ని ఏర్పాట్లు చూసుకొంటా వుండారు శామ్‌సింగ్‌గారు.

"తిట్టు కూడా భాషే కదా, తిట్టు కూడా బతుకే కదా! మీ యాసలా మీరే రాయాల, మీ బతుకుల గురించి, బాదల గురించి" ఓసూరు రచయితలకి రమేశప్ప చెప్పతా వుండాడు. "ఈ నెల నా

కత నడుస్తున్న చరిత్ర పత్రికలా వచ్చింది" చిన్నయగారి మహేష్ అంటా చదవతా వుండాడు.

"ఆ కతంతా మావూరి యాసలానే వుంది. ఇట్ల కతల్ని కూడా ఆంధ్రా పత్రికలలా వేస్తారా" అంటా పోతిని.

"నడుస్తున్న చరిత్ర తప్ప ఇంగే పత్రికా మన పక్క తొంగి కూడా చూసేలేదు" అదో మాదిరిగా అమరనారా బసవరాజు అనె.

"ఈ పత్రికని నడపతా వుండేది డా. సామల రమేష్‌బాబుగారు. తెలుగు కోసరము మన తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా ఇట్లా దేశమంతా పారాడతా తన పత్రికలా వేస్తా (ప్రచరిస్తా) వుండారు" రఘునాథరెడ్డి అంటా వుండాడు.

"మన ఓసూరులా కృష్ణరసం ఏర్పడే దానికి ముఖ్య కారణము ఈ బాబాయి అబ్బాయిలే కదా" జయరాం, వెంకటేషు బో గొప్పగా అంటా వుండారు.

నేను వాళ్ల మాటలు వింటా పత్రికని తిప్పతా వుండా...

"పాట కచ్చేరి సురువు అవుతా వుంది. అందరూ లోపలికి రావాల' మైకులా వినబడిన మాట విని లోపల కూకొంటిని. పాటల పల్లికిలా వూరేగి ఆమీట వూరికి పోతిని.

×××

నా సావాసగాడు రవిగాన్ని కలిసేకి ఆపొద్దు తొరపల్లికి పోతిని. అబిటికే ఆడ పెద్ద సభ జరగతా వుంది.

ఈ పొద్దు 'రాజాజీ' పుట్టిన దినము వేడుకలు అని నాకు అబుదు తెలిసె.

మినిస్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టరు వేదికపైన కూకోనుండారు.

అబుడొగ ఆడాయమ్మ మాట్లాడేకి సురువు చేసె. ఆయమ్మ ఊతంగర (ఒక ఊరిపేరు) ఎమ్మెల్యే అంట.

"ఇంతవరకూ మీరు ఇక్కడ తెలుగు చదువుకొంటా, మాట్లాడతా వుండారు. ఇంగమీట అట్ల కాకుండా తమిళము చదవతా తమిళము మాట్లాడాల, ఏలంటే మీరంతా తమిళనాడులా వుండారు" అనె.

అంతే నాకు రేగిపోయ.

"తమిళనాడు ఇండియాలానే వుంది. దేశమంతా మూడోబాసగా హిందీ సదవతా వుంటే, మీరు మాత్రము వద్దనిరి. అట్లే కదా మాకూనూ, అయినా నువ్వెవరుమా మాకు చెప్పేకి" నోటికి వచ్చింది అనేస్తిని.

ఈ సమాచారము ఓసూరులా వుండే రాజకీయ నాయకులకి తెలిసి ఆయమ్మని బాగా ఉమిసి ఉప్పేసిరి. అంతేకాదు ఈ కితా ఎలచ్చన్లలా నిన్ను సోలిపిస్తామని కూడా అనిరి.

"ఆయమ్మని చూసి మన వూర్లలా వుండే ఆడోళ్లు నేర్చుకోవాల. బిడ్లని తెలుగు ఇస్కూళ్లకి చేరిపిస్తామంటే అడ్డంపడి అరవము, ఇంగిలీసు సదువులకని పంపుతా వుండారు" తిట్టుకొంటా పోతా వుండాడు ఓ తాత.

రవి వాళ్లది తోటలా ఇల్లు. ఎలనీరు (కొబ్బరిబొండం) తాగి పాత పేపర్ తిప్పతా వుండా.

బెంగళూరు ఎడిషన్‌లో ఓసూరు సమాచారము వుంది. నిన్న జరిగిన మున్సిపల్ సమావేశంలో 6వ వార్డు కౌన్సిల్ శ్రీమతి రాధమ్మ గజేంద్రమూర్తి గారు, ఓసూరు మున్సిపాలిటీ పరిధిలోని, శిలాఫలకాలు, రోడ్లపేర్లు, మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని విషయాలు తెలుగులో రాయాలని ముద్రించాలని కోరడం, అందుకు స్పందిస్తూ మున్సిపాలిటీ చేర్మన్ బాలకృష్ణారెడ్డి గారు హామీ ఇచ్చారు" అని వుంది.

నాకు చానా కుశాలయె.

ఇదే మాట రవిగాని తావ అంటిని.

"నీకు ఈ సమాచారము తెలీదా? మన యూనియన్ చైర్‌పర్సన్ పుష్పా సర్వేష్‌గారు యూనియన్ మినిట్స్‌ని తెలుగులా రాసి అజెండా ప్రతులని కూడా తెలుగులో వేసి కౌన్సిలర్లకి పంచిండారు. ఇంగ మన మున్సిపాలిటీ చేర్మన్ బాలకృష్ణారెడ్డిగారు కొత్తగా బాగలూరు రోడ్డులా కట్టిండే మున్సిపల్ ఆఫీసుపై తెలుగులో పెద్ద పెద్ద అక్షరాలు రాసి తమిళముతో సమానంగా తెలుగును నిలిపిరి" అనె.

నా మనసులానే వాళ్లిద్దరికి దండాలు చెప్పుకొంటిని.

"నీకు ఇంగో విషయము తెలుసా, ఇంతకు ముందర ఒగకిత మన తావులా తెలుగు, కన్నడ టీవి ఛానళ్ల ప్రసారాన్ని గవర్నమెంటోళ్లు నిలిపేసిరి. మన ఓసూరు ఎమ్మెల్యే అధికారుల తావ మాట్లాడతా వుండాడు. అంతలానే యీ విషయము కర్నాటకాలాని కన్నడ సంఘమోళ్లకి తెలిసె. వాళ్లు తమిళనాడు బార్డరులా వచ్చి నిలచి ఒగ దినము గడువు యిస్తా వుండాము. అంతలానే కన్నడ ఛానళ్లు ప్రసారము కావాల లేదంటే బాగుండేలేదని హెచ్చరించిరి. ఆపొద్దు మాపుసారే కన్నడ, తెలుగు టీవీల ఛానళ్ల ప్రసారాలు మొదలాయ. ఇట్లా హెచ్చరికలు, మాట సాయాలు ఆంధ్రా జనాలనింకా, గవర్నమెంటు నింకా ఎదురు చూసేకి అయితుందా?" అంటా వెత పడె.

మన బాసకోసం ఒగని తావా, యాసకోసం ఇంగొగని తావా, బదుకుకోసం అదెందరి తావ పోరాటము చేయాలనో, సమాజాన్ని కాస్తా పోలీసులు, దేశాన్ని కాస్తా సైనికులు, అందర్ని కాస్తా రైతులు, మనిషి మనిషి తావ పోరాటము చేస్తా వుండారు. చస్తా వుండారు. అయినా మనిషి మనిషిగా మారతాలేదు. ఈ బూలోకములా మనుషులంతా బాస, యాస, తావు, కులం, మతం అనేది విడచి అదెబుడు మనుషులుగా బతకతారో... ఆలోచన చేస్తా... నేను ఆపొద్దు కాలాన్ని కాలీ చేస్తా ఇంటికి పోతిని.

బేజారుగా వుందని టీవీ ఆన్ చేస్తిని. తెలుగులా నూరుకి పైగా సినిమాలు తీసిండే డైరెక్టరు ఇంటర్వ్యూ జరగతా వుంది. యాంకరమ్మ నగతా సినిమా మాటలు అడగతా వుంటే ఆ మాటలగుట్టు ఆయప్ప విప్పతా చెప్పతా వుండాడు.

ఆ డైరెక్టరు కొడుకు, వాళ్ల ఇంటివాళ్లు కూడా ఆడ వుండారు. వీళ్లది తమిళనాడు కోయంబత్తూరు అంట.

యాంకరమ్మ, మాటల్ని మరువ (ప్రవాహం) పారిస్తా టీవీ చూసే జనాలని మైమరిపిస్తా వుంది. అబుడు కోయంబత్తూరు వాళ్లని

**భాష లేకపోతే భావం లేదు; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది**



మాట్లాడిస్తా 'బోజనం తిని పోదురు రండి' అనే మాటని మీరు అక్కడి తెలుగులా ఎలా అంటారో చెప్పమని అడిగె.

దానికి వాళ్లు "కూడు తిని పోదురు రాండ" అని అనిరి. అంతే యాంకరమ్మ "ఇంక చాలు మీ మాటలు" అంటా చెవులు మూసుకొని మెలికలు తిరిగి వీళ్ల బాసని నగి పెట్టేసె.

నాకు అది చూస్తానే రేగిపోయె.

"అచ్చ తెలుగులో కూడు అంటే ఆయమ్మకి అంత నగవా, తాశారమా. తెలుగుపదం ఏది సంస్కృతపదం ఏది అని తెలుసుకొనేకి వాళ్లకి వగ లేకుండా మా మాటల్ని నగుతారా అనే నా కోపాన్ని పేపరుపైన రాసి నడుస్తున్న చరిత్ర పత్రికకి పంపితిని. వచ్చే నెలలా అది అచ్చు అయివచ్చే. కృష్ణరసం వాళ్ల సమావేశములో కూడా నేను దాన్ని చదివితిని.

"ఇట్ల నగినగే తెలంగాణ ఆంధ్రనింకా తెంపుకొని పోయె. అయినా వాళ్లకు బుద్ధి రాలే. అంతా మన కర్మ, తెలుగువాళ్లగా తమిళనాడులా ఆ దేవుడు ఏమిటికి మమ్మల్ని పుట్టిచ్చినో" అంటా వెతపడె నారాయణన్న. కృష్ణరసం కవులు కూడా ఆమీట తమ గళం వినిపిచ్చి. ఈ విషయాన్ని ఎండగట్టిరి.

మా ఓసూరోల్లకి ఉగాది చానా పెద్ద పండగ. మొదలు దినము ఉగాది. రెండో దినము వరస తడుకు. ఈ రెండు దినాలలా ఓసూరు నగర వీదులు ఎట్లుంటాయంటే 'బంద్' చేస్తే ఎట్లుంటుందో అట్లుంటుంది.

పల్లె పల్లె పండగని దండిగా చేస్తా తెలుగమ్మ కళాచారాన్ని కాలానికి పరిచయం చేస్తా వుంటుంది.

"సాయంకాలం హోసూరు బోసుబజారు మిత్రబృందం వారి పాటకచ్చేరి, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు, ఇదే రోజు ఉదయం బస్తి యువక బృందం వారి కవితల కూర్పు (సంకలనం) విడుదల కార్యక్రమాలు" అనే సమాచారము పేపర్లా చదివి బస్తికి పోతిని.

ఊరి మద్దిలా స్టేజి వేసిందారు.

స్టేజికి రెండు పక్కలా రాజకీయ నాయకులకు, కవులకు మేలురాక (ఆహ్వానం) తెలుపుతూ బేనర్లు కట్టిందారు.

ఆడొగ వయసు చిన్నోడు అన్ని పనులు చూసుకొంటా అడావుడిగా వుండాడు.

"రేయ్! మక్కిరి మొకమోడా, తెలుగుతల్లి పోటా తెమ్మంటిని తెస్తివారా" అని అంటానే వాడు తలగీరుకొంటా పోయె.

"పొద్దిన్నే చెత్త మక్కిరి(గంప) తినొద్దంద్రా అని దీనికే చెప్పేది" అని ఇంగొగని పైన రేగె.

వాడు ఉసురు తీయకుండా ఒగే ఉసురులా పారె. ఆదేమి అర్థము ఆయెనో వానికి.

అబుడు ఆడికి పదిజనము వయసు చిన్నోళ్లు గుంపుగా వచ్చిరి.

వాళ్లని చూస్తానే "రేయ్! మీటింగుకు వచ్చిన పెద్దోళ్లంతా, ఈడ బృందము వుంది, యువకులు ఏడ అని నన్ను అడగతారురా, రవంతసేపు ఆ చేర్లలా చావండ్రా (కూర్చోండి)" అని తిడతావుంటే,

వాళ్లు మమ్మల్ని కాదు అన్నెట్ల వాళ్ల ఆటలు పాట్లు వాళ్లు ఆడతా వుండారు.

“ఎవరప్పా నువ్వు, ఆడ చేర్లు వేసిండేది ఏమిటికి. కూకొందాము అనుకోకుండా, నిలుచుకొని వుండావే. పోనీ ఆ చేర్లపైన ఎక్కి నిలుచుకో చూసేకి బాగుంటుంది” నన్ను చూస్తా అనె.

నాకు ఏమీ బుర్ర పారలే.

కదలకుండా కూకొనేస్తిని. వీడు సరైన గాతుకుడు వున్నెట్ల వుండాడు. అయినా ఈవూరోళ్లు ఎట్లా వాన్ని మీటింగు నడిపేకి పెట్టిండారని తిట్టుకొంటిని.

“నమస్కారము సామి” ఎవరో అతన్ని మాట్లాడిచ్చిరి.

వీని పేరు సామినా, పేరుకు వీనికి నక్కకీ నాగలోకానికి వున్నంత సంబంధము వుంది అనుకొంటా వున్నట్లే “సామన్నా దిగువ యీదిలా నీళ్లు రాలే. పైపు పగిలిపోయిందంట” అంటా ఇంగోడు ఆడికి వచ్చె.

‘నువ్వు పోయి పైపు, పెవిస్టికు తేపోరా, నేనొచ్చి సరిచేస్తాను” అని వాన్ని మింగే మాదిరిగా చూసె. వాడు ఒగే వుసురులా పారీడిసె.

వీడేమన్నా వూరు కొళాయిలకి నీళ్లు తిప్పేవాడా అనుకొంటా ఇదే మాటని పక్కలా వుండే ఒగ ఆసామిని అడిగితిని.

“వాడు ఈ వూరి వార్డు మెంబరప్పా, ఆ పారినోడు కొళాయిలకి నీళ్లు తిప్పేవాడు” అనె.

“మడి (మరి) అందరూ సామి, సామి అంటారు కదనా?” అంటా అనుమానము పడితిని.

“అబుడొగకితా అయోధ్య గలాటాలు ఆయె కదా, అబుడు వీడే ఓసూరులా అయోధ్య ఇటుకల్ని తలమీంద పెట్టుకొని వీదులంతా తిరిగె. ఆ పొద్దునింకా వాన్ని అందరూ సామి అనే పిల చేది” అని చెప్పి నా అనుమానము తీర్చె ఆసామి.

వీని చరిత్రలా ఇట్లా పేజీ కూడా వుందా అని నేను అనుకొంటా వున్నట్లే మీటింగు సురువాయె.

“హైదరాబాదు నింకా వచ్చిండే జయధీర్ తిరుమలరావు గారు, గోరటి వెంకన్నగారు, సంచిక వెబ్ పత్రికా సంపాదకులు కస్తూరి మురళీకృష్ణగారు, నిజామాబాద్ బోధన్ నింకా వచ్చిండే పూదోట శౌరీలమ్మ, తిరుపతి నింకా వచ్చిండే ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, పలమనేరు బాలాజిగారు, మద్రాసు నింకా వచ్చిండే గుడిమెట్ల చెన్నయ్యగారు, ఉప్పలదడియం వెంకటేశ్వరగారు, బెంగళూరునింకా వచ్చిండే బెంగళూరు తెలుగు తేజం పత్రికా సంపాదకులు మాల్యాద్రి గారు” అంటా ఒగొగరినే సభకు పరిచయం చేసిరి సామి.

ఉగాది వైభవమే కాదు, తెలుగు పదానికి, పాటకి, మాటకి వుండే గొప్పతనము గురించి పెద్దోళ్లు మాట్లాడిరి. మన తావులా తెలుగు నిలవాలంటే ఇండ్లలా అమ్మ అబ్బ ఏమి చేయాలనో, రాజకీయ నాయకులుగా మేము ఏమి చేస్తాము అనే దాన్ని నాయకులు చెప్పిరి. ఆ ఏడాది కవితల పొత్తం ‘పరస పల్లకీలు’ విడుదల చేసిరి.

ఆ పొత్తాన్ని అంతకు ముందర ఏడాది చచ్చిపోయిన తెలుగు జ్ఞానపీఠం రావూరి భరద్వాజ గారికి అంకితం ఇచ్చిండారు.

“మన ఎమ్మెల్యే గోపీనాథ్‌గారు తమిళనాడు చట్టసభలా కడ్డాయ తమిళం విషయంగా తెలుగులా మాట్లాడితే దానికి సమాదానము చెప్పతా రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలితమ్మగారు తెలుగులోనే మాట్లాడిరి. ఇది తమిళనాడులోని తెలుగువాళ్లకి చానా పెద్ద విషయము. గౌరవము కూడా. దాన్నింకా మన ఎమ్మెల్యేగారికి బస్తి యువక బృందం తరపున చిన్న సన్మానము” అని సామి అంటానే ఆ వూరిగౌడు శీనప్ప, వెంకటేశప్ప మాస్టరు వచ్చి శాలువ కప్పి, తెలుగుతల్లి పోటోని కానుకగా ఇచ్చిరి.

ఆమీట కవితల పోటీలలో గెలిసిండే జె.ఎన్. ప్రవీణ్ కుమార్, ఎస్.రాము డెంకణికోట పాఠశాల, యం.మాదేష్, మదగొండపల్లి పాఠశాల, వ్యాసరచన పోటీలలో గెలిసిండే ఆర్. ప్రియాంక, భైరమంగలం, పి. నందిని, డి. కొత్తనూరు, సి.రాంప్రభాకర్, మూర్నపల్లి పాఠశాలల చిన్నోళ్లకి బహుమతులు ఇచ్చిరి.

ఓసూరు కవులు, రచయితలు పాత మత్తిగిరి సుబ్రమణ్యం, కారుపల్లి నరసింహమూర్తి, నంద్యాల నారాయణరెడ్డి, విద్వాన్ ఆర్. సత్యనారాయణ, టి.ఆర్.శ్రీనివాస్ ప్రసాద్, రచయిత్రి దేవిశెట్టిపల్లి సుమలకి సన్మానాలు జరిగె.

కడగా ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, చెన్నై నింకా వచ్చిండే కవులకి, రచయితలకి, బాషోద్యమకారులకి సన్మానాలు జరిగె. కన్నుల పండగగా బస్తి ఉగాది వేడుగలు ముగిసె.

“ఉగాది పండగ అంటే ఇట్ల చేయాల” అంటా నా పక్కలా నిలచిండే వాళ్ల తావ అంటిని.

“మీటింగు సురువు కాక ముందర అలకామాటలు మాట్లడతా వుండిన సామి, ఎంత బాగా మాట్లాడతా ఈ వేడుకల్ని ముగించె” అని కూడా అంటిని.

“చూడప్పా! ఇది వెలుగులా నడచిన మీటింగు. మాపుసారి మబ్బు అయినంక మేమంతా చేరి మబ్బు మీటింగు పెడతాము. మీ సామి విశ్వరూపము అబుడు చూడాల అలకామాటలే (తిట్లు) కాదు, సముసుకృతము, ఇంగ్లీషు కూడా మాట్లాడతాడు” అని నగతా వుండారు వాళ్లంతా.

మీకు ఆ సామినే కరెక్టు. కోతుల్ని అద్దులా పెట్టాలంటే గంద్రకోతి వుండాల్సిందే అనుకొంటా, నగుకొంటా, నడుసుకొంటా ఇంటి దోవ సాగిపోతిని.

(తరువాయి వచ్చే సంచికలో...)


## స్పందనను వ్రాయండి

**‘అమ్మనుడి’**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!

సంపాదకుడు **‘అమ్మనుడి’,**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

కన్నడ మూలం: డా. చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

**6**

### బొమ్మలను పెట్టెలో పెట్టి నాశనం చేయకూడదు

నా కూతురు ఇచ్చిన వెయ్యి రూపాయలు తీసుకుని బొమ్మలను తయారు చేసేవాళ్ళను వెతుక్కుంటూ బయలుదేరాను.

మా తాలూకా చుట్టుపక్కలున్న పల్లెలన్నీ తిరిగాను.

ఆ రోజుల్లో వెయ్యి రూపాయలు అంటే చాలా పెద్ద మొత్తం.

రెండురోజులు చుట్టుపక్కల ఉన్న పల్లెల్లో అక్కడి వడ్రంగులు సంప్రదించాను.

చక్కటి బొమ్మలను చెక్కేవారు ఎవరూ దొరకలేదు.

ఆ సమయాకే బొమ్మలు చెక్కే ముందు తరాలవారు కనుమరుగయ్యారు.

వారి పిల్లలకు బొమ్మలు చేసే విద్య తెలియదు

అందువల్ల విసిగిపోయి, ఒట్టి చేతులతో ఇంటికి తిరిగి వచ్చాను.

ఆరోజు రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

మనసులో బాధ మరింత పెరిగింది.

అప్పుడు లేచి కూర్చోని ఆలోచించసాగాను.

హఠాత్తుగా అప్పటికే ఆట ఆడటం మానివేసిన వంశాల వైపు నా ఆలోచన మళ్ళింది.

"ఇప్పటికీ కొన్ని వంశాల వారు ఈ ఆటలను ప్రదర్శించడం వదిలివేశారు. మరికొన్ని ఇండ్లవాళ్ళు వదిలి వేసే స్థితిలో ఉన్నారు" అని వేదికమీద చెబుతున్నా విద్వాంసుల మాటలు గుర్తొచ్చాయి.

ఇంటికి అప్పుడప్పుడు వస్తున్నా జానపద సీనియర్ ముందు తరాల విద్వాంసులైన ముదేనూరు సంగజ్జ, కు.శి.హరిదాస భట్ట, ఎం. ఎం. కలబుర్గి, వృషభేంద్ర స్వామి, మురళి, శివరామ కారంత్, విలియం మాడ్త, ఎం.జి.ఈశ్వరప్ప, బసవరాజు మలశెట్టి, గో.రు.చ. మొదలైనవాళ్ళు ఇంటికి వచ్చినప్పుడు ఒకటి రెండు దశాబ్దాల కిందట చాలా ఇండ్లవాళ్ళు ఈ కళను వదిలేశారని చెప్పేవారు. ఈ వాస్తవం విద్వాంసులకు తెలిసినంతగా నాకూ తెలుసు. అందువల్ల ఈ కొయ్య బొమ్మల ఆట ప్రదర్శించడం మానివేసిన ఇండ్లకు, పల్లెలకు, వెళ్లాలని నిర్ణయించుకున్నాను. ముందుగా వారిని అన్వేషించటానికి హరిహర తాలూకాను ఎన్నుకున్నాను.

గతంలో హరిహర తాలూకాలో రాణిబెన్నూరు తాలూకాకన్నా ఎక్కువ మేళాలు ఉండేవి.

అందువల్ల అటువైపు వెళ్లాలని నిర్ణయించుకున్నాను.

మొదట హరిహర దగ్గర ఉన్న 'తోళహుణిసి' అనే గ్రామానికి పోయాను.

అది వడ్రంగుల ఇల్లు.

ఆ ఊళ్లో 20 బొమ్మలు దొరికాయి.

ఆ బొమ్మలు ఇచ్చినవారి వంశ చరిత్ర ప్రత్యేకమైనది.

బయలాట ప్రదర్శనలో, బొమ్మలాట ప్రదర్శనలో చుట్టుపక్కల పల్లెలో పేరు తెచ్చుకున్న వంశం వారిది. వీరు సుమారు నలభై-నలభై అయిదు సంవత్సరాల క్రితం నుంచే ఆట ఆడటం మానేశారు. వారి కుటుంబ గొడవలు ఈ ఆట ఆగిపోవడానికి కారణమని బొమ్మలు నాకు ఇచ్చేటప్పుడు ఆ ఇంటి యజమాని చెప్పాడు. అయితే కచ్చితమైన సమాచారం నాకు తెలియదు. మా ఇంటి పరిస్థితి కూడా ఇంతకు భిన్నంగా లేదుకదా అని అనుకున్నాను.

నేను వారి ఇంటికి వెళ్ళినప్పుడు వాళ్ళు చాలా చాలా పేదరికంలో ఉన్నారు. అలాంటి పేదరికంలోనూ నన్ను ఏమీ అడగకుండా అత్యంత ప్రేమతో బొమ్మలను ఇచ్చారు. అలా ఇచ్చేటప్పుడు, "చూడండి, ఇవి ఏనాటి కాలంలోనివో మాకు తెలియదు. మా నాన్న కూడా తనకు తెలియదని చెప్పేవారు. మా నాన్నతో ఆయన తండ్రి, తన తండ్రి కాలంలోనివని చెప్పేవారట. మా వంశానికి చెందిన అలాంటి ఆస్తిని మీకు ఇస్తున్నాం. వాటిని ఉపయోగించుకోవాలో, వదులుకోవాలో మీకే వదిలేస్తున్నాం. మీరు ఇచ్చే డబ్బు మా దగ్గర మిగలదు. మీరు తలుచుకుంటే ఈ బొమ్మలను అజరామరంగా ఉండిపోయేటట్టు చేయగలరు. అప్పుడు ఈ బొమ్మల గురించి నలుగురికి తెలుస్తుంది. అప్పుడే ఆ బొమ్మలకు ప్రాణం పోసినట్టు అవుతుంది. వాటిని మా పెట్టెలో పెట్టుకుని నాశనం చేయడం మాకు ఇష్టం లేదు. తీసుకొని పోండి. ఏదో ఒక స్థలంలో ఫలానా వంశంవారి బొమ్మలు అని మా పేరైనా చెబుతారు కదా. అది మాకు చాలు" అని చెప్పి నాకు ఇచ్చారు.

అప్పుడు నన్ను నేనే నమ్మలేకపోయాను.

ఒకరి ఇంటి బొమ్మలు తీసుకోవడం అంత సులభం అని నా మనసుకు అనిపించలేదు.

అలా చెప్పే మాట సులభమైనది కాదు.

ఎందుకంటే మేము ఎవరికీ బొమ్మలోని ఒక ముక్కను కూడా ఇచ్చేవాళ్ళం కాదు. ఇవ్వనే ఇవ్వం.

మా ఇంటికి విదేశీయులు చాలాసార్లు వచ్చారు. ఒక బొమ్మ ఇవ్వండి. మీరు అడిగినంత డబ్బులు ఇస్తామని చెప్పిన మేము

ఇవ్వలేదు.

ఈ రోజు ఈ బొమ్మల కోసం నేను ఇచ్చిన డబ్బు చాలా తక్కువ.

దాన్ని 'వారపు సంత' అంటారు. ఈనాటి కాలంలో 500- 1000 రూపాయలు ఎంత? ఈరోజు 500- 1000రూపాయలు మాలాంటి వారికి వారపు సంత అవుతుంది. ఐదు వేలు ఇస్తే 'పండుగ సంత'కు సరిపోతుంది. 10,000 ఇస్తే 'పండుగ వారపు సంత'కు సరిపోతుంది. మళ్ళీ మరుసటి వారపు సంత చేస్తాం. అప్పట్లో ఇప్పటి వారపు సంతలా వెయ్యి రెండు వేలు రూపాయలు సంతలు కావు. చాలా తక్కువ డబ్బుతో సంత చేయవచ్చు. వాళ్ళు చాలా పేదరికంలో ఉన్నారు. అయినా డబ్బు అడగలేదు. అయితే 'వారపు సంత'కు అవసరమైన డబ్బులు ఇచ్చాను. అదే పెద్ద మొత్తమని అనుకున్నారు.

ఆ రోజుతో వాళ్ళింటితో సంబంధాన్ని నేను తెంచుకోలేదు.

సుమారు మూడు సంవత్సరాలు వరకు ఐదు ఆరు నెలలకు ఒకసారి వాళ్ళ ఇంటికి వెళ్లి వచ్చేవాడిని.

అలా వెళ్ళినప్పుడు మా ఇంట్లో ఉన్న, మేము పండించిన గింజలు- ధాన్యము, కొంత పెసలు, కంది, వెల్లుల్లి, ఉల్లి జొన్నలు తీసుకొనిపోయి ఇచ్చేవాడిని. వాళ్లు చాలా సంతోషపడేవాళ్ళు. నాకు వారి ధర్మానికి రుణం తీర్చుకుంటున్నాననే సంతోషం కలిగేది. అందువల్ల ఆ బొమ్మలను వ్యాపారం చేసి కొనుక్కొని వచ్చానని ఎన్నడూ భావించలేదు. బొమ్మ ఇచ్చిన వారికి ఏ భావన మనసులో ఉందో తెలియదు. అయితే నాకు కలిగిన భావనే వాళ్లలోనూ కలిగి ఉండవచ్చని నేను అనుకున్నాను.

బొమ్మలు దొరికిన రోజు నాకు బంగారం దొరికినంతగా సంతోషం కలిగింది.

దేవాలయంలో దాచిపెట్టిన నిధిని మోసుకొని వచ్చిన రాజకుమారుడి కథ గుర్తుకొచ్చింది.

నేనే రాజకుమారుడిని.

బొమ్మలే నా బంగారం అనే భావన నాలో ఉంది.

బొమ్మలు తీసుకొని ఇంటికి వచ్చేసరికి చీకటి పడింది.

అప్పటికే పిల్లలు భోజనం చేసి పడుకోబోతున్నారు.

నేను తెచ్చిన బొమ్మలు చూసి ఆనందపడ్డారు.

ఆ విషయమే చాలాసేపు మాట్లాడుతూ నిద్రపోయారు.

ఆరోజు నాకు గాఢమైన నిద్ర పట్టింది.

బొమ్మలు దొరికాయని సంతోషం ఒకవైతే, బొమ్మల మూటను మోసుకొని వచ్చిన అలుపు ఇంకొకవైపు.

మరుసటి రోజు స్నానం చేసి దేవుళ్లకు నమస్కరించి బొమ్మల మూటను చేతిలోకి తీసుకున్నాను.

పిల్లలు నా దగ్గరికి వచ్చి నిలబడ్డారు.

మూట విప్పి చూస్తే ఆ బొమ్మలు మా బొమ్మలకన్నా భిన్నంగా ఉన్నాయి.

వాటిని పిల్లలు ఆసక్తితో తీసుకొని తిప్పి తిప్పి చూడసాగారు.

మా బొమ్మలకన్నా ఇవి భిన్నంగా ఉండటం వల్ల వాటిలో ఉన్న సాంకేతిక జ్ఞానం గురించి మా పిల్లలు నన్ను అడిగారు.

నేను అలాంటి బొమ్మలను ఎన్నడు చూడనేలేదు. తాకనూ లేదు.

అలాంటి బొమ్మలు చూడటం అది మొదలు.

వాటిలో ఉన్న సాంకేతికత నాకు తెలియదు. పిల్లలకు కలిగిన అనుభవం 'తోళుహుణసి' గ్రామంలో మొదటిసారి బొమ్మలను చూసినప్పుడు నాకు కలిగింది. ఆ ఇంటివారిని ఆ విషయం అడిగాను. వాళ్ళు మాకు తెలియదని చెప్పారు.

అందువల్ల వాటిని ఎలా ఉపయోగించాలో అర్థం కాలేదు.

దాంతో ఒక బట్టలో మూట కట్టి జాగ్రతగా పెట్టాను.

**అడుగులు వేయించాను-ఒక్క అడుగు వేయలేదు**

కొయ్య బొమ్మలాట ప్రదర్శించడానికి కనీసం 24 బొమ్మలు కావాలి.

ఆ రోజు తోలుహుణిసిలో 20 బొమ్మలు దొరికాయి.

ఇక నాలుగు బొమ్మల అవసరం ఉంది.

అందువల్ల అవసరమైన బొమ్మలను వెతికి తీసుకుని వద్దామని హరిహర తాలూకాకు చెందిన 'కడ్లేబాళ' గ్రామానికి వెళ్లాను. ఆ ఊళ్లోని ఒక కుటుంబం అప్పటికే తాము ఆడుతున్న ఆటను నిలిపివేశారనే సమాచారం 'తోళుహుణసి' గ్రామంలోనే దొరికింది. అంతేకాకుండా మొన్న అవసరమైన బొమ్మలు దొరికాయికదా! ఆ సంతోషంతోనే వెళ్ళాను. మొన్నటి రోజున బొమ్మలు దొరికినట్టు ఈ రోజు కూడా బొమ్మలు దొరకవచ్చనే ఆశ, నమ్మకం నా మనసులో ఉన్నాయి.

అయితే అక్కడికి వెళ్ళినప్పుడు నాకు చాలా నిరాశ, దుఃఖం కలిగాయి.

వారి ఇంటి అటకమీద 25 కన్నా ఎక్కువ బొమ్మలు ఉన్నప్పటికీ దాదాపుగా అన్ని పాడైపోయి ఉన్నాయి.

బొమ్మల మూట చూసిన వెంటనే నా గుండె పగిలినట్టు అయింది.

తల మీద చేయి పెట్టుకొని కొద్దిసేపు మౌనంగా కూర్చున్నాను.

కొద్దిసేపటి తర్వాత ఆ మూట విప్పి చూపించమని ఇంటి యజమానిని అడిగాను.

పాపం ఆయన మారుమాట్లాడకుండా అటక మీద ఉన్న బొమ్మల మూటను తెచ్చి, అరుగు మీద పెట్టి, విప్పి చూపించారు. వాటిని బాగా పరిశీలించిన తరువాత ఆ బొమ్మలను ఉపయోగించవచ్చని అనిపించింది. రెండు బొమ్మలను చేతిలోకి తీసుకున్నాను.

"వీటిని తీసుకోవచ్చా?" అని అడిగాను.

వాళ్ళు సంతోషంతో ఒప్పుకొన్నారు.

అప్పుడు 11 రూపాయలు దక్షిణ ఇచ్చాను.

వాళ్ళు నాకు చాయ్ ఇచ్చారు.

చాయ్ తాగాను.

బొమ్మలను శాలువాలు చుట్టుకొని, భుజం మీద పెట్టుకుని మరొకసారి ఆ ఇంటివాళ్ళకు, పాత బొమ్మలు ఉన్న మూటకు



నమస్కారం పెట్టి బయలుదేరాలని అనుకున్నాను. అంతలో ఆ ఇంటి యజమాని హఠాత్తుగా "చాలా కాలం క్రితం మీ తాలూకా లోని 'మణకూరు' లో మా వియ్యంకులు ఉన్నారు. వాళ్ళు ఏదో పనిమీద మా ఇంటికి వచ్చినప్పుడు ఇంట్లో ఉన్న రెండు బొమ్మలను తీసుకొనిపోయారు" అని చెప్పాడు.

ఆ విషయాన్ని విన్న వెంటనే నా కాళ్లు ముందుకు సాగలేదు.

భుజం మీద పెట్టుకున్న బొమ్మలను అరుగు మీద పెట్టి, ఆ ఇంటి యజమాని దగ్గర కూర్చున్నాను.

'మణకూరు' మా పల్లె పక్కనే ఉన్న పల్లె.

అక్కడ చాలామందితో నాకు పరిచయం ఉంది.

అంతేకాకుండా మా వంశం గురించి ఆ ఊరి వారందరికీ బాగా తెలుసు. అందువల్ల ఆ బొమ్మలను చూడవచ్చని ధైర్యంతో ఆ ఇంటి యజమానినీ, ఆ కుటుంబవారినీ 'మా ఇంటికి రండి' అని చెప్పి చిరునామాను రాసిచ్చి, ఊరికి వచ్చాను.

మరుసటి రోజు ఉదయాన్నే స్నానం చేసి బొమ్మలను చేతిలో పట్టుకొని చూశాను.

స్నానం చేసిన తరువాతే బొమ్మలను ముట్టుకోవాలన్నది మా ఇంటి పద్ధతి.

ఆ పద్ధతిని ఇప్పుడు అంతగా పాటించడం లేదు.

బొమ్మలను చేతికి ఎత్తుకున్నప్పుడు నిన్నటికన్నా ఎందుకో ఈరోజు భయం కాస్త ఎక్కువైంది.

ఆ భయంతోనే మొదటి బొమ్మను బిగించి చూద్దామని అనుకుచ్చాను.

బొమ్మలు నూలు దారంతో బిగించినప్పుడు, ఆ బొమ్మ విరగకపోతే, అంటే ముక్కలు కాకపోతే అది ఉపయోగపడుతుంది. బొమ్మల్లో కాస్త బాగున్నదాన్ని మొదట నూలుదారంతో బిగించి కడదామని అనుకున్నాను. పాడైనట్టు కనిపించే బొమ్మను ముందుగానే కట్టి చూద్దామనే ధైర్యం నాకు లేదు. అందువల్ల మంచి బొమ్మను తీసుకుని బిగించాను.

బొమ్మలు కట్టడానికి నా పెద్ద కొడుకు సహాయం చేశాడు.

నా కూతురు "మరీ గట్టిగా బిగించకు నాన్న" అని భయాన్ని వ్యక్తపరుస్తూనే ఉంది.

నా భార్య ఏమి మాట్లాడకుండా మౌనంగా చూస్తూ నిలబడింది.

బొమ్మ ముక్కలు కాకుండా ఉంటుందనే ధైర్యం ఆమెలో కనిపించలేదు.

అయితే బొమ్మ విరగలేదు.

దాన్ని పైకెత్తుకుని చాలా సంతోషంతో ఒకటి రెండు అడుగులు వేశాను.

అంటే దానితో నృత్యం చేయించాను.

ఆ బొమ్మ చాలా చక్కగా నర్తించింది.

నేను గతంలో మా వంశపు బొమ్మలను నృత్యం చేయించటం గుర్తుకు వచ్చింది.

అయితే ఇవి మా బొమ్మల్లా లేవు. మేళం వేరైపోయిన తరువాత, ఆట ప్రదర్శించడం మానివేసిన తరువాత మళ్ళీ బొమ్మల చేత నృత్యం

## 40 వ పుట తరువాయి.....

మానాలనీ, ఆధ్యాత్మిక నియమాలే మనుషుల్ని నడపాలనీ ఆయన బోధిస్తాడు. రష్యన్ సనాతన క్రైస్తవ మతం గురించిన నవలే అయినా యిది కేవలం వొకమతానికిచెందిన నవల మాత్రంగాదు. ఆ నవలలోని మానవుల అన్వేషణలూ, మానవులకూ మతానికీ మధ్యవుండే సంబంధాలూ అన్ని మతాలలోనూ వొకే రీతిలో వుంటాయి. అందువల్ల దోస్తోయేవ్‌స్కీ ప్రపంచమానవాళికంతా గొంతులా తయారయ్యాడు. అది సార్వకాలికమూ సార్వజనీయమూ అయిన రచన. సాహిత్య ధోరణులకోణంలోంచీ చూసినప్పుడుకూడా యీ నవల సమకాలీనంగా వుంటుంది. ఆధునికానంతర (Post Modern) సాహిత్యధోరణులన్నీ యీ నవలలో వున్నాయి.

బ్రదర్స్ కరమజోవ్ లాంటి నవలను యేభాషలోకయినా అనువాదం చేయటం చాలాకష్టం. దాదాపు 70 రష్యన్ నవలల్ని యింగ్లీషులోకి అనువాదం చేసిన ప్రఖ్యాత అనువాదకురాలు కాన్‌స్టెన్స్ గార్నెట్ 1912లో యీ నవలను అనువాదం చేశారు. అయితే ఆమె అనువాదాల్నికూడా చాలామంది రచయితలూ, విమర్శకులూ తప్పుపట్టారు. రష్యన్ రచయితల యింగ్లీషు అనువాదాల వివాదాలను గురించి వొక విమర్శకుడు "అనువాద యుద్ధాలు" అనే వ్యాసమే రాశాడు.

అయితే అనువాదమన్నది యెప్పుడూ పెద్ద సర్దుబాటు మాత్రమే. మూలగ్రంథంలోని భావాల్నీ, అంశాల్నీ యథాతథంగా అనువాదంలోకి తీసుకురావడం అసాధ్యం. అయినా అనువాదాలు కొనసాగుతూ వుండడం చేతనే మానవుడి సృజనా, విజ్ఞానమూ యీ స్థాయికి చేరుకున్నాయి. పరిపూర్ణత మానవుడికెప్పుడూ అందనిదీ, వూరించేదీ అయిన గమ్యం మాత్రమే! అందువల్ల అనువాదమనే సర్దుబాటు తప్పనిసరి. అనువాదకుడు రెండు సంస్కృతులకూ, రెండు భిన్న నాగరితలకూ వారధిని నిర్మిస్తాడు. అతడికున్న పరిమితులనూ, యిబ్బందులనూ తెలుసుకున్నప్పుడే అతడిదెంత గొప్ప సాహిత్య సేవో తెలిసివస్తుంది.

బ్రదర్స్ కరమజోవ్‌ను అనువదించిన అరుణాప్రసాద్‌గారికీ సమయంలో తెలుగువాళ్లంతా ముక్తకంఠంతో కృతజ్ఞతలూ, అభినందనలూ చెప్పాలి. అలాగే శాశ్వతభర్తను అనువదించిన దాసరి అమరేంద్రగారికీ, దోస్తోయేవ్‌స్కీ కథల్ని అనువదించిన అరిపిరాల సత్యప్రసాద్ గారికి కూడా!

యిలాగే మిగిలిన దోస్తోయేవ్‌స్కీ రచనల్ని గూడా అనువదించి తెలుగువాళ్ల కందించాలన్న కుమార్ కూనపరాజు, సాహితీ ప్రచురణల లక్ష్మిగారలపూనిక ఫలవంతం కావాలని ఆశిద్దాం.

---

చేయించడం అదే మొదలు.

ఆరోజు అంతులేని సంతోషం నాకు కలిగింది.

మొదట బిగించిన ఆ బొమ్మ కలిగించిన ధైర్యంతోనే మరొక బొమ్మను నూలు దారంతో బిగించడానికి పూనుకున్నాను. అయితే ఆ బొమ్మ వాడుకకు వస్తుందని పూర్తి నమ్మకం నాలో లేదు. అయితే దాన్ని దారంతో కట్టి చూడవలసిన అవసరం ఉంది. అందువల్ల. నూలుదారం తీసుకొని బొమ్మను కొద్దికొద్దిగా బిగించాను. అలా బిగిస్తూ బిగిస్తూ పూర్తిగా బిగించాను.

బొమ్మ విరగలేదు.

ఆట ప్రదర్శించవచ్చని ధైర్యంతో మొదటి బొమ్మలా రెండో బొమ్మ చేత కూడా నృత్యం చేయించి చూద్దామని చేతిలోకి తీసుకుని అడుగు వేయించాను.

అది ఒక్క అడుగు వేయలేదు.

ఫట్‌మని విరిగిపోయింది.

అప్పుడు నా అడుగులు కూడా ఆగిపోయాయి.

ఒక్కసారిగా నా కాళ్లు చెట్టు కొమ్మల్లా విరిగి నేలకూలినట్టు అనిపించింది.

విరిగిన బొమ్మను మెల్లగా ఎత్తుకొని మౌనంగా చూస్తూ నిలబడిపోయాను.

నా భార్య పిల్లలు మాట్లాడకుండా, మౌనంగా, కలవరపడుతూ నా వైపు చూస్తూ ఉండిపోయారు.

నాకు తెలియకుండానే నా కళ్ళ నుంచి నీటి బొట్లు రాలిపోతున్నాయి.

అప్పుడు పిల్లలు మరలా వేరే ప్రాంతం నుంచి బొమ్మలు వెతికి తీసుకొస్తే సరిపోతుంది, బాధపడకండి అని ధైర్యం చెప్పారు. వారి మాటలు విని ధైర్యం వచ్చినప్పటికీ, బొమ్మ విరిగి ముక్కలైన చిత్రం నా కంటి నుంచి దూరం కాలేదు. తలుచుకుంటే ఇప్పటికీ ఆ చిత్రం కళ్ళ ముందుకు వస్తుంది. ఎందుకంటే నా జీవితంలో అలా బొమ్మ విరిగిపోయింది అదే మొదటిసారి. అదే చివరి సారి కూడా. ఆ కారణంగా ఆ రోజుటి చిత్రం ఇప్పటికీ నా కళ్ళలోంచి, మనసులోంచి పోకుండా నిలిచిపోయింది.

ఆట కోసం మా దగ్గర ఉన్న బొమ్మలను బిగించేటప్పుడు పాత సంఘటన భూతంలా నా ముందుకు వచ్చేస్తుంది. ఒకటి రెండు బొమ్మలు కాస్త పాడైపోయాయి. అయితే అవి మా దగ్గరికి వచ్చిన తర్వాత పాడైపోయినవి కావు. మేము మా దగ్గర ఉన్న బొమ్మలను పాడవ్వటానికి వదలం. వాటి రక్షణకోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటాం. తాతయ్య, నాన్న చెప్పిన జాగ్రత్తలు ఈనాటికీ మరువలేదు. మా ఇంటికి తీసుకొని రావడానికి ముందే అవి పాడైపోయాయి.

అప్పటి నుంచి బొమ్మలను బిగించి కట్టేటప్పుడు ఆ సంఘటన గుర్తుకు వచ్చి నన్ను విపరీతంగా వేధిస్తుంది.

బిగించి కట్టడానికి నాకు ధైర్యం చాల్లేదు.

ఇలాంటి అనేక భావోద్వేగాల సందర్భాలలో ఆ పనిని నా చేత మానిపించి, పిల్లలే ఆ పని పూర్తి చేస్తారు.

అందుకు నేను వారికి రుణపడి ఉన్నాను !

(తరువాయి వచ్చే సంచికలో...)

పుస్తక పరిచయం

# తిలక్ వ్యక్తిత్వం – కవితాతత్త్వం
## ఆచార్య తంగిరాల విశిష్ట వ్యాససంపుటి
# 'రసగంగాధర తిలకం'




**రసగంగాధర తిలకం దేవరకొండ బాలగంగాధర తిలక్(1921–1966) అభిరుచులు– అలవాట్లు, ఇతర వ్యాసాలు**

రచన: ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

పుటలు: 318

వెల రూ:300

ప్రతులకు :

అన్ని ప్రముఖ పుస్తక అంగళ్లు

**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో కృష్ణశాస్త్రి – శ్రీశ్రీల తరువాత యువకవి లోకాన్ని మిక్కిలిగా ప్రభావితం చేసిన మహాకవి దేవరకొండ బాలగంగాధర తిలక్ (1921–1966) శతజయంతి సందర్భంగా వీరి ప్రియశిష్యులైన ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు తాము రచించిన ఏడు వ్యాసాలను ఒక అందమైన గ్రంథంగా వెలువరించారు. తంగిరాలవారి ఒక విశిష్టమైన వ్యాసం ("తిలక్ అభిరుచులు–అలవాట్లు")తో ఈ సంపుటి ప్రారంభమవుతుంది. ఇది ఈ గ్రంథంలోని ప్రత్యేకాంశం. 1966 జూన్ 30వ తేదీ రాత్రి (జూలై 1వ తేదీ కాదు) తిలక్ గారు హఠాత్తుగా 45 సంవత్సరాల వయస్సులో చనిపోయినప్పుడు శ్రీ శ్రీ గారు "జవాబురాని ప్రశ్న" అనే స్మృతిగీతం వ్రాశారు. ఆ కవిత ముగింపులో "కవితా సతి నొసట నిత్య రసగంగాధర తిలకం" అన్నారు. ఆ పాదంలోని "రసగంగాధర తిలకం" అనే మాటను ఈ వ్యాససంపుటికి శీర్షికగా గ్రహించారు. వీరు 1955 నుండి 1961 వరకు ఆరు సంవత్సరాలపాటు తిలక్ గారిని అత్యంత భక్తితో సేవించిన ప్రియశిష్యులు. దీనికి తిలక్ రచించిన "తపాలా బంట్రోతు" కవిత ప్రబల సాక్ష్యంగా నిలుస్తోంది!

1966లో తంగిరాల వెంకట సుబ్బారావుగారు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో U.G.C. Fellowshipతో "తెలుగు వీరగాథా కవిత్వం" అనే అంశాన్ని గురించి పరిశోధన చేస్తున్నారు.

జూలై 2వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో తిలక్ మరణవార్తవిని దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే, తిలక్ గారితో తనకుగల సాన్నిహిత్యాన్ని పురస్కరించుకొని "తిలక్ అభిరుచులు–అలవాట్లు" అనే వ్యాసాన్ని వ్రాశారు. ఇది సుమారు 80 పుటల సుదీర్ఘవ్యాసం. కాలానుగుణమైన చిన్న చిన్న మార్పులతో ఈ పుస్తకంలో మొదటి వ్యాసంగా దానిని ప్రచురించారు. దీనికి మరో ఆరు వ్యాసాలు కూడా చేర్చారు.

ఒక వ్యాసానికి మరో వ్యాసానికి రచనా కాలంలో ఎన్నో ఏండ్ల వ్యత్యాసం ఉండటంవల్లా, ఏ వ్యాసానికావ్యాసాన్ని ప్రత్యేకంగా తీర్చి దిద్దడంవల్లా, అన్నీ కలిపి ఒక పుస్తకంగా ముద్రిస్తానని అనుకోకపోవడంవల్లా – ఒక వ్యాసంలో ముచ్చటించిన అంశాలు మరో వ్యాసంలో పునరుక్తమయ్యాయి. ముఖ్యంగా "తిలక్ గారితో నా పరిచయం'' – ''తిలక్ గారి తాతముత్తాతలు, సోదర సోదరీమణుల వివరాలు" – "తిలక్ సాహిత్య దశల విభజన" – "తపాలా బంట్రోతు కవిత పుట్టుక" – అనే అంశాలు రెండు మూడు వ్యాసాల్లో వచ్చాయి. "తపాలా బంట్రోతు" అనే కవిత తంగిరాలవారికి ఆత్మీయమూ గర్వకారణమూ అయిన కవిత. ఆ అభిమానంవల్ల దీనిలోని చరణాలు నాలుగు వ్యాసాల్లో పునరుక్తమవుతూ వచ్చాయి. పాఠకులు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తాను.

తిలక్ గారికి శతజయంతి నివాళిగా తంగిరాలవారు ఈ వ్యాసాలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కవిగా రచయితగా తిలక్ గారు అందరికీ తెలుసు. కాని వ్యక్తిగా చిత్రవిచిత్రమైన అభిరుచులు–అలవాట్లు కలిగిన మనవంటి సామాన్య మానవుడే అనే విషయం చాలామందికి తెలియదు. సుదీర్ఘమైన మొదటి వ్యాసం ఆయా విషయాలను సమగ్రంగా విశదీకరిస్తుంది. తిలక్ మొత్తం సాహిత్యాన్ని రెండవ వ్యాసం పరిచయం చేస్తుంది. మూడవ వ్యాసంలో తిలక్ వచన కవితా వైభవం, నాల్గవ వ్యాసంలో "తపాలా బంట్రోతు" కవిత పుట్టుక, ఐదవ వ్యాసంలో తిలక్ వచన కవిత్వంలోని భాషాశైలి, ఆరవవ్యాసంలో తిలక్ పద్యకవితా వైభవం తెలియజేశారు. చివరిదైన ఏడవ వ్యాసంలో లేఖలనుబట్టి తిలక్ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. తిలక్ అలభ్య పద్యకావ్యం "మండోదరి"ని గురించి తంగిరాలవారి మిత్రులు శ్రీపాద కృష్ణమూర్తి చెప్పిన విశేషాలు, తిలక్ మరణించినపుడు శ్రీశ్రీ వ్రాసిన స్మృతికవిత (Elegy), ఆచంట జానకిరాంగారికి తిలక్ వ్రాసిన పెద్దలేఖ, తిలక్ కుటుంబచరిత్ర, తణుకులోని శ్రీ నన్నయభట్టారక పీఠంవారు ప్రతిఏటా ఇచ్చే "తిలక్ సాహిత్య పురస్కారాల" పట్టిక తంగిరాల జీవనరేఖలు అనుబంధాలుగా పొందుపరిచారు.

"తిలక్ అభిరుచులు–అలవాట్లు" అనే మొదటి వ్యాసంలోను, ''తిలక్ వచన కవిత్వం–భాషాశైలి'' అనే ఐదవ వ్యాసంలోను తంగిరాలగారి మౌలికత ఎక్కువగా ఉండటం పాఠకులు గమనించగలరు. "తిలక్ పద్య కవితా వైభవం" అనే ఆరవ వ్యాసం కూడా నూతన విశ్లేషణతో కూడినట్టిదే! తిలక్ పద్య కవిత్వాన్ని గురించిన సమగ్రమైన వ్యాసం ఇదే అని నేను భావిస్తున్నాను. కాని "తిలక్ వచన కవితా వైభవం" అనే మూడవ వ్యాసంలో మాత్రం వీరు ప్రముఖ విమర్శకులు రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారు రచించిన "తిలక్ కవితా తత్త్వం–దృక్పథం" అనే వ్యాసం (చూ. లోపలికి... పుటలు 99–132) మీద ఎక్కువగా ఆధారపడ్డారు. అందువల్ల వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తిలక్ కవిత్వాన్ని ఇష్టపడే వాళ్ళంతా ఈ గ్రంథాన్ని తప్పక చదవాలి.

– డా॥ తోట వెంకటస్వామి 94926 31323

**ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?**

**పుస్తక పరిచయం**

# మా పిల్లల ముచ్చట్లు
## ఒక టీచర్ అనుభవాలు




రచన: సమ్మెట ఉమాదేవి
పుటలు: 256
అమూల్యం
ప్రతులకు:
సమ్మెట ఉమాదేవి
3-2-352, 2వ అంతస్తు, స్వామి వివేకానందా వీధి, ఆర్.పి.రోడ్డు, సికింద్రాబాద్-3
సెల్:9849406722

**లో**కంలో ఉపాధ్యాయులు భావి సమాజ నిర్మాతలుగా భాసిల్లుతారు. తన దగ్గర చదివే విద్యార్థుల్లో విద్యతో పాటుగా మానవీయ విలువల్ని పెంపొందించాలనే తపనగల ఉపాధ్యాయిని సమ్మెట ఉమాదేవిగారు. ఈమె పిల్లల ప్రేమికురాలు. ఉన్నత సంస్కారి. ఆదివాసి బాలబాలికలతో కాలం గడిపిన మహనీయురాలు. తాను పనిచేసిన పాఠశాలల్లోని పిల్లలతో గడిపిన ముచ్చట్లే -"మా పిల్లల ముచ్చట్లు" పుస్తకం.

ఎవరైనా(ఏ టీచరైనా) తమ ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలను, అనుభవాలను పేర్కొంటూ రచనలు చేయడం సర్వసాధారణం. కాని ఈ పంతులమ్మ కథారచయిత్రి, నవ్వుల పువ్వుల సృజనకారి. తన ఉద్యోగ జీవితంలో తండాలలో, పల్లెటూళ్ళలో, బస్తీలో తన దగ్గర చదివిన పిల్లల తోటి అనుబంధాలను, అనుభవాలను వాస్తవిక చిత్రంగా ఈ "మా పిల్లల ముచ్చట్లు"ను లోకం ముందుంచింది.

తరగతిగదిలో పాఠం చెప్పినదానికంటే, చెట్ల కింద చదువు చెప్పడాన్ని ప్రేమించిన టీచరు ఈమె. సాధారణంగా ఆయా కాలాల్లో పువ్వులు వెల్లివిరుస్తాయి. కాని, అన్ని కాలాల్లో వెల్లివిరిసే నవ్వుల కుసుమాలు మా దగ్గర చదివే పిల్లలు అని మురిసిపోతారు ఈ ఆదర్శ ఉపాధ్యాయిని. మారు మూల తండాల్లో రవళించిన పిల్లలముచ్చట్లే "మా పిల్లల ముచ్చట్లు".

ఆటాపాటల్తో, మాటామంతీతో విసుగూ విరామం లేకుండా పిల్లలతోను, చిరునవ్వులు చిందిస్తూ పిల్లల తల్లిదండ్రులతో, ఊరి పెద్దల్తో, తండా నాయకుల్తో, ఆఫీసుల్లో అధికారుల్తోను కాలం గడిపారు ఈ ఉమాదేవి గారు. పనిచేసే బడి దూరాభారాన్ని లెక్కపెట్టక, పిల్లలకి చదువు చెప్పాలనే తపనతో ఉద్యోగజీవితాన్ని ఒక పోరాటంలా గడిపిన టీచరు ఉమాదేవిగారి అక్షర రూపం- మా పిల్లల ముచ్చట్లు అని ఆమె వినయంగా ప్రకటించారు.

ఈమె పనిచేసిన బడులున్న ఊళ్ళకు ప్రయాణం ఇబ్బందైనా, నివాసం కష్టమైనా, సర్వీసంతా కళ్ళారా పల్లెల్ని, అడవుల్ని, పంటచేలల్ని, పూలని, ప్రకృతిని చూసే అదృష్టం పట్టిందని తృప్తి చెందుతారు ఈ టీచరు ఉమాదేవిగారు.

ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల్లోని పిల్లలు, అంగన్‌వాడి పాఠశాలల్లోని పిల్లల్తో గడపడంతో, సర్వీసు మొత్తం మీద మధురమైన అనుభూతుల్ని పొందడమేకాక, వాళ్ల జీవితాల్నుండి చాలా నేర్చుకున్నానంటారు- ఈ టీచరు ఉమాదేవిగారు.

బడులకు వెళ్ళి పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పుతూనే తీరిక సమయాల్లో దగ్గరలోని ఛానెళ్లలో వార్తలు చదివి, ఉత్తమ న్యూస్‌రీడర్ పురస్కారం అందుకున్నారు ఈ టీచరు గారు. ఆయా తండాల్లోని గిరిజన విద్యార్థుల్తో కలిసిపోయి, వాళ్ళ జీవన సంస్కృతుల్ని అవగాహన చేసుకొని సమాజ స్వభావాన్ని ఆకళింపు చేసుకొన్న దాని ఫలితంగా "అమ్మకథలు", "రేలపూలు" - కథా సంపుటాలు వెలువరించి- ఈ టీచరు రచయిత్రిగా బహుమతులు అందుకున్నారు.

మధిర గరల్స్ స్కూల్లో పనిచేసే రోజుల్లో సాయంత్రం స్కూలు వదిలిపెట్టి, స్టేషన్‌కు వెళ్ళి, ట్రైన్ ఎక్కి కూచున్నాక, రైలు కదుల్తున్నప్పుడు బడినుంచి హాస్టల్‌కు వెళ్ళే పిల్లలు కేలూపుతూ చెప్పే టాటాల పర్వం.... జన్మంతా సంతోషంగా మనసు పొరల్లో దాచుకునే అపురూప జ్ఞాపకం అంటారు ఈ టీచరు ఉమాదేవిగారు.

పుస్తకం మొదట్లోనే పాఠకుల్ని రండి, రండి మా పల్లెబడుల్లో విహరిద్దాం, మా పిల్లల్తో కాసేపు గడుపుదాం అని ఈ టీచరు ఆహ్వానం పలుకుతారు. జే గంట శీర్షికతో మొదలుపెట్టి 220వ శీర్షిక- ఉద్యోగ విరమణానంతరం యానం, ఉపసంహరణ, ధన్యవాదాలు శీర్షికలతో, 256 పేజీలతో మా పిల్లల ముచ్చట్లు పుస్తకం ముగుస్తుంది. కోరం రవీంద్రగారి ముఖచిత్ర కల్పన, మన్నెం శారదగారి చివరి అట్ట చిత్రం చూడ ముచ్చటగా ఉన్నాయి. వరప్రసాద్‌గారి "అమ్మఒడి తొలిబడి", చినవీరభద్రుడిగారి- "పిల్లల ప్రేమికుల పాఠ్యపుస్తకం", ఏనుగు నరసింహారెడ్డిగారి- "స్వర్గాన్ని సృష్టించుకొని దూసుకుపోతారు" జాస్తి శివగారి- "ఆలోచింపజేసే అనుభవాలసారం", కందుకూరి రాముగారి - "70MM లో ఒక అందమైన కల" అనే ముందు మాటల్తో, దాదాపు పేజీకొక ఫోటోగ్రాఫ్‌తో "మా పిల్లల ముచ్చట్లు" తప్పకుండా చదవవలసిన పుస్తకం. ప్రతి ఒక్కరు అపురూపంగా ఇంటి గ్రంథాలయంలో ఉంచుకోదగిన ఈ పుస్తకం. భావితరాలకి స్ఫూర్తి కారకం.

- డా॥వెన్నిసెట్టి సింగారావు
9393015584

**రచయితలకు విన్నపం:**
తాము రచించిన పుస్తకాలను సమీక్షకోసం / పుస్తక పరిచయం కోసం పంపేవారు రెండు ప్రతులను పంపించాలి. తమకు తాముగా కొందరు సమీక్షలను వ్రాయించి పంపుతున్నారు. వాటిని స్వీకరించలేము.
పుస్తక పరిచయం లేదా సమీక్షను ప్రచురించడం ప్రచురించకపోవడం పూర్తిగా సంపాదకుని నిర్ణయాన్ని బట్టి ఉంటుంది.
దయచేసి ఈ విషయంలో ఒత్తిడి చేయవద్దు. -సం.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

## ఆగ్నేయాసియాలో తెలుగువారి చరిత్ర
## అందరూ చదివితీరవలసిన ఉత్తమ పుస్తకం
### వెంటనే కొని చదవండి




మగాడు, ఒకలప్ప, చామదేవి, నూకరాజు, సన్నరాజు,
వెంకటరంగమ్మ... సాధారణమైన పేర్లు కావు.
మయన్మార్, థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా, శ్రీలంక
లను ఒకప్పుడు ఏలిన రాజులు, రాణులు.
ఈ పేర్లు ఆయా దేశాలలో ప్రాచీన రాజ్యాలకు తెలుగునేలతో
దగ్గరి సంబంధం ఉందనడానికి గట్టి సాక్ష్యాలు.
శ్రీలంకలో తొలి, మలి రాజ్యాలూ తెలుగువారివే.
మయన్మార్‌లో తటోను, హంసావతి, మర్తబాన్ రాజ్యాలు;
థాయిలాండ్‌లో ద్వారావతి, హరిపుంజాయి;
వియత్నాంలోని చంపారాజ్యం; ఇండోనేషియాలోని
తరుమ నగరం, శైలేంద్ర, మాతరం రాజ్యాలలో తెలుగువారి
ఆనవాళ్లు నేటికి స్పష్టంగా ఉన్నాయి. అక్కడ ప్రాచీన లిపికి
మూలం మన తెలుగు నేతే. శిల్పానికి ప్రేరణ అమరావతి.
కాంబోడియాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన అంగ్‌కార్‌వాట్
ఆలయంలో అమరావతి శిల్పానికి విస్తృతరూపం కనిపిస్తుంది.
ఈ విషయాల్ని తెలియచేసే పరిశోధనాత్మక నవల ఇది.
వేల యేళ్ళనాడు ఆగ్నేయాసియాలో అజరామరమైన
తెలుగు ఖ్యాతికి అక్షరరూపం.

**అమ్మనుడి**లో ధారావాహికగా ప్రచురించిన ఈ నవల
**జగమునేలిన తెలుగు** పుస్తకంగా వెలువడింది.

వెల: రూ. 200/-

ప్రతులకు: తెలుగుజాతి (ట్రస్ట్)
8-386, జీవక భవనం, అంగలకుదురు(పోస్టు)
తెనాలి - 522 211, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ammanudi@gmail.com,
ఫోన్: 98480 16136 / 94404 48244

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
November 2021 Vol :7, Issue 6

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244